ఆ నిబంధన మీరు పెట్టిందే!

2017నాటి జీవో నిబంధననే కొనసాగిస్తున్నాం

6 నుంచి ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్లు చదివిన ప్రాంతానికి స్థానికత వర్తింపజేయలేం

వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై కేటీఆర్ వ్యాఖ్యలకు బదులిచ్చిన మంత్రి రాజనర్సింహ 12

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 7-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 130

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: తదియ రా. 10.06 తదుపరి చవితి; నక్షత్రం పుబ్బ రా. 8.30 తదుపరి ఉత్తర వర్జ్యం: తె. 4.37 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.55-12.46; అమృతఘడియలు: మ. 1.21-3.08; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.59; సూర్యాస్తమయం: 6.41

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




క్యూబా రెజ్లర్ యుస్నిలీస్ లోపెజ్‌ను మట్టికరిపించిన వినేశ్ ఫొగట్

వాహ్.. వినేశ్

పారిస్ ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన భారత రెజ్లర్.. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా రికార్డు

నేడు అమెరికా యువతితో స్వర్ణం కోసం పోరు.. జావెలిన్ త్రోలో తుది సమరానికి నీరజ్ చోప్రా

ఒలింపిక్స్ మహిళల 50 కేజీల రెజ్లింగ్..! భారత క్రీడాకారిణి వినేశ్ ఫొగట్‌కు తొలి రౌండ్ ప్రత్యర్థి జపాన్‌కు చెందిన అజేయ రెజ్లర్ సుసాకి..! డిఫెండింగ్ చాంపియన్ కూడా..! అభిమానులంతా ఆశలు వదిలేసుకున్నారు..! కానీ, అద్భుతం చేసింది వినేశ్. మొదట అంచనా కోసం నెమ్మదించి.. తర్వాత రక్షణాత్మకంగా వ్యవహరించి.. బలమైన ప్రత్యర్థిని వ్యూహాత్మకంగా దెబ్బకొడుతూ.. ఆఖరి 15 సెకన్లలో సివంగిలా విరుచుకుపడింది..! ఈ ఎదురుదాడిని ఊహించని సుసాకి చిత్తరపోయి చేతులెత్తేసింది..! ఇదే ఊపులో వినేశ్ క్వార్టర్స్, సెమీస్‌ను సునాయాసంగా గెలిచేసింది..! ఒలింపిక్స్‌లో ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా రికార్డులకెక్కింది. బుధవారం రాత్రి అమెరికా రెజ్లర్ సారా హిల్డెబ్రాంట్‌తో వినేశ్ తలపడనుంది. నెగ్గితే స్వర్ణంతో చరిత్ర సృష్టించనుంది. ఓడినా రజతంతో సంతృప్తిగా వెనక్కురానుంది. మరోవైపు అంచనాలను నిజం చేస్తూ.. వేయి కళ్లతో ఎదురుచూసిన అభిమానులను మురిపిస్తూ.. వరుసగా రెండో ఒలింపిక్ స్వర్ణానికి గురిపెడుతూ.. జావెలిన్ త్రో ఫైనల్‌కు చేరాడు నీరజ్ చోప్రా. హాకీలో భారత జట్టు తీవ్రంగా పోరాడినా.. 2-3 తేడాతో జర్మనీ చేతిలో ఓడిపోయింది.



నీరజ్ చోప్రా

నెగ్గిన విద్యార్థుల పంతం

బంగ్లా ప్రభుత్వాధినేతగా నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్

అర్ధరాత్రి అధ్యక్ష కార్యాలయం ప్రకటన

బంగభవన్‌లో అధ్యక్షుడు షహబుద్దీన్‌తో ఆరు గంటల పాటు విద్యార్థుల సుదీర్ఘ చర్చలు

చర్చల నడుమ త్రివిధ దళాధిపతుల రంగప్రవేశం

అధ్యక్ష భవనం చుట్టూ మోహరించిన మిలటరీ

ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉత్కంఠ

మాజీ ప్రధాని ఖలీదా జియా విడుదల

గందరగోళంలో ప్రభుత్వోద్యోగులు

హింసతో ఆందోళకారుల బీభత్సం

దేశవ్యాప్తంగా హత్యలు.. లూటీలు

పోలీస్‌స్టేషన్లకూ నిప్పు పెట్టిన దుండగులు

బంగ్లాలో 19వేల మంది భారతీయులు

గత నెలలోనే చాలామంది తిరిగి వచ్చేశారు

హసీనా షాక్‌లో ఉన్నారు.. తర్వాత మాట్లాడతాం

అఖిలపక్ష భేటీలో విదేశాంగ మంత్రి జై శంకర్

కల్లోలం వెనుక విదేశీ హస్తం!

అమెరికా కుట్ర? ఖలీదా కుమారుడు పాక్‌తో కలిసి పన్నిన వ్యూహం?.. పలు విశ్లేషణలు



ఢాకా, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఏర్పాటుపై ఉత్కంఠ వీడింది..! నోబెల్ అవార్డు గ్రహీత మహమ్మద్ యూనస్‌ను తాత్కాలిక ప్రభుత్వాధినేతగా దేశాధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ ప్రకటించారు. తన అధికార నివాసం బంగభవన్‌లో విద్యార్థి సంఘాల నేతలు, త్రివిధ దళాధిపతులతో సుదీర్ఘంగా జరిగిన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అధ్యక్షుడి కార్యదర్శి జోనాల్ అబేదిన్ ఓ ప్రకటన చేశారు. వివిధ పక్షాలు, రాజకీయ పార్టీలతో చర్చించాక.. తాత్కాలిక ప్రభుత్వంలో మిగిలిన సభ్యుల పేర్లను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. దీంతో.. విద్యార్థి సంఘాలు తమ పంతం నెగ్గించుకున్నట్లైంది. మరోవైపు దేశవ్యాప్తంగా ఆందోళనకారులు ఉధృతంగా హింసకు పాల్పడ్డట్లు వెల్లడైంది. చాలా చోట్ల హత్యలు, లూటీలు జరిగాయి. పోలీస్‌స్టేషన్లకు కూడా ఆందోళనకారులు

మిగతా 2వ పేజీలో...

2

హసీనాకు ఆశ్రయానికి బ్రిటన్ నిరాకరణ

నిబంధనలు అనుమతించవని వెల్లడి.. వీసా రద్దు చేసిన అమెరికా



మార్పు వెనుక 26 ఏళ్ల యువకుడు

విద్యార్థి సంఘాల సమన్వయకర్త నహీద్

రిజర్వేషన్ల ఉద్యమాన్ని పెను తుఫానుగా మార్చడంలో కీలక పాత్ర 2

వలస సమస్యకు మతం రంగు!

బ్రిటన్‌లో హింసాకాండకు ఇదే కారణం 12

అక్రమంగా వస్తున్న వారిపై ప్రజల్లో అసంతృప్తి

మతం పేరిట రెచ్చగొడుతున్న రైటిస్ట్ సంస్థలు

ఉక్కుపాదం మోపుతాం: ప్రధాని స్టార్మర్

రాజధానికి మల్లన్న సాగర్ నీళ్లు



ప్రాజెక్టు నుంచి 15 టీఎంసీలు తెచ్చేలా ప్లాన్

హైదరాబాద్‌లో తాగునీటికి10 టీఎంసీలు

ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌తో పాటు మూసీ నది ప్రక్షాళనకు 5 టీఎంసీలు

ప్రాజెక్టుకు 5,560 కోట్లు కేటాయిస్తూ జీవో

రెండేళ్లలో పూర్తి చేయాలని సర్కారు లక్ష్యం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహా నగరానికి భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో భాగంగా మల్లన్న సాగర్ నుంచి నీటిని తరలించే పనులకు సర్కారు పచ్చజెండా ఊపింది. ఇప్పటికే నగరంలో తాగునీటి అవసరాల కోసం గోదావరి మొదటి దశ ద్వారా 163 ఎంజీడీల(మిలియన్ గ్యాలన్స్ పర్ డే) నీరు సరఫరా చేస్తుండగా.. ఇప్పుడు రెండో దశ నీటిని

మిగతా 12వ పేజీలో...

సగానికి పైగా నిండిన ఎస్సారెస్పీ

శ్రీశైలానికి భారీగా వరద.. గేట్లన్నీ ఓపెన్ 3

పులిచింతల్లో రెండేళ్ల తర్వాత విద్యుదుత్పత్తి



స్వచ్ఛ బయో సంస్థ చైర్‌పర్సన్ ప్రవీణ్ పరిపాటితో ఎంవోయూలు కుదుర్చుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి

రూ.1000 కోట్లతో స్వచ్ఛ బయో ప్లాంట్

హైదరాబాద్‌లో నెలకొల్పనున్న సంస్థ

సీఈవోతో సీఎం రేవంత్ బృందం చర్చలు.. ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్ విస్తరణ

మూడేళ్లలో వెయ్యి మందికి ఉద్యోగం.. ఆర్సీసీఎం విస్తరణతో 500 నియామకాలు

అమెరికా పర్యటనలో రేవంత్ ఒప్పందాలు.. చైనాతో పోటీ పడదాం

హైదరాబాద్, అమెరికాకు అనేక సారూప్యతలు.. పారిశ్రామికవేత్తలతో సీఎం భేటీ

టైమ్‌స్క్వేర్‌లో రేవంత్ పర్యటన దృశ్యాల ప్రదర్శన

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు పెట్టుబడులు సాధించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన విజయవంతంగా సాగుతోంది. మంగళవారం న్యూయార్క్ పర్యటనలో భాగంగా పలు అంతర్జాతీయ సంస్థల అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. కాగా, బయో ఫ్యూయల్స్ తయారీ సంస్థ 'స్వచ్ఛ బయో' తెలంగాణలో పెట్టుబడులకు సిద్ధపడింది. త్వరలో రాష్ట్రంలో సెకండ్ జనరేషన్ సెల్యులోసిక్ బయో ఫ్యూయల్ ప్లాంట్‌ను

మిగతా 13వ పేజీలో...

15న మూడో విడత రుణమాఫీ

14

ఖమ్మం జిల్లా వైరా సభలో 2 లక్షలు మాఫీ చేయనున్న సీఎం

రేషన్ కార్డు లేనివారికి.. పాస్‌బుక్‌తో కుటుంబం నిర్ధారణ

మాఫీపై తప్పుడు ప్రచారం బీఆర్ఎస్, బీజేపీకి తగదు: తుమ్మల

మూడు రోజుల్లో రూ.22 లక్షల కోట్లు ఆవిరి

భారీ లాభాల నుంచి స్వల్ప నష్టాల్లోకి సూచీలు

సెన్సెక్స్ 166 పాయింట్లు డౌన్.. 24,000 దిగువకు నిఫ్టీ

స్థిరాస్తి అమ్మకందారులకు ఊరట

దీర్ఘకాలిక మూలధన లాభాల పన్నుపై స్వేచ్ఛ 9

ఎండగట్టండి

గ్రామాల్లో రైతు రచ్చ బండ పెట్టండి

సర్కారును నిలదీస్తూ ఆందోళనలు చేయండి

పార్టీ శ్రేణులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపు



హైదరాబాద్/న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ అమలులో కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. రైతు డిక్లరేషన్ పేరుతో ఎన్నికల ముందు ఆర్భాటంగా హామీ ఇచ్చిన కాంగ్రెస్.. రుణమాఫీ, రైతుభరోసా అమలులో రైతులకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి

మిగతా 13వ పేజీలో...

బీరు మరింత ప్రియం!

బ్రూవరీలకు ప్రభుత్వం చెల్లిస్తున్న కొనుగోలు ధర పెంపు 12

భారం వినియోగదారులపై.. సెప్టెంబరు నుంచి అమల్లోకి



నెగ్గిన విద్యార్థుల పంతం


మహ్మద్ యూనస్

(మొదటి పేజీ తరువాయి)

నిప్పుపెట్టారు. హిందువుల, అవామీ లీగ్ నేతలే లక్ష్యంగా దాడులు జరిగాయి. జైళ్లను బద్దలు చేయడంతో.. ఖైదీలు పరారయ్యారు.

సైన్యం ప్రవేశంతో ఉత్కంఠ..!

మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటుపై మంగళవారం ఉదయం నుంచి సందిగ్ధత నెలకొంది. "ప్రజలు ఎన్నుకోని వారికి ఒక్క నిమిషం కూడా అధికారం ఇవ్వొద్దు. అలా చేస్తే.. బంగ్లాదేశ్ మరో పాకిస్థాన్ అవుతుంది".. అని హసీనా కుమారుడు నజీబ్ వజీద్ జాయ్ ముందే హెచ్చరించారు. విద్యార్థి సంఘాల సమన్వయ కర్త నహీద్ ఇస్లాం కూడా మధ్యంతర పౌర ప్రభుత్వానికే ఆమోదం తెలుపుతామని భీష్మించారు. ఆర్మీ పాలనను అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. నోబెల్ గ్రహీత మహమ్మద్ యూనస్ నేతృత్వంలో సర్కారు ఉండాలని పేర్కొన్నారు. యూనస్ కూడా.. ఎంతో త్యాగం చేసిన విద్యార్థుల కోసం తాను ప్రభుత్వాన్ని నడిపేందుకు సిద్ధమేనని ప్రకటన చేశారు. అయితే.. ఆర్మీ చీఫ్ వకార్-ఉజ్-జమా మాత్రం సైనిక పాలన వైపే మొగ్గు చూపుతున్నట్లు వార్తలొచ్చాయి. ఈ పరిణామాల మధ్య బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహమ్మద్ షహబుద్దీన్ మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి విద్యార్థి సంఘాల నాయకులు, త్రివిధ దళాల అధిపతులతో తన అధికారిక నివాసం 'బంగభవన్'లో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చలు జరుగుతుండగానే రాత్రి 7.40 గంటల సమయంలో ఆర్మీ చీఫ్ సహా త్రివిధ దళాధిపతులు బంగభవన్ చేరుకొని చర్చల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత అర్ధరాత్రి వరకు గంటగంటకూ బంగభవన్ వెలుపల ఆర్మీ మోహరింపు పెరుగుతూ వచ్చింది. దీంతో ఉత్కంఠ నెలకొంది. చివరకు అర్ధరాత్రి 12 గంటల సమయంలో.. తాత్కాలిక ప్రభుత్వానికి అధినేతగా యూనస్ ఉంటారంటూ అధ్యక్ష కార్యాలయం నుంచి ప్రకటన వెలువడడంతో ఉత్కంఠ వీడింది.

ఖలీదా విడుదల

బీఎన్‌పీ చైర్‌పర్సన్ ఖలీదా జియా నిర్బంధం నుంచి విడుదలయ్యారు. సోమవారం రాత్రే ఆమె విడుదలకు అధ్యక్షుడు ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆమె 2018 ఫిబ్రవరి 8 నుంచి రెండేళ్ల పాటు జైలులో ఉన్నారు. ఆమెకు అవినీతి కేసుల్లో 13 ఏళ్ల జైలు శిక్ష పడగా.. 2020 మార్చి 25న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ద్వారా ఆమె విడుదలయ్యారు. ఆ తర్వాత హోంఅరెస్టులో ఉన్నారు. మాజీ సైనికాధికారి, బ్రిగేడియర్ జనరల్ అబ్దుల్లా-ఉల్-అమన్ అజ్మీ, సుప్రీంకోర్టు న్యాయవాది అహ్మద్-బిన్-ఖాసీం(అర్మాన్) జైలు నుంచి విడుదలయ్యారు. అబ్దుల్లా-ఉల్-అమన్‌కు 1971 నేరాలకు వ్యతిరేకంగా మరణ శిక్ష పడింది. దాంతో ఎనిమిదేళ్ల క్రితం ఆయనను విధుల నుంచి తొలగించారు.

హత్యలు.. లూటీలు

షేక్ హసీనా రాజీనామా తర్వాత.. దొమ్మీలు చేసే గుంపులు ఆందోళనకారుల్లో కలిసిపోయి.. రాత్రి 7.30 గంటల నుంచి అర్ధరాత్రంతా దేశవ్యాప్తంగా హత్యలు, లూటీలు చేశాయి. సినీనటుడు శాంటోఖాన్ మొదలు.. అవామీ లీగ్ పార్టీకి చెందిన జిల్లా, తాలూకా నేతల దాకా పలువురు హత్యకు గురయ్యారు. వారి ఇళ్లకు నిప్పు పెట్టారు. పోలీస్‌స్టేషన్లలోనూ లూటీ చేసి, కంప్యూటర్లు, ఏసీలు, తుపాకీలను దోచుకున్నారు. చివరకు పోలీసు వాహనాల విడిభాగాలను కూడా వదిలిపెట్టలేదని బంగ్లాదేశీ పత్రికలు కథనాలను ప్రచురించాయి. ఢాకాలోని సావర్‌లో జరిగిన హింసలో 31 మంది చనిపోయారు. కాక్స్‌బజార్, ఎయిర్‌పోర్ట్ రోడ్డు, సిల్వర్‌సైన్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్లు, ఏటీఎం కేంద్రాలు లూటీకి గురయ్యాయి. ఈ ప్రాంతాల్లో జరిగిన హింసలో ఇద్దరు బీఎన్‌పీ నేతలు సహా.. 14 మంది మరణించారు. లాల్‌మొనిర్హాట్‌లో అవామీ లీగ్ నేత సుమోన్‌ఖాన్ ఇంటిని తగులబెట్టగా.. ఆరుగురు కుటుంబ సభ్యులు సజీవదహనమయ్యారు. జస్సోర్‌లోని అవామీ నేత షాహిన్ చక్కల్దర్‌కు చెందిన 14 అంతస్తుల 'హోటల్ జబీర్ ఇంటర్నేషనల్'కు నిప్పు పెట్టిన ఘటనలో మృతుల సంఖ్య 24కు చేరుకుందని అధికారులు తెలిపారు. కోటా ఆందోళనలు ప్రారంభమైనప్పటి నుంచి 440 మరణాలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

రెండు జైళ్లపై దాడి.. లూటీ.. ఖైదీల పరార్

సోమవారం జరిగిన ఆందోళనల్లో రెండు జైళ్లు ధ్వంసమయ్యాయి. వాటిల్లోని కరడుగట్టిన ఖైదీలు పరార్ అయ్యారు. ఆందోళనకారులు జైళ్లలోనూ దోపిడీకి పాల్పడ్డారు. షేర్పూర్‌లో ఉన్న జిల్లా జైలు గేట్లను బద్ధలు కొట్టిన సుమారు 10 వేల మంది ఆందోళనకారులు లోనికి దూసుకెళ్లారు. ఈ క్రమంలో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న 10 మంది కరడుగట్టిన ఖైదీలతో పాటు 500 మందికి పైగా ఖైదీలు పారిపోయారు. సత్ఖిరా జిల్లా జైలులో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. ఇక్కడ 596 మంది ఖైదీలు పారిపోయారు.

అయోమయంలో ఉద్యోగులు

ప్రభుత్వోద్యోగులు మంగళవారం విధులకు హాజరైనా.. చాలా చోట్ల కార్యాలయాలు తెరుచుకోలేదు. పార్లమెంట్ సచివాలయం, సుప్రీంకోర్టులోకి ఉద్యోగులను వెళ్లనీయలేదు. ప్రభుత్వ వెబ్‌సైట్లను డౌన్ చేశారు. మరికొన్ని కార్యాలయాల్లో ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించారు. పోలీసుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఢాకా సహా.. ప్రధాన నగరాల్లో సింహభాగం పోలీస్‌స్టేషన్లను ఆందోళనకారులు తగుల బెట్టారు. చాంద్‌పూర్‌లో ఐదు ఠాణాల్లో లూటీ జరగ్గా.. ఓ ఎస్సై హత్యకు గురయ్యారు. బనియాచౌక్‌లో ఓ పోలీసు అధికారిని చంపి, చెట్టుకు వేళాడదీశారు.

ఆర్థికవేత్త నుంచి.. ప్రభుత్వాధినేతగా

▸▸ మహమ్మద్ యూనస్ ప్రస్థానం

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేతగా నియమితుడైన మహమ్మద్ యూనస్ ఆర్థికవేత్తగా సుపరిచితుడు. 2006లో నోబెల్ శాంతి పురస్కారం అందుకున్న యూనస్ 1940 జూన్ 28న తూర్పు బెంగాల్(ప్రస్తుతం బంగ్లాదేశ్)లోని చిట్టాగాంగ్‌లో జన్మించారు. ఆయన విద్యాభ్యాసమంతా చిట్టాగాంగ్‌లోనే జరిగింది. ఆ తర్వాత ఆయన పలు దేశాల వర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. గ్రామీణ బ్యాంకులను స్థాపించి.. మైక్రోక్రెడిట్, మైక్రోఫైనాన్స్ విధానాలను పరిచయం చేశారు. ఈ అంశంపైనే ఆయనను నోబెల్ వరించింది. ఆయనను నోబెల్‌కు ఎంపిక చేసినప్పుడు ఆ పురస్కార కమిటీ బ్యాంకు రుణాలకు అర్హులు కాని పేద, గ్రామీణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గ్రామీణ బ్యాంకు ఓ దిక్సూచి వంటిదని వ్యాఖ్యానించింది. ఆర్థిక రంగానికి ఆయన చేసిన సేవకు గాను.. అమెరికా సహా.. పలు దేశాలు యూనస్‌ను పలు పురస్కారాలతో గౌరవించాయి. యూనస్ 2009లో అమెరికా ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అవార్డు అందుకున్నారు.

ఎవరీ నహీద్?

హసీనా రాజీనామా చేసి, భారత్ వెళ్లడానికి.. బంగ్లాదేశ్‌లో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటు నిర్ణయాల వెనక.. విద్యార్థి సంఘాల సమన్వయకర్త.. 26 ఏళ్ల నహీద్ ఇస్లాం ఉన్నారు. చిన్నగా ప్రారంభమైన రిజర్వేషన్ల ఉద్యమాన్ని.. చినికిచినికి గాలివానగా మార్చడంలో నహీద్ కీలక పాత్ర పోషించారు. 1998లో ఢాకాలో జన్మించిన నహీద్.. ఢాకా విశ్వవిద్యాలయంలో సోషియాలజీ చదువుతున్నారు. గత నెల పోలీసులు ఇతణ్ని అరెస్టు చేయడంతో పాపులర్ అయ్యారు. పోలీసులు అతణ్ని స్పృహ తప్పేలా కొట్టడం.. రోడ్డుపై పారేయడం వంటి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో.. అనతికాలంలోనే పాపులర్ అయ్యారు.


మంగళవారం పోలీసులు విధుల్లోకి రాకపోవడంతో ఢాకాలో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న ఓ విద్యార్థి

విద్యార్థుల డిమాండ్లివే!

- ప్రభుత్వ పదవీకాలాన్ని 6 సంవత్సరాలకు పెంచాలి. ప్రభుత్వ కాలపరిమితి ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాలి
- ప్రస్తుత ఎన్నికల సంఘాన్ని రద్దు చేసి, కొత్త అధికారులను నియమించాలి. పక్షపాత ధోరణితో వ్యవహరించే ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులను తొలగించాలి
- హసీనా ప్రభుత్వం వివిధ శాఖల్లో నియమించిన కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలి
- విద్యార్థుల త్యాగానికి గుర్తుగా.. జూలై నెలలో జాతీయ సంతాపదినంగా ప్రకటించాలి. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు పరిహారాన్ని చెల్లించాలి
- గడిచిన 15 ఏళ్లుగా దేశంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి, కారకులను శిక్షించాలి.


దినాజ్‌పూర్‌లో ఓ ఆలయానికి ముస్లింల కాపలా

హిందువుల ఆలయాలు, ఇళ్లపై దాడి

బంగ్లాదేశ్ వ్యాప్తంగా హిందూ ఆలయాలు, హిందువుల దుకాణాలు, ఇళ్లపై దాడులు, లూటీలు జరిగాయని బంగ్లాదేశ్ వార్తాసంస్థలు వెల్లడించాయి. హిందువుల తోపాటు.. ముస్లిముల్లో అహ్మదీయ వర్గానికి చెందిన వారిని టార్గెట్‌గా చేసుకున్న ఆందోళనకారులు హత్యలు, లూటీలకు పాల్పడ్డట్లు పేర్కొన్నాయి. దినాజ్‌పూర్‌లోని బోచాగంజ్‌లో హిందువులకు చెందిన 40 దుకాణాలు ధ్వంసమయ్యాయి. అయితే.. ఇస్లామీ ఆందోళన్ కార్యకర్తలు, ముస్లిం పెద్దలు కూడా హిందూ ఆలయాలను కాపాడేందుకు కర్రలు పట్టుకుని, గస్తీ తిరిగారు. కాగా.. బంగ్లాదేశ్‌లో హిందువులు, మైనారిటీలపై జరుగుతున్న హింసను ఐరోపా సమాఖ్య ఢాకా కార్యాలయం ఖండించింది. మైనారిటీల భద్రతకు చర్యలు తీసుకోవాలని ఎక్స్‌లో కోరింది.

హసీనాకు ఆశ్రయానికి బ్రిటన్ నిరాకరణ

వలస నిబంధనలు అనుమతించవని వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆశ్రయం ఇచ్చేందుకు బ్రిటన్ నిరాకరించింది. ఒక వ్యక్తి ఆశ్రయం కోరుతూ లేదా శరణార్థిగా వచ్చేందుకు తమ వలస చట్టాలు అనుమతించవని బ్రిటన్ హోం శాఖ కార్యాలయం పేర్కొంది. సైన్యం అల్టిమేటంతో వెంటనే ప్రధాని పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిన హసీనా.. ఉన్నపళంగా సైనిక విమానంలో భారత్ చేరుకున్న సంగతి తెలిసిందే. ఆమె తన సోదరి షేక్ రెహానాతో కలిసి భారత్ నుంచి లండన్ వెళతారని, అక్కడ ఆశ్రయం కోరతారన్న ప్రచారం నేపథ్యంలో బ్రిటన్ నిరాకరణ ప్రాధాన్యం సంతరించుకుంది. హసీనా సోదరి రెహానా బ్రిటన్ పౌరురాలు. ఆమె కుమార్తె తులిప్ సిద్దిఖీ ప్రస్తుతం లేబర్ పార్టీ తరఫున పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం అక్కడ లేబర్ పార్టీనే అధికారంలో ఉంది. ఈ క్రమంలోనే అక్కడ ఆశ్రయం పొందాలని హసీనా భావించారు. కాగా, బంగ్లాదేశ్ నుంచి హసీనాను భారత్ తీసుకొచ్చిన సైనిక విమానం సీ-130జే ఖాళీగా వెనక్కి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా, హసీనా వీసా యాక్సెస్‌ను మంగళవారం అమెరికా రద్దు చేసింది.

నాడు నేను, నేడు హసీనా



న్యూఢిల్లీ, ఆగస్టు 6: షేక్ హసీనా బంగ్లాదేశ్‌ను వీడడంపై ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాడు బంగ్లాదేశ్ నుంచి తనని తరమేసిన ఇస్లామిక్‌వాదుల ఒత్తిడి వల్లే నేడు షేక్ హసీనా దేశాన్ని వీడారంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇస్లామిక్‌వాదులు, అవినీతి, అక్రమాలను ప్రోత్సహించడం వల్లే హసీనాకు ఈ పరిస్థితి ఎదురైందని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో మహిళల సమానత్వంపై తస్లీమా రాసిన లజ్జ అనే నవల 1990ల్లో తీవ్ర వివాదాస్పదమైంది. ఇస్లామికవాదుల ఒత్తిడుల నేపథ్యంలో తస్లీమా దేశ బహిష్కరణకు గురయ్యారు. బంగ్లాలో తాజా పరిణామాలపై తస్లీమా స్పందిస్తూ.. "హసీనా ప్రస్తుత పరిస్థితికి ఆమే బాధ్యురాలు. ఇస్లామిక్‌వాదులను, అవినీతి, అక్రమాలను ప్రోత్సహించింది ఆమే. బంగ్లాదేశ్ పాకిస్థాన్‌లా మారకూడదు. సైనిక పాలన ఉండకూడదు. రాజకీయ పార్టీలు దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని తీసుకురావాలి" అని పోస్ట్ చేశారు.

రాడార్ల నిఘాలో.. రాఫెల్‌ల రక్షణతో

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో సోమవారం అల్లకల్లోలం నేపథ్యంలో షేక్ హసీనా ఇండియాకు బయల్దేరారని తెలుసుకున్న భారత భద్రతా బలగాలు బంగ్లాదేశ్ గగనతలాన్ని అనుక్షణం పర్యవేక్షించాయి. అటు వైపు నుంచి వచ్చే విమానాలపై వాయుసేన రాడార్లు ప్రత్యేకంగా నిఘా పెట్టాయి. మధ్యాహ్నం 3గంటల సమయంలో బంగ్లాదేశ్ గగనతలం నుంచి విమానం భారత్‌వైపు రాగా.. వెంటనే అధికారులు ఆ విమానంలోని సిబ్బందితో సంప్రదింపులు జరిపారు. హసీనా విమానానికి రక్షణగా పశ్చిమ బెంగాల్‌లోని హాసీమరా వైమానిక స్థావరం నుంచి 101స్క్వాడ్రన్‌లోని రెండు రాఫెల్ యుద్ధవిమానాలు వెంట వచ్చాయి. హసీనా విమానం సాయంత్రం 5.45గంటల సమయంలో యూపీలోని హిండన్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయింది.



బంగ్లాదేశ్‌లో 19 వేల మంది భారతీయులు

మంగళవారం బంగ్లాదేశ్ నుంచి తిరిగి వస్తున్న భారత ట్రక్కు డ్రైవర్లు

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాజకీయ సంక్షోభం నెలకొన్న బంగ్లాదేశ్‌లో మొత్తం 19 వేల మంది భారతీయులు ఉన్నారని, వీరిలో 9 వేల మంది విద్యార్థులేనని విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. ఆందోళనలు మొదలైన జూలైలోనే చాలామంది వచ్చేశారని చెప్పారు. పొరుగు దేశం సైన్యంతో పాటు మన రాయబార కార్యాలయాల ద్వారా వారితో సంప్రదింపుల్లో ఉన్నామని, వారికి భద్రతాపరంగా ఇబ్బందులు లేవని అన్నారు. మైనారిటీలకు చెందిన ఆలయాలు, వ్యాపార కేంద్రాలపై దాడులు జరుగుతన్నట్లుగా మాత్రం దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికిప్పుడు భారతీయులను తరలించేంతటి తీవ్ర స్థాయి పరిస్థితులు బంగ్లాదేశ్‌లో లేవని స్పష్టం చేశారు. బంగ్లాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో జైశంకర్ మంగళవారం లోక్‌సభ, రాజ్యసభలలో ప్రకటన చేశారు. కేంద్ర హోం, రక్షణ శాఖ మంత్రులు, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఇండియా కూటమి నేతలు హాజరైన అఖిలపక్ష సమావేశంలో మాట్లాడారు. జనవరిలో ఎన్నికలు పూర్తయినప్పటి నుంచే బంగ్లాలో అశాంతి నెలకొందని, దీనిపై హెచ్చరికలు కూడా చేశామని జైశంకర్ తెలిపారు. బంగ్లా ప్రధాని హసీనా ప్రస్తుతం షాక్‌లో ఉన్నారని, కోలుకున్నాక ఆమెతో మాట్లాడతామని చెప్పారు. మానవతా దృక్పథంతోనే ఆమెకు ఆశ్రయం ఇచ్చామని, భవిష్యత్‌పై నిర్ణయానికి సమయం ఇద్దామన్నారు. తక్షణం భారత్‌కు వచ్చేందుకు అనుమతి ఇవ్వాలంటూ హసీనా నుంచి సంక్షిప్త సందేశం వచ్చిందని, ఆమె వినతితో బంగ్లా నుంచి విమానం రాకకు అనుమతి ఇచ్చామని తెలిపారు. దశాబ్దాలుగా బంగ్లాదేశ్‌తో మనకున్న సన్నిహిత సంబంధాలు, ప్రస్తుతం అక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలన్నారు. మరోవైపు, బంగ్లాదేశ్ నుంచి వచ్చి హైదరాబాద్‌లో చదువుకుంటున్న విద్యార్థులు స్వదేశంలో కల్లోల పరిస్థితులపై ఆందోళన చెందుతున్నారు. నగరంలో పలు వర్సిటీల్లో పదుల సంఖ్యలో బంగ్లాదేశ్ విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పట్లో స్వదేశానికి వెళ్లడం అనుమానమేనని వారు దిగాలు చెందుతున్నారు. తమ దేశంలో మిలటరీ పాలనను కోరుకోవడం లేదని, వీలైనంత త్వరగా ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలని ఆశిస్తున్నామని వారు తెలిపారు.

పాక్ పాత్రపై ఇప్పుడే చెప్పలేం..

హసీనాను దించేయడంలో పాక్ పాత్ర ఉందా? అంటూ అఖిలపక్ష సమావేశంలో రాహుల్ ప్రశ్నించారు. ఇప్పుడే దీనిపై ఏమీ చెప్పలేమని జైశంకర్ బదులిచ్చారు. బంగ్లాలోని పాక్ దౌత్తవేత్త ఒకరు ఆ దేశంలో జరుగుతున్న ఆందోళనలను సమర్థిస్తూ తన సోషల్ మీడియా ప్రొఫైల్ పిక్‌ను మార్చుకున్నట్లుగా సమాచారం ఉందన్నారు.

హసీనాతో మోదం.. ఖలీదాతో ఖేదం!

బంగ్లాదేశ్ మహిళా నేతలిద్దరూ చెరో రకం

▸▸ భారత్‌తో హసీనా సత్సంబంధాలు

▸▸ ఆమె నిష్క్రమణతో భారత్‌కు పలు సవాళ్లు



న్యూఢిల్లీ, ఆగస్టు 6: షేక్ హసీనా, ఖలీదా జియా.. ఒకరు అవామీ లీగ్ అధినేత, మరొకరు బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్పీ) చీఫ్. ఈ మహిళా నేతలిద్దరూ బంగ్లాదేశ్ రాజకీయాల్లో 30 ఏళ్లుగా కీలకపాత్ర పోషిస్తున్నారు. వీరిలో హసీనా భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించగా.. ఖలీదా జియా మాత్రం భారత్‌ను వ్యతిరేకించారు. బంగ్లాదేశ్ ప్రధానిగా హసీనా భారత్‌తో దృఢమైన సంబంధాలు కొనసాగించారు. భారత్-బంగ్లా మధ్య అన్ని రంగాల్లో బంధాలు బలపడ్డాయి. 2008లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికలు భారత్‌తో సంబంధాల్లో సరికొత్త అధ్యాయానికి నాంది పలికాయి. రెండేళ్ల పాటు సైనిక పాలన కొనసాగిన తర్వాత జరిగిన ఆ ఎన్నికల్లో హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ భారీ మెజారిటీతో విజయం సాధించింది. ఆమె ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భారత్-బంగ్లాలు ప్రతి అంశంలో కలిసి పనిచేశాయి. ఇరుదేశాలను కలిపే పలు బస్సు, రైలు మార్గాల్లో రాకపోకలను ప్రారంభించారు. హసీనా గత ఏడాది భారత్‌లో పర్యటించిన తర్వాత ఇరుదేశాల మధ్య కనెక్టివిటీని మరింత మెరుగుపర్చుకోవడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. విస్తృత కనెక్టివిటీతోనే ఈ ప్రాంతం మరింత వృద్ధి సాధిస్తుందని.. ఈ విషయమై తాను, ప్రధాని మోదీ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు హసీనా గతంలో తెలిపారు. అలాగే హసీనా హయాంలో కీలకమైన సరిహద్దు సమస్యలను పరిష్కరించుకున్నారు. ఉత్తర బెంగాల్‌లో ఎన్నో ఏళ్లుగా నెలకొన్న వివాదానికి ముగింపు పలికారు. అలాగే దశాబ్దాల తరబడి నలుగుతున్న తీరప్రాంత సరిహద్దు సమస్యను 2014లో పరిష్కరించుకున్నారు. తీస్తా నదీ జలాల వాటా విషయంలో విభేదాల పరిష్కారం దిశగానూ పెద్ద ముందడుగు పడింది. బంగ్లాదేశ్‌లో 10 బిలియన్ డాలర్ల ప్రైవేటు పెట్టుబడులు పెట్టేందుకు భారత్ అంగీకరించింది. మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాజెక్టులకు 7.5 బిలియన్ డాలర్లు కేటాయించింది. హసీనా ప్రధాని అయిన తర్వాత బంగ్లాదేశ్‌లో ఐఎస్ఐ గూఢచర్య కార్యకలాపాలను అణచివేసేందుకు చర్యలు చేపట్టారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, అంతరిక్షం, అణు శక్తి తదితర రంగాల్లో ఇరుదేశాలు మరింతగా సహకరించుకోవాలని నిర్ణయించినట్లు ప్రధాని మోదీ కూడా ప్రకటించారు.

నిశితంగా గమనిస్తున్న భారత్..

షేక్ హసీనాకు మద్దతుగా ఉన్నప్పటికీ ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. అక్కడి ప్రజల మనోభావాల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. తాజాగా జరుగుతున్న ఘర్షణల్లో కూడా ఆందోళనకారులు భారత్‌పై తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ రాజకీయ నిపుణుడొకరు పేర్కొన్నారు. హసీనాకు భారత్ సాయం చేస్తోందని ఆందోళనకారులు ఆగ్రహంతో ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో ఎవరు అధికారంలో ఉన్నా దౌత్య సంబంధాలు కొనసాగిస్తామని విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ ప్రకటించారు. ఇక బంగ్లాదేశ్‌లో నెలకొన్న సంక్షోభం, హసీనా ప్రభుత్వం పతనం నేపథ్యంలో అక్కడి మైనారిటీలు మరోసారి ప్రమాదంలో పడతారన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.


గతేడాది సెప్టెంబరులో భారత పర్యటనకు వచ్చిన హసీనాతో ప్రధాని మోదీ

భారత వ్యతిరేక జియా..

బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధానిగా ఖలీదా జియా రికార్డులకెక్కారు. జియా నేతృత్వంలోని బీఎన్‌పీ భారత్‌కు వ్యతిరేకం. ఆమె ప్రభుత్వం కూడా భారత వ్యతిరేక కార్యకలాపాలకు మద్దతు ఇచ్చేది. భారత వ్యతిరేకతను ఆమె తమ పార్టీ ఎన్నికల ప్రచారాస్త్రంగానూ వాడుకున్నారు. భారత్ తమ దేశ అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకుంటోందని విస్తృత ప్రచారం చేశారు. 2001-06 మధ్య జమాతే ఇస్లామీ వంటి ఉగ్ర సంస్థకు కూడా బీఎన్‌పీ మద్దతిచ్చింది. బంగ్లాదేశ్ నుంచి కార్యకలాపాలు కొనసాగించే ఉల్ఫా వంటి అనేక తీవ్రవాద సంస్థలు ఈశాన్య భారతంలో రెచ్చిపోయాయి. అయితే, 2012లో ప్రధాని జియా భారత పర్యటనకు వచ్చారు. అధికారం కోల్పోయిన తర్వాత జియా అవినీతి కేసుల్లో ఆమెకు పదేళ్ల జైలు శిక్ష పడింది. ఆమె మళ్లీ అధికారంలోకి వస్తే భారత్‌కు భద్రతాపరంగా సవాళ్లు ఎదురవనున్నాయి.

బంగ్లా కల్లోలం వెనుక విదేశీ హస్తం!

ఇది అమెరికా కుట్ర అని కొందరి విశ్లేషణ

▸▸ ఖలీదా జియా కుమారుడు పాకిస్థాన్‌తో కలిసి పన్నిన వ్యూహమని మరో వాదన



ఢాకా, ఆగస్టు 6: బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఏర్పడ్డ కల్లోల పరిస్థితుల వెనుక విదేశీ హస్తం ఉందని ఆ దేశ నిఘా వర్గాల సమాచారం! అయితే.. ఎవరి కుట్ర అనే విషయంలో భిన్నాభిప్రాయాలు వినపడుతున్నాయి. ఇది అమెరికా కుట్ర అని కొందరు రాజకీయ నిపుణులు అభిప్రాయపడుతుండగా.. మొన్నటిదాకా జైల్లో ఉన్న ప్రతిపక్ష బీఎన్‌పీ నేత ఖలీదా జియా కుమారుడు తారిఖ్ రెహ్మాన్ పాకిస్థానీ గూఢచార సంస్థ ఐఎస్‌ఐతో కలిసి లండన్‌లో పన్నిన వ్యూహమని, దీనికి చైనా మద్దతు కూడా ఉందని బంగ్లాదేశ్ అధికారులు కొందరు చెబుతున్నారు. తారిఖ్ అన్వర్, ఐఎస్‌ఐ ప్రతినిధుల మధ్య సౌదీ అరేబియాలో పలుమార్లు సమావేశాలు కూడా జరిగాయడానికి తమ వద్ద ఆధారాలున్నట్టు వారు స్పష్టం చేస్తున్నారు. భారత వ్యతిరేక జమాతే ఇస్లామీ పార్టీ విద్యార్థి విభాగమైన ఇస్లామీ ఛాత్ర శిబిర్ (ఐసీఎస్).. ఆందోళనలకు ఆజ్యం పోసిందని, ఇందుకు అవసరమైన సొమ్మును పాకిస్థాన్‌లో ఉన్న చైనా సంస్థల నుంచే ఐసీఎస్‌కు అందిందని ఆరోపణలున్నాయి. భారత్‌కు అనుకూలంగా ఉండే హసీనా ప్రభుత్వాన్ని కూలదోసి.. తమకు అనుకూలంగా ఉండే బీఎన్‌పీని అధికారంలోకి తెచ్చుకునేందుకే పాక్ ఐఎస్‌ఐ ఈ సాయం చేసిందనే వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉండగా.. ఈ ఏడాది మే 23న షేక్ హసీనా చేసిన వ్యాఖ్యలు ఈ కుట్ర వెనుక అమెరికా హస్తం ఉందన్న వాదనకు ఊతమిచ్చేదిగా ఉందని పలువురు రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. అప్పట్లో అవామీ లీగ్ నేతృత్వంలోని 14 పార్టీల కూటమి సమావేశంలో పాల్గొని ప్రసంగించిన ఆమె ఒక సంచలన విషయాన్ని బయటపెట్టారు. ఇండోనేషియా భూభాగంలోని కొంత భాగాన్ని విడదీసి 'ఈస్ట్ తైమూర్' అనే క్రైస్తవదేశాన్ని ఏర్పాటు చేసినట్టుగా.. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల నుంచి కొంత భూభాగం తీసుకుని అక్కడ ఒక క్రైస్తవ దేశాన్ని ఏర్పాటు చేయడానికి విదేశీ కుట్ర జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. జనవరి 7న జరిగిన ఎన్నికలకు ముందురోజు.. ఒక శ్వేతజాతి వ్యక్తి (వైట్‌మ్యాన్) తనను కలిశారని.. బంగ్లాదేశ్‌లో తమ దేశ వైమానిక స్థావరం ఏర్పాటుకు అనుమతిస్తే ఎన్నికలు సజావుగా జరిగేందుకు, అవామీలీగ్ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చేందుకు సహకరిస్తామని తనకు ఆఫర్ ఇచ్చారని హసీనా వివరించారు. "బంగ్లాదేశ్‌లో ఎయిర్‌బేస్ నిర్మాణానికి ఆ దేశానికి తాను అనుమతి ఇచ్చి ఉంటే నాకు ఏ సమస్యా ఉండేది కాదు" అని వ్యాఖ్యానించారు.

ఏ భూభాగాలంటే..

ఆనాడు తనకు ఆ ఆఫర్ ఇచ్చిన వ్యక్తి ఏ దేశానికి చెందిన వారో.. ఆ దేశం తీసుకోబోయే భూభాగాలు ఏవో ఆమె వెల్లడించలేదు. కానీ.. అవామీలీగ్ నేత, మాజీ స్క్వాడ్రన్ లీడర్ సద్రుల్ అహ్మద్ ఖాన్ అనంతరకాలంలో 'సండే గార్డియన్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆ ప్రాంతాల వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మయన్మార్‌లో క్రైస్తవులు ఎక్కువగా ఉండే కుకి చిన్, బంగ్లాదేశ్‌లో చిట్టోగ్రామ్ కొండ ప్రాంతాలను (ఇవి మిజోరామ్ రాష్ట్రాన్ని ఆనుకుని ఉంటాయి) కలిపి ఒక క్రైస్తవ దేశంగా ఏర్పాటుచేసే కుట్ర జరిగిందని ఆయన వివరించారు. మయన్మార్ ద్వారా దక్షిణాసియా ప్రాంతంలో పట్టు సాధించడానికి అమెరికా చాలాకాలంగా ప్రయత్నిస్తోందని ఆయన గుర్తుచేశారు. "ఎన్నికలకు కేవలం 2 నెలల ముందు.. 2023, అక్టోబరు 28న బైడెన్‌కు సలహాదారుగా చెప్పుకొంటూ మియాన్ అరాఫీ అనే వ్యక్తి(అమెరికన్) హసీనాను ఇబ్బంది పెట్టడానికి ఢాకాలో 'బీఎన్‌పీ' కార్యాలయానికి వచ్చాడు. అంతకుముందు ఢాకాలోని అమెరికన్ క్లబ్‌లో పలువురు 'కీలక' వ్యక్తులతో చర్చలు జరిపాడు" అని అహ్మద్‌ఖాన్ ఆ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

లోకం తీరు



ఆక్రమణలపై హైడ్రా పడగ!

» గాజులరామారం చింతల చెరువులో 52 అక్రమ నిర్మాణాల కూల్చివేత


అధికారులు కూల్చి వేసిన అక్రమ నిర్మాణాలు

హైదరాబాద్ సిటీ/గాజులరామారం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రా రంగంలోకి దిగింది. ఓ చెరువులో అక్రమ నిర్మాణాల కూల్చివేతకు శ్రీకారం చుట్టింది. మంగళవారం గాజులరామారం సర్కిల్ పరిధిలోని దేవేందర్‌నగర్ చింతల చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లోని సర్వే నంబర్ 329లో ఉన్న 52 అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. 44.3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో అక్రమ నిర్మాణాలున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులందాయి. సంబంధిత అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్వయంగా చెరువును పరిశీలించారు. రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల వద్ద ఉన్న మ్యాపులు, శాటిలైట్ చిత్రాల ఆధారంగా అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని నిర్ధారణకొచ్చారు. 200 మంది పోలీసుల బందోబస్తు మధ్య హైడ్రా విభాగం మార్షల్స్ డీఆర్‌ఎఫ్ బృందాలు, ఎక్స్‌కవేటర్లతో కూల్చివేతలు చేపట్టారు. కాగా చింతల చెరువులోని లావుని పట్టా భూమిని మట్టితో చదును చేసి ఓ కబ్జాదారుడు ఆక్రమణలకు తెర తీశాడు. 60, 80, 100 చదరపు గజాల చొప్పున ప్లాట్లు చేసి, విస్తీర్ణాన్ని బట్టి రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షలకు ప్లాటు చొప్పున విక్రయించాడు. లావని పట్టా యజమానులకు కబ్జాదారుడు ప్లాట్ల విక్రయం ద్వారా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. నాలుగైదు నెలలుగా ఈ తంతు జరుగుతోంది. కొనుగోలు చేసిన వ్యక్తులు ప్లాట్లలో చిన్న, చిన్న గదులు నిర్మించారు. కూల్చివేతల సంగతి తెలిసి కొనుగోలుదారులు చెరువు వద్దకొచ్చారు. లక్షలు వెచ్చించి కొన్నామని.. కూల్చివేతలు ఆపాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చెరువుకు కొద్ది దూరంలోనే పోలీసులు వారిని నిలిపివేసి సర్దిచెప్పారు. మూడు గంటల వ్యవధిలో అన్ని నిర్మాణాలను కూల్చివేశారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ విభాగాలన్ని సంయుక్తంగా కూల్చివేతలు చేపట్టడంతో కబ్జాదారుల వెన్నులో వణుకు పుడుతోంది. నగరంలోని ఇతర ప్రాంతాల్లో ఆక్రమణలపైనా దశల వారీగా చర్యలుంటాయని రంగనాథ్ తెలిపారు. చెరువులు, నాలాలు, మూసీ పక్కన, ప్రభుత్వ స్థలాల్లో చేసే లే అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయొద్దని సూచించారు.

భగవంతుడి ఆశీస్సులతో మంత్రినవుతా

అభివృద్ధిలో ఆలస్యమైనందుకు క్షమించండి: రాజగోపాల్‌రెడ్డి



చండూరు, ఆగస్టు 6: భగవంతుడి ఆశీస్సులతో మంత్రినవుతానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మునుగోడు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో కాస్త ఆలస్యమైనందుకు క్షమించాలని కోరారు. మంగళవారం నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గం చండూరు మునిసిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 2018లో తనను మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిపిస్తే అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నానని, నాటి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో అభివృద్ధి చేయలేకపోయానని తెలిపారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల కుప్పలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అయిందని, తమ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను గాడినపెట్టే ప్రయత్నంలో ఉందన్నారు. తెలంగాణ లోటు బడ్జెట్‌లో ఉన్నందున మునుగోడు నియోజకవర్గ అభివృద్ధికి కాస్త ఆలస్యం అయిందన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గాన్ని అద్దంలా తీర్చిదిద్దుతానని తెలిపారు.

సమస్యలు తీర్చకుంటే మెరుపు సమ్మె

» విద్యుత్ సంస్థలకు యూనియన్ల వార్నింగ్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టీఎస్ జెన్‌కో, ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లలో పదోన్నతుల సమస్యను పరిష్కరించాలని, ఆర్టిజన్ల సర్వీసును అప్‌గ్రేడ్ చేయాలని విద్యుత్ సంఘాలు డిమాండ్ చేశాయి. సమస్యలను పరిష్కరించకుండా ఉద్యోగుల బదిలీలకు మార్గదర్శకాలు జారీ చేయాలనే ప్రయత్నాలు విరమించుకోవాలని హెచ్చరించాయి. ఈ మేరకు యాజమాన్యాలకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-1104, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్-327లు మంగళవారం నోటీసులు ఇచ్చాయి. సమస్యలు పరిష్కారం కాకపోతే తదుపరి నోటీసు ఇవ్వకుండా మెరుపు సమ్మెకు దిగుతామని అల్టిమేటం జారీ చేశాయి.

'మేడిగడ్డ'లో డ్రోన్‌తో వీడియో.. కేటీఆర్‌పై కేసు

» బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డిపైనా..

» మహదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 6: అనుమతి లేకుండా డ్రోన్‌తో మేడిగడ్డ బ్యారేజీ, గోదావరి ప్రవాహ దృశ్యాలను వీడియో, ఫొటోలు తీసిన ఘటనలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసు నమోదైంది. ఆయనతో పాటు భూపాలపల్లి, చెన్నూరు మాజీ ఎమ్మెల్యేలు గండ్ర వెంకటరమణారెడ్డి, బాల్క సుమన్‌పై కూడా కేసు నమోదు చేసినట్లు మహదేవపూర్ పోలీసులు మంగళవారం తెలిపారు. గత నెల 26న బీఆర్‌ఎస్ నాయకుల బృందం మేడిగడ్డలో పర్యటించింది. ఆ పర్యటనను అనుమతి లేకుండా డ్రోన్‌తో చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేయడంపై నీటిపారుదల శాఖ అధికారులు గత నెల 30న పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు సెక్షన్ బీఎన్‌ఎస్ 223(బీ) కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. వారం రోజుల కిందటే కేసు నమోదు చేసినా.. పోలీసులు గోప్యంగా ఉంచడం చర్చనీయాంశమైంది. విషయం బయటకు పొక్కడంతో కేసు నమోదైనట్లు ధ్రువీకరించిన పోలీసులు.. ఎఫ్ఐఆర్ వివరాలను మాత్రం మీడియాకు ఇవ్వలేదు.

అవయవదానంలో తెలంగాణ టాప్

» 10 ఏళ్లలో 5,529 అవయవాల మార్పిడి

» ఢిల్లీలో పురస్కారం అందుకున్న 'జీవన్‌దాన్' నోడల్ అధికారి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అవయవదానంలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది! 2013లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిమ్స్‌లో ఏర్పాటు చేసిన 'జీవన్‌దాన్'.. గడిచిన దశాబ్దకాలంలో 5,529 అవయవాల మార్పిడితో వేలాది ప్రాణాలను కాపాడింది. ఈ నెల మూడో తేదీన.. '14వ ఇండియన్ ఆర్గాన్ డొనేషన్ డే' నాడు ఢిల్లీలోని అంబేడ్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ అందించిన అవార్డును జీవన్‌దాన్ నోడల్ అధికారి డాక్టర్ స్వర్ణలత స్వీకరించారు. 2013 నుంచి తమ వద్ద పేర్లను నమోదు చేసుకున్న బాధితులకు.. బ్రెయిన్ డెడ్ అయినవారి అయవాలను జీవన్‌దాన్ కేటాయిస్తూ వస్తోంది. ఇలా ఇప్పటికి 1462 మంది దాతలు నుంచి అవయాలను సేకరించి.. 199 మందికి గుండె మార్పిడి చేయడంలో కీలకంగా వ్యవహరించింది. అలాగే గడిచిన పదేళ్లలో 2194 కిడ్నీలు, 1343 కాలేయాలు, 1201 కార్నియాలు, 170 గుండె కవాటాలు, 308 ఊపిరితిత్తులు, 14 క్లోమగ్రంథుల మార్పిడి చేసింది. జీవన్‌దాన్ నోడల్ కేంద్రాన్ని నిమ్స్‌లో ఏర్పాటు చేశారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రి వర్గాలకు కూడా ఇందులో భాగస్వామ్యం ఉంది. జీవన్‌దాన్‌లో ప్రస్తుతం.. 3,632 మంది అవయవాల కోసం నమోదు చేసుకున్నారు. వీరిలో కీలక అవయవాలైన కాలేయం, మూత్రపిండాలు, గుండె వంటి వాటి కోసం ఎదురుచూస్తున్నవారు 2,300 మందికి పైగా ఉన్నారు. కాలేయం కోసం ఎదురుచూస్తున్నవారు 1,011 మంది ఉండగా.. కిడ్నీ కోసం 1,145 మంది, గుండె కోసం 90, ఊపిరితిత్తుల కోసం 76, క్లోమగ్రంథి మార్పిడి కోసం 15 మంది నిరీక్షిస్తున్నారు. అవయవాలు అవసరమైన వారు నిమ్స్‌లోని జీవన్‌దాన్ నోడల్ కేంద్రంలో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమాచారం కావాలంటే.. 040-23489494 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. jeevandan.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు.

సగానికి పైగా నిండిన ఎస్సారెస్పీ

శ్రీశైలానికి భారీగా వరద.. గేట్లన్నీ ఓపెన్.. నాగార్జున సాగర్, పులిచింతలకూ భారీగా ఇన్‌ఫ్లో

» పులిచింతలలో రెండేళ్ల తర్వాత విద్యుదుత్పత్తి

» ఖమ్మం, మహబూబాబాద్, పాలమూరు జిల్లాల్లో వర్షం

» తల్లాడలో 12.8 సెం.మీ.. పత్తి చేలల్లో నిలిచిన వరద


నాగార్జున సాగర్ నుంచి 22 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరుగులు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): గోదావరి పరిధిలోని శ్రీరాంసాగర్ నీటితో కళకళలాడుతోంది. ప్రాజెక్టు సగానికి పైగా నిండింది. ప్రాజెక్టులోకి 12 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఎగువన మహారాష్ట్రలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టుకు 48 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండితేనే శ్రీరాంసాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగే అవకాశాలున్నాయి. ఎస్సారెస్పీ పూర్తి సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 46.06 టీఎంసీల నీరు ఉంది. కృష్ణా పరిధిలో ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 2.97 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 2 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుంటే దాదాపు అంతే స్థాయిలో ఔట్‌ఫ్లో ఉంది. జూరాలకు 2.52 లక్షల క్యూసెక్కులు, తుంగభద్రకు 84 వేల క్యూసెక్కుల వరద వచ్చిచేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు 3.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ప్రాజెక్టు గేట్లన్నీ ఎత్తేసి.. 3.99 లక్షల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. సాగర్‌కు 3.14 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 22 గేట్ల ద్వారా 3.54 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు 3.71 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... గేట్లు ఎత్తి.. 1.08 లక్షలను ప్రకాశం బ్యారేజీకి వదులుతున్నారు. ఇక్కడ రెండేళ్ల తర్వాత జలవిద్యుదుత్పత్తి చేపట్టడం గమనార్హం. సాగర్ నుంచి కృష్ణమ్మ పొంగిపొర్లుతుండటంతో ప్రకృతి అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. కాగా సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని ఎలిమినేటి మాధవరెడ్డి (ఏఎమ్మార్పీ) వరద కాల్వకు సోమవారం రాత్రి గండిపడింది. నల్లగొండ జిల్లా అనుముల మండలం మారేపల్లి వద్ద గండిపడటాన్ని రైతులు గుర్తించారు. అప్రమత్తమైన అధికారులు అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నీటిని నిలుపివేసి.. గండి పూడ్చివేత పనుల్లో నిమగ్నమయ్యారు. మంగళవారం రాష్ట్రంలోని పలుచోట్ల వర్షాలు పడ్డాయి. ఖమ్మం, మహబూబాబాద్, పాలమూరు జిల్లాల్లో భారీ వర్షం పడింది. ఖమ్మం జిల్లా తల్లాడ, వైరా, కల్లూరు, కొణిజర్ల, రఘునాథపాలెంలో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లాయి. తల్లాడలో 12.8 సెం.మీ వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ శివారులోని జంగిలిగొండ శివారు దూర్యతండాలో చెట్లు విరిగిపడ్డాయి. పత్తి చేలల్లో నీళ్లు నిలిచాయి. పాలమూరు జిల్లా దేవరకద్ర, రాజాపూర్, జడ్చర్ల, గండీడ్, బాలానగర్ మండలాల్లో వర్షం పడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చిరుజల్లులు కురిశాయి.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం (టీఎంసీలు)	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	92.31	297000	200000
నారాయణపూర్	37.64	31.89	200000	194860
తుంగభద్ర	100.86	100.54	84127	50621
జూరాల	9.66	8.42	252000	249359
శ్రీశైలం	215.81	205.66	371093	399453
నాగార్జునసాగర్	312.05	297.72	341594	354663
సింగూరు	29.91	14.71	391	391
శ్రీరాంసాగర్	80.5	46.06	12647	743
కడెం	7.6	6.86	3521	957
ఎల్లంపల్లి	20.18	13.91	4660	6725
మేడిగడ్డ	16.17	6.07	373500	373500
సమ్మక్క	6.94	6.94	487310	487018
సీతమ్మ	36.57	0.2	500812	500812

మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ప్రకటించండి

» తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వేతర ఉన్నత విద్యాసంస్థలు మేనేజ్‌మెంట్ కోటా ప్రవేశాలకు సంబంధించిన ప్రకటనలు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కోరింది. ప్రైవేటు, నాన్ మైనారిటీ, మైనారిటీ విద్యాసంస్థలు క్యాటగిరి-బికి సంబంధించి మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి సంబంధించి ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేశామని మండలి కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్గదర్శకాలను అన్ని విద్యాసంస్థలు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. ప్రవేశాల భర్తీకి నోటిఫికేషన్‌ను విద్యాసంస్థలు పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని, దరఖాస్తులను ఆఫ్‌లైన్‌తోపాటు ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు.

14 జిల్లాలకు ఇంటర్ విద్యా అధికారుల నియామకం

పదోన్నతులు, బదిలీలతో రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 14 జిల్లాల ఇంటర్ విద్యాధికారుల స్థానాల్లో ఇన్‌చార్జీలను నియమించారు. ఆయా జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల సీనియర్ ప్రిన్సిపాళ్లను ఇన్‌చార్జీ అధికారులుగా నియమిస్తూ ఇంటర్ విద్య డైరెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

మిర్యాలగూడలో నిలిచిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మిర్యాలగూడ, ఆగస్టు 6: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించతలపెట్టిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయింది. ఎమ్మెల్సీ కోటిరెడ్డి సిఫారసు మేరకు మంజూరైన రూ.13.76లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను 44మంది లబ్ధిదారులకు మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా పంపిణీ చేసేందుకు బీఆర్‌ఎస్ నేతలు ఏర్పాట్లు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు ఈ చెక్కులను పంపిణీ చేస్తారని, లబ్ధిదారులు మిర్యాలగూడలోని పార్టీ కార్యాలయానికి రావాలని సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రజ్యోతి 'మాజీ ఎమ్మెల్యే చేతికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు!' శీర్షికన మంగళవారం కథనాన్ని ప్రచురించింది. అయితే, చెక్కుల పంపిణీ పార్టీ కార్యాలయంలో చేయకూడదని, ప్రజాప్రతినిధులు కాకుండా ఒక పార్టీకి చెందిన వ్యక్తులు పంపిణీ చేయరాదని మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు చేసిన సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని నిలిపివేసినట్లు బీఆర్‌ఎస్ వర్గాలు వెల్లడించాయి.

రామన్నపేట ఆస్పత్రిలో బాలింత మృతి

» వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

రామన్నపేట, ఆగస్టు 6: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ఏరియా ఆస్పత్రిలో ఓ బాలింత తీవ్ర రక్తస్రావంతో మరణించింది. ప్రసవం చేసిన వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే ఆమె మరణించిందని బాధిత కుటుంబసభ్యులు ఆస్పత్రి ఎదుట మంగళవారం ఉదయం ఆందోళన చేశారు. వైద్యురాలి తీరుపై పలు ఆరోపణలు చేశారు. మృతురాలి బంధువుల కథనం ప్రకారం.. జిల్లాలోని మోత్కూరు మండలం అనాజిపురం గ్రామానికి చెందిన కొల్లు మానస(25)ను కుటుంబసభ్యులు రెండో కాన్పు నిమిత్తం ఆదివారం(ఈ నెల 4న) రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. సోమవారం ఉదయం 11 గంటలకు విధుల్లో ఉన్న ప్రియాంక అనే వైద్యురాలు శస్త్రచికిత్స చేయగా మానస ఆడపిల్లను ప్రసవించింది. అనంతరం మానసకు తీవ్ర రక్తస్రావమై రాత్రి 8 గంటల సమయంలో పరిస్థితి విషమించడంతో డ్యూటీ డాక్టర్ సూచన మేరకు ఆమెను నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. మానసను పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్టు నిర్ధారించారు. దీంతో సోమవారం రాత్రే మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తీసుకొచ్చిన మానస బంధువులు మంగళవారం ఆస్పత్రి ఎదుట ధర్నా చేశారు.

కదలివచ్చిన న్యాయదేవత..!!

» మూడో అంతస్తులోని కోర్టు హాల్‌కు రాలేని వృద్ధుని చెంతకు స్వయంగా వచ్చిన న్యాయాధికారి


భీమలింగుతో మాట్లాడుతున్న న్యాయాధికారి భవిష్య

నిర్మల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ కోర్టులో మంగళవారం అరుదైన ఘటన జరిగింది. మెట్లు ఎక్కలేక మూడో అంతస్తులోని కోర్టు హాల్‌లో జరుగుతున్న కేసు విచారణకు హాజరు కాలేకపోయిన ఓ వృద్ధుడి వద్దకు న్యాయాధికారే కదలివచ్చారు. మూడంతస్తులు దిగి వచ్చి ఆ వృద్ధునితో స్వయంగా మాట్లాడి కేసులో రాజీ కుదిర్చి.. నిర్మల్ కోర్టు న్యాయాధికారి భవిష్య మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామానికి చెందిన లింగోళ్ల భీమలింగు(61) కుమారుడు సత్యంకు నవ్యశ్రీతో 14 ఏళ్ల క్రితం వివాహమైంది. సంతానం కలగకపోవడంతో సత్యం దంపతుల మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో సత్యం మరో పెళ్లి చేసుకుంటాడనే భావనతో నవ్యశ్రీ అతనిపై వేడి నూనె పోసింది. ఈ విషయమై 2022లో భీమలింగు.. తన కోడలు నవ్యశ్రీపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా భీమలింగు మంగళవారం కోర్టుకు వచ్చారు. కానీ, మోకాళ్ల నొప్పుల సమస్య వల్ల మూడో అంతస్తులోని కోర్టు హాల్‌కు వెళ్లలేక కిందనే ఉండిపోయారు. కోర్టు కానిస్టేబుల్ ప్రభాకర్ ద్వారా విషయం తెలుసుకున్న న్యాయాధికారి భవిష్య.. భీమలింగు వద్దకు వెళ్లి మాట్లాడారు. ప్రస్తుతం కుటుంబ సభ్యులంతా కలిసి ఉంటున్నారని తెలుసుకుని రాజీ కుదిర్చి సమస్యను పరిష్కరించారు.

తెలంగాణ బాలుడి ఆచూకీ తిరుపతిలో లభ్యం


మహీధర రెడ్డి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6: తెలంగాణకు చెందిన బాలుడు మహీధర రెడ్డి ఆచూకీ తిరుపతిలో లభ్యమైంది. డీఎస్పీ రవిమనోహరాచారి మంగళవారం వివరాలను మీడియాకు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలోని మీర్‌పేటకు చెందిన కవిత, మధుసూధనరెడ్డి దంపతుల కుమారుడు మహీధరరెడ్డి ఈ నెల 4వ తేదీ సాయంత్రం తన సోదరుడు మానేందర్ రెడ్డితో కలసి ట్యూషన్‌కు వెళ్లాడు. ట్యూషన్ నుంచి మానేందర్ రెడ్డి ఇంటికి చేరగా, మహీధర రెడ్డి మాత్రం రాలేదు. ఎంతకీ రాకపోవడంతో చుట్టు పక్కల గాలించారు. ఫలితం లేకపోవడంతో మీర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు.. మహీధర రెడ్డి తాను దాచుకున్న రూ.1000లతో హైదరాబాదు నుంచి ఆదివారం రాత్రి రైలెక్కి సోమవారం తిరుపతికి వచ్చాడు. తర్వాత తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుని తిరుపతి శ్రీహరి బస్టాండు వద్దకు చేరుకున్నాడు. అక్కడ బిక్కుబిక్కుమంటూ తచ్చాడుతున్న బాలుడిని బస్టాండులోని అవుట్ పోస్టు పోలీసులు చేరదీసి విచారించారు. తల్లిదండ్రుల పేర్లు, అడ్రస్ చెప్పడంతో వెంటనే ఈస్ట్ పోలీసుస్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. జరిగిన విషయాన్ని బాలుడు తల్లిదండ్రులకు తెలియచేసి తిరుపతి రమ్మని చెప్పారు. అనంతరం తిరుపతి ఈస్ట్ పోలీసుల వద్ద ఉన్న మహీధర రెడ్డిని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో మంగళవారం సాయంత్రం డీఎస్పీ పర్యవేక్షణలో బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. బాలుడిని గుర్తించిన తిరుపతి ఆర్టీసీ బస్టాండు అవుట్ పోస్టు పోలీసులను పలువురు అభినందించారు.



వీరభద్రస్వామి దీక్షలో పొన్నం

భీమదేవరపల్లి, ఆగస్టు 6: ఉత్తర తెలంగాణ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి నక్షత్ర దీక్షను మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వీకరించారు. ఆలయ ముఖ్య అర్చకుడు, దీక్షల గురుస్వామి మొగిలిపాలెం రాంబాబు వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రుడి ముద్రికతో ఉన్న మాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మెడలో వేశారు. 27 రోజులు పాటు మంత్రి దీక్షలో ఉండనున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో పొన్నం ప్రభాకర్ కొత్తకొండ శ్రీవీరభద్రస్వామిని దర్శించుకున్నారు. స్వామివారి కరుణతో తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు తీసుకుంటానని మొక్కుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి: సురేఖ

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. పర్యావరణంతో పాటు పర్యాటక రంగ అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని అధికారులకు సూచించారు. మంగళవారం సచివాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి కల్పనకు అపారమైన అవకాశాలు ఉన్న ఎకో-టూరిజం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రోత్సాహకాలను అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటి వరకు హరిత నిధులతో చేపట్టిన పనుల కోసం వెచ్చించిన నిధులు, తదితర వివరాలతో సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. హరిత నిధిపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు.

పోషణ భారమని వదులుకున్నా.. మమకారం దరికి చేర్చింది!

» ములుగు జిల్లాలో రూ.15వేలకు శిశువు విక్రయం

» 2నెలల తర్వాత మనసు మార్చుకున్న కన్నతల్లి

» కొన్న వ్యక్తి నిరాకరించడంతో పోలీసులకు ఫిర్యాదు

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు 6: ఆడబిడ్డ పుడితే పోషణ భారం అని అనుకున్నారా తల్లిదండ్రులు. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండటంతో మూడో కాన్పులో పుట్టిన శిశువును రెండు వారాలకే ఇతరులకు అమ్మేశారు. ఆ తర్వాత గానీ ఆ వేదన ఏమిటనేది అర్థంకాలేదు ఆ దంపతులకు. బిడ్డను వదిలించుకున్నామనుకున్నారే కానీ మమకారాన్ని చంపుకోలేకపోయిన ఆ దంపతులు తమబిడ్డను తమకివ్వాలని శిశువును కొన్నవారిని నిలదీశారు. చివరికి వ్యవహారం పోలీసుస్టేషన్ దాకా వెళ్లింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కలివేలు గ్రామానికి చెందిన దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. మూడోసారి గర్భందాల్చిన భార్యను కాన్పు కోసం ఆమె భర్త జూన్ 5న ఏటూరునాగారంలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అదేరోజు వైద్యులు ఆమెకు సాధారణ ప్రసవం చేయగా ఆడశిశువుకు జన్మనిచ్చింది. ఆ భర్త ఆస్పత్రి చుట్టు పక్కల వారికి తన శిశువును విక్రయిస్తానని చెప్పాడు. జూన్ 7న ఆస్పత్రి నుంచి స్వగ్రామమైన చర్లకు బిడ్డతో కలిసి దంపతులు వెళ్లిపోయారు. ఏటూరునాగారానికి చెందిన సంతానం లేని ఓ వ్యక్తి మధ్యవర్తి ద్వారా చర్లకు వెళ్లాడు. రూ.15వేలు చెల్లించి శిశువును తీసుకెళ్లాడు. అయితే బిడ్డపై మమకారం చంపుకోలేకపోయిన ఆ తల్లి.. రెండు నెలల తర్వాత తన కూతురు తనకు కావాలని భర్తపై ఒత్తిడి తెచ్చింది. మంగళవారం భార్యను వెంటబెట్టుకొని ఆ భర్త ఏటూరునాగారం వచ్చారు. పాపను తమకు ఇవ్వాలని కోరగా కొనుగోలు చేసిన వ్యక్తిఒప్పుకోలేదు. దీంతో ఆ దంపతులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్సై కేసు నమోదు చేశారు. కాగా మాతాశిశు సంరక్షణ శాఖ అధికారుల సమక్షంలో బుధవారం శిశువును కన్నవారికి అప్పగించనున్నట్టు సమాచారం.

నువ్వే నమ్మకపోతే ఎలా నాన్నా?

» తండ్రి మందలించాడని మనస్తాపం

» మాచర్లలో ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

నంద్యాల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ధైర్యం అవుతాడనుకున్న తండ్రి అపార్థం చేసుకున్నాడు. తప్పు చేయలేదన్నా వినకుండా మందలించాడు. కన్నతండ్రే నమ్మకపోతే ఇక ప్రపంచం ఏం అర్థం చేసుకుంటుందని భావించిన ఆ కూతురు మనస్తాపం చెందింది. తన చావే సమస్యను పరిష్కరిస్తుందన్న ఉద్దేశంతో 'నేను ఏ తప్పూ చేయలేదు నాన్నా. నువ్వే నమ్మకపోతే ఎలా?' అని ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకుంది. నంద్యాల జిల్లా డోన్‌కు చెందిన జక్కి గౌరప్ప, రామేశ్వరి దంపతుల కుమార్తె రేణుక ఎల్లమ్మ (22) పల్నాడు జిల్లా మాచర్లలోని ప్రైవేటు కళాశాలకు చెందిన వసతి భవనంలో ఉంటూ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలకు చెందిన విద్యార్థి ఆదివారం రేణుకకు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆ విద్యార్థి ఆమె తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో కోపగించుకున్న రేణుక తండ్రి కూతురికి ఫోన్ చేసి 'అబ్బాయిలతో ఫోన్‌లో మాట్లాడాల్సిన పనేముంటుంది. అసలు విషయం కళాశాలకు వచ్చి తేలుస్తా' అని గట్టిగా మందలించాడు. దీంతో భయపడిపోయిన రేణుక తాను ఏ తప్పూ చేయలేదని ఉత్తరం రాసి వసతి గృహంలోని ఓ గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుంది. ఫ్యానుకు వేలాడుతున్న రేణుకను చూసిన ఆమె స్నేహితులు గట్టిగా కేకలు వేశారు. అప్పటికే వసతి గృహానికి వచ్చిన రేణుక తల్లిదండ్రులు కూతురి మృతదేహాన్ని చూసి బోరుమన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎడ్లబండిపైనే ఆగిన రైతు గుండె

తలమడుగు, ఆగస్టు 6 : ఎడ్లబండిపైనే రైతు గుండె ఆగిన విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకుంది. జిల్లాలోని తలమడుగు మండలం రుయ్యాడి గ్రామానికి చెందిన గోక సంజీవ్‌రెడ్డి(48) అనే రైతుకు వ్యవసాయమే జీవనాధారం. రోజూలాగే మంగళవారం కూడా వ్యవసాయ పనుల నిమిత్తం తన ఎడ్లబండిపై పొలానికి వెళ్లాడు. పంట పొలాల్లో ఎడ్లబండిపై ఉండగానే.. గుండె నొప్పి రావడంతో అక్కడికక్కడే సంజీవ్‌రెడ్డి తుది శ్వాస విడిచాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బీమాపై పన్నుబండ

జీవిత, ఆరోగ్యబీమా ప్రీమియంలపై చెల్లించే జీఎస్టీకి వ్యతిరేకంగా ఇండియా కూటమి పక్షాలు మంగళవారం పార్లమెంట్‌భవనం ముందు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. ఏడు భాషల్లో రాసిన ప్లకార్డులను పట్టుకొని, నినాదాలు చేస్తూ బీమా ప్రీమియంపై 18శాతంగా ఉన్న జీఎస్టీని టాక్స్ టెర్రరిజంగా అభివర్ణించాయి. కష్టకాలంలో ఆదుకుంటుందన్న ఆశతో సగటుమనిషి పైసాపైసా కూడబెట్టి ఏటా బీమా ప్రీమియం కడుతుంటే, దానిమీద కూడా ఇంతటి భారీస్థాయిలో జీఎస్టీ విధించడం కంటే అమానుషత్వం ఇంకేమైనా ఉంటుందా? అని విపక్షనేతలు విమర్శలు చేస్తున్నారు. జీవిత, ఆరోగ్యబీమాలను పూర్తిగా పన్నునుంచి మినహాయించాలని, ఆరోగ్యసమస్యలమీద అత్యధికంగా ఖర్చు చేస్తున్నది భారతీయులే కనుక, ఇంతటి అత్యవశ్యకమైన అంశంలో అధికజీఎస్టీలు సరికాదని వారంటున్నారు. మోదీ ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీతో ఏటా 24వేలకోట్ల రూపాయలు సంపాదిస్తోందని రాహుల్‌గాంధీ వాదన. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క ఆరోగ్యబీమా ప్రీమియంలపైనే ప్రభుత్వానికి 8263కోట్లు వసూలైందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధరి లోక్‌సభకు తెలియచేశారు. జీఎస్టీ తొలగింపు డిమాండ్ బలంగా ఉన్నదని అంగీకరిస్తూనే ఏ నిర్ణయమూ చేయాల్సింది కేంద్రం, రాష్ట్రాలతో కూడిన జీఎస్టీ కౌన్సిల్ మాత్రమేనని ఆయన తేల్చేశారు.

బీమాపై పన్ను పూర్తిగా తొలగించాలంటూ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు రవాణామంత్రి నితిన్‌గడ్కరీ లేఖ రాయడంతో ఈ డిమాండ్‌కు మంచిఊతం వచ్చింది. నాగపూర్ డివిజనల్ ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం అభ్యర్థనమేరకు ఈ లేఖరాస్తున్నట్టుగా చెబుతూనే, వారిని ఉటంకిస్తూనే ఆయన బీమాపై పన్ను సరికాదనీ, దానిని ఉపసంహరించుకోవాలని స్పష్టంగా కోరారు. జీవితబీమాపై పన్ను అంటే జీవితంలో అనిశ్చితిపై పన్నువేయడం, తన కుటుంబానికి భద్రతనిచ్చేందుకు యజమాని తీసుకొనే ఈ బీమాపై పన్ను ఉండకూడదు, ప్రస్తుత సమాజంలో ఎంతో అవసరమైన మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ కూడా సరికాదు అన్నారాయన. జీవిత, ఆరోగ్యబీమా పాలసీలు అత్యవశ్యకం అని ఉధృతంగా ప్రచారం చేస్తూనే వాటినుంచి భారీగా పన్ను పిండుకోవాలన్న ప్రభుత్వం పేరాశ బీమారంగాన్ని దెబ్బతీస్తున్నదని ఉద్యోగ సంఘాల బాధ. ప్రపంచ సగటులో సగం మాత్రమే ఉన్న మనదేశంలో బీమా విస్తరణ ఉధృతంగా జరగాలని సంబంధిత కమిటీలు చెబుతున్నాయి. ఆయా వర్గాల అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తుల సంఖ్య పెరగాలని, ప్రచారం ఉధృతంగా ఉండాలని కూడా అంటున్నాయి. కానీ, కరోనా అనంతరకాలంలో బీమా అవసరాన్ని జనం అధికంగా గుర్తించినా, ప్రీమియం రేట్లు ఏటా పదిహేనుశాతం వరకూ పెరిగిపోతూ, దానికి జీఎస్టీకూడా తోడై భారంగా పరిణమించాయి. చాలామంది ప్రీమియంలు కట్టలేక వదిలేస్తున్న నేపథ్యంలో, జీఎస్టీ తగ్గించాలన్న డిమాండ్ హెచ్చింది. దాదాపు మూడువందలమంది ఎంపీలకు అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం వినతిపత్రాలు సమర్పించింది. బడ్జెట్ సమావేశాల్లో కొందరు ఎంపీలు ఈ విషయం లేవనెత్తకపోలేదు కానీ, గడ్కరీ లేఖతో ఈ సమస్యకు విస్తృత ప్రాచుర్యం దక్కింది. అంతకంటే ముఖ్యంగా, ఆరెస్సెస్ మూలాలున్న ఈ నాయకుడు ఒక విధానపరమైన మార్పును డిమాండ్ చేస్తూ బహిరంగ లేఖ రాయడం ప్రజలకు ఆశ్చర్యం కలిగించింది, రాజకీయ వర్గాల్లో విస్తృతచర్చకు దారితీసింది. ఇటీవల మరోమంత్రి ప్రహ్లాద్‌జోషీ కూడా ఆర్థికశాఖ సహాయమంత్రికి లేఖరాయడం విశేషమైన పరిణామం.

ప్రీమియంలమీద జీఎస్టీ ఎత్తివేయకపోతే రోడ్లమీదకు వస్తానని, ఉద్యమాలు చేస్తాననీ మమతాబెనర్జీ ఇటీవల హెచ్చరించారు. ఆమె పార్టీ ఎంపీ సభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. లక్షలకోట్ల జీఎస్టీ వసూలవుతూ పెరుగుదల రేటు కూడా ఘనంగా ఉన్నస్థితిలో బీమామీద భారీగా పన్ను వేయాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. లావాదేవీలు జరిగినప్పుడు పన్ను ఉండాల్సిందేనని గట్టిగా నమ్ముతున్న పక్షంలో అతి తక్కువ పన్ను స్లాబ్ ఐదుశాతంలోకి దీనిని తీసుకురావచ్చు. ప్రపంచంలో ఏ దేశంలోనూ బీమా ప్రీమియం మీద ఇంతపన్నులేదు. బంగారంపై మూడుశాతం, నగిషీ చెక్కిన డైమండ్లమీద 0.25శాతం పన్ను విధిస్తూ, ప్రజలు తమకుతాముగా కల్పించుకుంటున్న భద్రత, భరోసాలపై భారీ పన్నుతో విరుచుకుపడటం సముచితం కాదు.

సామాజిక మాధ్యమాలలో తన వాగ్ధాటితో క్రియాశీలకంగా ఉండడం ద్వారా విదేశాలలోని తెలంగాణ యువతను ఆకర్షించిన నాయకుడు రేవంత్ రెడ్డి. తెలంగాణలో కాంగ్రెస్ మరింతగా బలోపేతమయ్యేలా ప్రవాసుల మద్దతును సాధించేందుకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటనలో నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తారా?

ప్రవాసులకు చేరువకావడానికి కాంగ్రెస్ చేస్తున్నదేమిటి?

సరళంగా అందుబాటులోకి వస్తున్న పరస్పర సమాచార మార్పిడి సాంకేతిక విజ్ఞానం దేశ రాజకీయాలను పరోక్షంగా ప్రభావితం చేస్తున్న కాలమిది. ప్రవాసులు, వారిపై స్వదేశంలో ఆధారపడ్డ కుటుంబ సభ్యుల పాత్ర కీలకంగా మారుతోంది. మరి ప్రవాసులను ఆకట్టుకుని స్వదేశంలోని వారి బంధుమిత్రుల నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ నాటి రాజకీయ పార్టీలు, నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఇలా ఓటర్లకు చెరువయ్యే ప్రయత్నాలలో భారతీయ జనతా పార్టీ అగ్రగామిగా ఉండగా భారత జాతీయ కాంగ్రెస్ అట్టడుగులో ఉంది.

వాస్తవానికి కమలనాథుల కంటే దశాబ్దాల పూర్వమే విదేశాలలో కాంగ్రెస్ పార్టీ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ (ఐఓసి)గా ఉనికిలో ఉన్నది. అయితే ఈ ఐఓసి అమెరికా, యూరోపియన్ దేశాలలోని మేధావి వర్గానికి మాత్రమే పరిమితమై సామాన్యులకు అందనంత దూరంలో ఉండేది. ఇప్పటికీ అలానే ఉంటూ వస్తూ ఉందనడం సత్య దూరం కాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటకలతో పాటు బలంగా ఉన్న పంజాబ్, కేరళ, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన వారు లక్షలాది సంఖ్యలో విదేశాలలో వ్యాపార ఉద్యోగాలలో ఉన్నారు. వారి కుటుంబాలు స్వదేశాలలో ఉన్నాయి. చుట్టాలుపక్కాలు ఎంతో మంది ఉంటారు. గణనీయమైన సంఖ్యలో ఉన్న వారందరికీ చేరువ కావడానికి కాంగ్రెస్ పార్టీ చేస్తున్నదేమిటి? ఏమీ లేదు. ఏ రకమైన ప్రయత్నమూ చేయడం లేదు. ఇప్పటికీ ప్రతి వారం కాంగ్రెస్ పార్టీ నాయకగణం నుండి ఎవరో ఒకరు దుబాయి లేదా అమెరికాలో వ్యక్తిగతంగా పర్యటిస్తుంటారు. అయితే పార్టీ గూర్చి ఏనాడైనా వాకబు చేసిన సందర్భాలు దాదాపు శూన్యమని చెప్పక తప్పదు.

గల్ఫ్ లేఖ

కాంగ్రెస్ పార్టీ మంత్రులు తమ అధికార హయాంలో తరచు విదేశాలలో పర్యటించేవారు. అయితే ఆ పర్యటనలను వారు కేవలం గుప్త విహార యాత్రలుగా మాత్రమే పరిగణించారు కానీ పార్టీపరంగా బలోపేతమయ్యే దిశగా ఆలోచన కనీస మాత్రంగానైనా చేయలేదు. ఎవరైనా పార్టీ అభిమానులు ముందుకు వచ్చి కలవడానికి ప్రయత్నిస్తే అది అటు మంత్రులకు గానీ అధికారులకు గానీ సాధారణంగా రుచించేది కాదు. ఇందిరా గాంధీ వెంట సౌదీ అరేబియాకు వచ్చిన రాజీవ్‌గాంధీతో సమావేశమైన జె.గీతారెడ్డి తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్వదేశానికి వెళ్ళి రాజకీయాలలో ప్రవేశించి సుదీర్ఘకాలం అధికార పదవులను నిర్వహించారు.



పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు గడ్డం ఆత్మచరణ్ రెడ్డి అనే ప్రవాసుడికి టిక్కెట్ ఇచ్చి గెలిపించారు. ఆ తర్వాత అదే నియోజకవర్గం నుంచి మరో అమెరికా ప్రవాసుడు మధు యాష్కీగౌడ్ కూడ రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. అయితే వీరెవ్వరు కూడా ప్రవాసులలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు ప్రయత్నించిన సందర్భాలు లేవు.

ఎవరైనా అధికార ప్రముఖులు విదేశీ పర్యటనకు వెళ్ళి వస్తే చాలు, శంషాబాద్ నుంచి బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాసాల దాకా సదరు నాయకుల 'సేనల' పేర వెలిసే వేలాది బ్యానర్లలో పార్టీకి కించిత్ స్థానం కూడా ఉండదు. సామాజిక మాధ్యమాలలో తన వాగ్ధాటితో క్రియాశీలకంగా ఉండడం ద్వారా విదేశాలలోని తెలంగాణ యువతను ఆకర్షించిన నాయకుడు ఎ. రేవంత్ రెడ్డి. ఆయన ప్రస్తుతం ముఖ్యమంత్రిగా తన ప్రథమ అమెరికా పర్యటనలో ఉన్నారు. పిసిసి అధినేతగా ఆయన రెండేళ్ల క్రితం అమెరికాలో జరిపిన పర్యటనలో భారీ కార్ల ర్యాలీ, సమావేశాలతో సంచలనం సృష్టించారు. ఆ పర్యటన ఆయన వ్యక్తిగత ప్రతిష్ఠను పెంపొందించడానికి దోహదం చేసిందనడంలో సందేహం లేదు. అయితే అది కాంగ్రెస్ పార్టీకి నూతన జవసత్వాలు చేకూర్చిందా లేదా అనేది తెలియదు. అమెరికాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా కొన్ని కార్యక్రమాలను పిసిసి ఎన్నారై సెల్ నిర్వహిస్తుంది, అదే సెల్‌కు అధ్యక్షుడిగా ఉన్న, మాజీ రాయబారి కూడ అయిన జి.వినోద్ కుమార్‌కు ఆహ్వానం అందలేదు. ఆయన్ను ప్రభుత్వ ప్రముఖులు ఎవరూ పట్టించుకోరు మరి.

ఇప్పుడు భారతీయ జనతా పార్టీ విషయానికి వద్దాం. ఇక్కడ మోదీ ఫోటో మినహా 'సేనల'కు స్థానం ఉండదు. బిజెపి ప్రవాసీ విభాగం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తూ న్యూ ఢిల్లీలోని విదేశీ దౌత్యవేత్తలతో నిరంతర సంప్రదింపులు జరుపుతూ ఉంటుంది. వీలయినప్పుడు బీజేపీ పాలిత రాష్ట్రాలలో విదేశీ దౌత్యవేత్తల పర్యటనలను ఏర్పాటు చేస్తుంది. ప్రవాసీ విభాగం అధ్యక్షుడయిన విజయ్ చౌతయివాలే ప్రధానమంత్రితో సహా భాజపా ముఖ్యమంత్రులతో కూడా తరుచు సమావేశమవుతారు. విదేశీ పర్యటనలకు వెళ్ళిన ప్రతి కేంద్ర మంత్రి విధిగా తాను కనీసం వంద మంది ప్రవాసులతో సమావేశం కావాలనే అనధికారిక నియమాన్ని ప్రధాని మోదీ విధించారు. పార్టీ నిర్మాణానికి కొంత సమయం కేటాయించాలి, అది భారతీయ ఎంబసీ అయినా లేదా ఫైవ్ స్టార్ హోటల్ అయినా సమావేశమనంతరం జై శ్రీరాం, భారత మాతకీ జై అనే నినాదాలు చేయాలి. సీనియర్ మంత్రులు నితీన్ గడ్కరీతో సహా వ్యక్తిగత పర్యటనలకు విదేశాలకు వెళ్లుతున్న మంత్రులు సైతం పార్టీ కార్యకర్తలతో సమావేశం కావాలనే పార్టీ ఆదేశాన్ని తుచ తప్పకుండా పాటిస్తున్నారు. సూటు ధరించె ఉన్నత ఉద్యోగాలు చేసే వారే కాకుండ తట్టా బుట్ట మోసే కార్మికులయినా సరే, వారు ఔత్సాహికులైన పార్టీ అభిమానులు అయితే వారిని ప్రోత్సహిస్తూ అందలం ఎక్కిస్తున్నారు. అగ్రనాయకుడు అమిత్ షా ఎంత బిజీగా ఉన్నా ఏదో విధంగానైనా వీలు చేసుకుని రాత్రి పూట విందుకు ప్రవాస కార్యకర్తలను ఆహ్వానించి పార్టీ పటిష్టతపై మాట్లాడుతారు. దుబాయికి వచ్చినప్పుడల్లా ధర్మపురి అర్వింద్ కార్మికులతో కూడ కలిసిమెలిసి కాఫీ షాపులలో కూర్చుంటారు.

కాంగ్రెస్ అధికారంలో లేని దశాబ్ద కాలంలో పార్టీ పేరును ఉచ్చరించడానికి కూడ ఇష్టపడని వారందరు ఇప్పుడు పార్టీ ప్రవాసీ అనుబంధ సంస్థల పేర షామియానాలు వేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ మరింతగా బలోపేతమయ్యేలా ప్రవాసుల మద్దతును సాధించేందుకై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అమెరికా పర్యటనలో ఏమైనా నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తారా? వేచి చూద్దాం.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎగిసిన బంగ్లా అలలకు ఎవరు కారణం?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'నేను పెను తుఫానును, నేను విధ్వంసాన్ని.. నాకే దయలేదు, అన్నిటినీ ముక్కలు ముక్కలు చేస్తాను. నాకే నిబంధనలూ లేవు, చట్టాలూ లేవు, దారిలో ఉన్నవాటినన్నిటినీ ధ్వంసం చేస్తాను. నేను శివుడిని, తలపై చంద్రుడిని, నుదుటిపై సూర్యుడిని ధరించిన పినాకపాణిని. నేను ప్రళయాగ్రహాన్ని, అల్లకల్లోల సముద్ర ఘోషను. నేను సూర్యోదయపు నూతన యవ్వనాన్ని...'

బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే బంగ్లాదేశ్ జాతీయ కవి నజ్రుల్ ఇస్లాం కొన్ని దశాబ్దాల క్రితం రచించిన 'విద్రోహి' కవిత గుర్తుకు వస్తున్నది. ఎన్నో ఏళ్లుగా అసహనంగా ఉన్న సముద్రం ఆగ్రహంతో పెల్లుబుకినట్లు, నిశ్శబ్దంగా ఉన్న అగ్నిపర్వతం పెటిల్లున పేలినట్లు, ఉన్నట్లుండి ఆకాశం కుప్పకూలినట్లు బంగ్లాదేశ్‌లో జనాగ్రహం రోడ్లపై ప్రవహించింది. కనిపించిన వాటిని ధ్వంసం చేసింది. చట్టసభల్లోకి, ప్రధాని రాజప్రాసాదంలోకి ప్రవేశించి విశృంఖల కృత్యాలకు పాల్పడింది. బంగ్లా అంతటా ఆ దేశ వ్యవస్థాపకుడు ముజిబుర్ రహ్మాన్ విగ్రహాలను కూల్చివేశారు. ఎంతో కాలంగా ఊపిరిబిగపట్టుకుని ఎన్నో దుర్మార్గాలను సహిస్తూ వస్తున్న ప్రజానీకానికి తమ కసి తీర్చుకునేందుకు దేశం దేశమే 'రేజ్ రూమ్' (ఆగ్రహాన్ని వ్యక్తం చేసే గది)గా మారింది. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం ఒక నిప్పుకణిక మాత్రమే. కాని బంగ్లాదేశ్ రగులుకునేందుకు ఎప్పటి నుంచో సిద్ధంగా ఉన్నది. బంగ్లాదేశ్ పాలకులు కానీ, ఆ పాలకులకు స్నేహంగా ఉన్న భారతదేశ నేతలు కానీ జరగబోయే ఉత్పాతాన్ని గ్రహించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోనందువల్లే ప్రస్తుతం ఈ పరిస్థితి తలెత్తింది.

ఈ ప్రజాగ్రహం కేవలం కొన్ని మతతత్వ శక్తులు, అమెరికా, చైనా, పాకిస్థాన్ అనుకూల ప్రేరేపిత శక్తుల వల్ల వ్యక్తమైంది కాదు. ఆఖరుకు అక్కడి ప్రతిపక్షాలతో కూడా నిమిత్తం లేకుండా జనం వీధుల్లోకి ప్రవేశించారు. బంగ్లాదేశ్‌లో దుర్మార్గాలకు అంతు లేనప్పుడు, అణిచివేత తార స్థాయికి చేరుకున్నప్పుడు అన్ని శక్తులూ ఏకమై చేసిన తిరుగుబాటు ఇది. ఆరు నెలల క్రితమే బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వం నాలుగోసారి అధికారంలోకి వచ్చింది. కాని ప్రజాగ్రహానికి ఎన్నికల ఫలితాలతో నిమిత్తం ఉండదని, బూటకపు ప్రజాస్వామ్యాన్ని నాయకులు గౌరవించినా ప్రజలు సహించలేనప్పుడు నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తారని ఈ పరిణామాలు నిరూపించాయి.

తిరుగుబాట్లు అనేక రకాలుగా జరుగుతాయి. అవి హింసాకాండ, ఆగ్రహ జ్వాలలకే దారితీయాల్సిన అవసరం లేదు. శ్రీలంక, నేపాల్, వెనిజులా తదితర దేశాలతో పాటు భారత దేశంలో కూడా అనేకసార్లు ప్రజా ఉద్యమాలకు కావల్సిన రసాయనాలు తయారయ్యాయి. కాని వాటి ఉపశమనానికి కూడా పరిస్థితులు దోహదం చేశాయి. కొన్నిసార్లు ప్రజాస్వామికంగా ప్రజల తీర్పులే వారి ఆగ్రహాన్ని ఉపశమింపచేస్తాయి. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ ప్రభుత్వం పట్ల ఏర్పడిన ప్రజావ్యతిరేకత ఆమె ఓటమితో సమసిపోయింది. యూపీఏ పదేళ్ల పాలనపై, కాంగ్రెస్ రాజకీయాలపై ఆగ్రహాన్ని ప్రజలు బీజేపీని ఎన్నుకోవడం ద్వారా తీర్చుకున్నారు. మళ్లీ ఇటీవల అదే బీజేపీ ప్రభుత్వానికి మెజారిటీ తగ్గించి ప్రజలు పాలకులు తప్పులు సవరించుకునేందుకు, ప్రతిపక్షాలు సంఘటితమయ్యేందుకు అవకాశాన్ని కల్పించారు. దేశంలో ప్రాంతీయ, ఉప ప్రాంతీయ పార్టీలు అనేక సందర్భాల్లో ప్రజాగ్రహాలను తమకు అనుకూలంగా తిప్పుకున్నాయి. బంగ్లాదేశ్‌లో జరిగినట్లు మన ప్రతిపక్షాలు కూడా నిరాశా నిస్పృహలకు గురై ఎన్నికలను బహిష్కరించకుండా సంయమనం పాటించడం కూడా ఒక రకంగా మంచిదైంది.

కాని బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా అవామీ లీగ్ సర్కార్ ప్రజల ఆగ్రహం రోజురోజుకూ పెరిగేందుకే కాని చల్లారేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. బూటకపు ఎన్నికలను నిర్వహించి, నకిలీ ప్రత్యర్థులపై విజయం సాధించి అధికారాన్ని శాశ్వతం చేసుకునే ప్రయత్నం చేసింది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ నేత బేగం జియాను అవినీతి ఆరోపణలపై జైలు పాలు చేసింది. ఆమె కుమారుడు, రాజకీయ వారసుడు లండన్‌కు ప్రవాసానికి వెళ్లాల్సి వచ్చింది. రాజకీయ ప్రత్యర్థులందర్నీ అణిచివేసింది. న్యాయ వ్యవస్థ ప్రజలను రక్షించే బదులు భక్షించే వ్యవస్థగా మారి జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, పౌర సమాజ సంస్థల గొంతు నొక్కేందుకు ఉపయోగపడింది. అక్కడ ప్రభుత్వం నియమించిన న్యాయమూర్తులే కాని, మన దేశంలో మాదిరి కొలీజియం వ్యవస్థ లేదు. 2018లో రూపొందించిన డిజిటల్ సెక్యూరిటీ చట్టం ఆధారంగా ఎవరు ఏ మాత్రం విమర్శలకు పాల్పడినా అణిచివేతకు గురి చేయడం సామాన్యమైంది. మీడియా భయంతో స్వయం సెన్సార్‌షిప్ చేసుకోవాల్సిన ఆగత్యం ఏర్పడింది. పత్రికా స్వేచ్ఛ విషయంలో 180 దేశాల్లో బంగ్లాదేశ్ 163వ స్థానంలో ఉన్నదని 'రిపోర్టర్స్ విథౌట్ బార్డర్స్' సంస్థ తెలిపింది. పెద్ద ఎత్తున నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో ఆ దేశం సతమతమవుతోంది.

బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు పెంచుకోవడం భారత్‌కు వ్యూహాత్మకంగా అవసరమే. ఈశాన్య భారత రాష్ట్రాలకు అక్కడి నుంచి దగ్గరి దారి ఉన్నది. దక్షిణాసియా– పది ఆసియాన్ దేశాల అనుసంధానానికి బంగ్లాదేశ్ కీలకం. ఏడు దేశాల సభ్యత్వంతో కూడిన బిమ్‌స్టెక్‌లో మన ప్రాంతీయ ఆకాంక్షలకు బంగ్లాదేశ్ కేంద్ర బిందువు. పాకిస్థాన్, చైనాలతో ఉన్న శత్రుత్వం రీత్యా బంగ్లాతో స్నేహం అవసరమని మన ప్రభుత్వం భావించింది. చమురు ఉత్పత్తుల సరఫరా, సైనిక సహాయం ద్వారా హసీనా ప్రభుత్వానికి అండగా నిలిచింది. కాని ఈ స్నేహ సంబంధాలు మితిమీరిపోవడంతో భారత్ లేకుండా హసీనా ప్రభుత్వం మనుగడ లేదనే అభిప్రాయానికి దారి తీసింది. 'హసీనా వెనుక భారతదేశం అండగా లేకపోతే ఆమె నెప్పుడో గద్దె దించేవారం' అని ఖలీదా జియా ఒక సందర్భంలో అన్నారు. హసీనా తన నియంతృత్వ పోకడలతో భారత్ ప్రతిష్ఠను కూడా దెబ్బతీశారని ప్రముఖ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ 2017లోనే ఒక వ్యాసంలో రాశారు. హసీనా హయాంలో బంగ్లాదేశ్ బహుళ సాంస్కృతిక సంప్రదాయాలను కోల్పోయిందని, అక్కడ సంపదను హస్తగతంచేసుకున్న కొద్ది మంది వ్యాపారస్తులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారని, అడుగడుగునా అవినీతి కొనసాగుతోందని ఆయన వివరించారు. నిజానికి పాకిస్థాన్‌లో మాదిరి బంగ్లాలో కూడా ఇస్లామిక్ పాలనను రుద్దేందుకు జమాత్ ఏ ఇస్లామియా వంటి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలకు అక్కడి ప్రజలు ఊతమివ్వడం లేదని, కేవలం షేక్ హసీనాకు తగ్గిన జనాదరణవల్లే బంగ్లాదేశ్ ప్రజలు భారత్‌కు వ్యతిరేకంగా, ఇస్లామిస్టు మితవాదులకు అనుకూలంగా మారారని ఆయన చెప్పారు. తాజా పరిణామాల తర్వాత బంగ్లాలో ఏర్పడే ప్రభుత్వంపై ఏ శక్తుల ప్రభావం ఉంటుందో ఇప్పుడే చెప్పలేం.



గత జనవరిలో షేక్ హసీనా గెలుపుతో బంగ్లాదేశ్‌లో రాజకీయ సుస్థిరత ఏర్పడిందన్న ధీమాతో భారత్ ఉదాసీనంగా వ్యవహరించింది. అది బూటకపు రాజకీయ సుస్థిరత అని, అక్కడ ప్రజలు పడగ మీద కొడితే లేచే సర్పాల్లా బుస కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మనం గమనించడం కానీ, హసీనాను అప్రమత్తం చేయడం కానీ చేయలేకపోయాం. బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఇక్కడ మోదీ సేన తమకు 400 సీట్లకు పైగా స్థానాలు లభిస్తాయన్న ఊపులో ఉన్నది. తమ మెజారిటీ తగ్గుతుందని ఊహించలేని వారు బంగ్లాదేశ్ పరిణామాలను ఏ విధంగా ఊహించగలరు? విపక్షాల పట్ల తాము ప్రజాస్వామికంగా వ్యవహరించలేని వారు ప్రజాస్వామికంగా వ్యవహరించాలని హసీనాకు ఏ విధంగా హితవు చెప్పగలరు?

జనవరిలో జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా గెలుపుతో భారత్ అక్కడ రాజకీయ సుస్థిరత ఏర్పడిందన్న ధీమాతో ఉదాసీనంగా వ్యవహరించింది. అమెరికా, బ్రిటన్ తదితర దేశాలు బంగ్లాలో ఎన్నికలు సక్రమంగా జరగలేదని విమర్శిస్తే మన ప్రధాని మోదీ ఆమెకు ఫోన్ చేసి నాలుగోసారి చారిత్రక విజయం సాధించారంటూ అభినందించారు. విచిత్రమేమంటే జనవరిలో ఎన్నికలు జరిగినప్పటి నుంచే అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్నాయని మంగళవారం లోక్‌సభలో విదేశాంగ మంత్రి ప్రకటించారు. మరి ఇన్నాళ్లూ ఎందుకు మౌనంగా ఉన్నారు? బంగ్లాదేశ్‌లో ఏర్పడింది బూటకపు రాజకీయ సుస్థిరత అని కానీ, అక్కడ ప్రజలు పడగ మీద కొడితే లేచే సర్పాల్లా బుస కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని కాని మనం గమనించడం కానీ, హసీనాను అప్రమత్తం చేయడం కానీ చేయలేకపోయాం. జనవరిలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఇక్కడ మోదీ సేన తమకు 400 సీట్లకు పైగా స్థానాలు లభిస్తాయన్న ఊపులో ఉన్నది. తమ మెజారిటీ తగ్గుతుందని ఊహించలేని వారు బంగ్లాదేశ్ పరిణామాలను ఏ విధంగా ఊహించగలరు? ప్రతిపక్షాల పట్ల తాము ప్రజాస్వామికంగా వ్యవహరించలేని వారు బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామికంగా వ్యవహరించాలని హసీనాకు ఏ విధంగా హితవు చెప్పగలరు? పైగా బంగ్లాదేశ్‌లో ఉన్న అవలక్షణాలు ఎన్నో మన దేశంలో కూడా ఉన్నాయి. బంగ్లాదేశ్‌లో హసీనా నియంతృత్వ చర్యలకు భారత్ పూర్తిగా వత్తాసు పలుకుతూ అన్ని విధాలా అండగా ఉన్నందువల్ల ఇవాళ హసీనా పట్ల ఉన్న వ్యతిరేకత భారత్ పట్ల వ్యతిరేకతను కూడా ప్రతిఫలిస్తున్నాయి. మోదీ ఇచ్చిన అండదండల మూలంగానే హసీనా భారత్‌కు నేరుగా రాగలిగారు. అక్కడి సైనికాధికారులు హసీనాకు 45 నిమిషాలు సమయం ఇచ్చి పారిపోయే అవకాశం కల్పిస్తే మన వైమానిక స్థావరంలో ఆమెకు భద్రత కల్పించి క్షేమసమాచారాలను తెలుసుకునేందుకు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను పంపాం. దాని వల్ల మన భారత్‌కేమి ప్రయోజనం? ప్రతి దేశంలోనూ దేశాధినేతలు మారుతూనే ఉంటారు. అందువల్ల వ్యక్తుల ఆధారంగా కాకుండా దేశాల ఆధారంగా మన విదేశాంగ నీతి మారుతూ ఉండాలి.

మనం ఇప్పటికే పాకిస్థాన్, నేపాల్, శ్రీలంకను దూరం చేసుకున్నాం. జనవరిలో మాల్దీవులు భారత్‌కు దూరంగా జరిగి తనను తాను చైనాకు అనుకూలంగా ప్రకటించుకుంది. మన చుట్టూ ఉన్న దేశాల భారత వ్యతిరేకతను చైనా ఉపయోగించుకుంటోంది. బంగ్లాదేశ్ కూడా ఇప్పుడు మన చేజారిపోయింది. కింకర్తవ్యం?


మీ స్నేహితులను సన్నిహితంగా ఉంచుకోవాలి, మీ శత్రువులను మరింత సన్నిహితంగా ఉంచుకోవాలన్నది విదేశాంగ నీతి. మనం చరిత్రను మార్చగలం కాని భౌగోళిక పరిస్థితులను మార్చలేం. మనం స్నేహితులను మార్చుకోగలం కాని పొరుగు వారిని మార్చుకోలేం.. అని మాజీ ప్రధాని వాజపేయి లాహోర్ పర్యటనలో భాగంగా అన్నారు. మన స్వదేశీ విధానం మనను కేవలం ఓడిస్తుంది. విదేశాంగ విధానం మనను పూర్తిగా దెబ్బతీస్తుంది అని కెనడీ ఊరికే అనలేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ప్రజాస్వామ్యం నిండుగా వెలిగిన సభ!

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు కోరుకున్న ప్రజాస్వామిక తెలంగాణను కళ్ళ ముందు ఆవిష్కరిస్తూ, ప్రజలు హర్షించేలా తెలంగాణ శాసనసభ 2024–25 బడ్జెట్ సమావేశాలు నిర్వహించింది ప్రజాప్రభుత్వం. సభ జరిగిన తీరును యావత్ తెలంగాణ సమాజం పొగుడుతున్నది. గత పదేళ్ళకు భిన్నంగా తెలంగాణలో మొట్టమొదటిసారి ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి, సభ్యుల హక్కులు కాపాడబడే విధంగా సభ నిర్వహించిన తీరుపై గౌరవ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారికి, సభా నాయకుడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారికి పార్టీలకతీతంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో లాగా అధికార పార్టీ చట్టసభల్లో బుల్డోజ్ చేయడం కాకుండా ప్రతిపక్షానికి తగిన సమయం ఇచ్చి, వారు చేసే నిర్మాణాత్మక సూచనలను పరిగణనలోకి తీసుకొని, తద్వారా బిల్లులపై అర్థవంతమైన చర్చను నిర్వహించటం ద్వారా ఒక సమర్థవంతమైన సభా నిర్వహణ ఈ సమావేశాలలో ఆవిష్కృతమైంది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభానాయకుడిగా శాసనసభలో చర్చలన్నీ ప్రజాస్వామ్యయుతంగా నడుపుతూ హుందాగా వ్యవహరించారు. సందర్భోచితంగా తన మార్క్ పంచ్ డైలాగులతో విమర్శనాస్త్రాలు సంధించారు. గతంలో కేసీఆర్ సభానాయకుడిగా వ్యవహరించిన తీరుకు భిన్నంగా పదేపదే ప్రతిపక్షాలను సభా చర్చలో పాల్గొనాలని, ప్రతిపక్ష నాయకుడు సభలోకి రావాలని విజ్ఞప్తి చేస్తూ సభ గౌరవ మర్యాదలను పెంపొందించే ప్రయత్నంలో సఫలీకృతమయ్యారు.



గౌరవ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తన కలుపుగోలుతనంతో అధికార పక్షానికి ఎంత సమయం ఇచ్చారో ప్రతిపక్షాలకూ దాదాపు అంతే సమయం ఇస్తూ, సభలో అర్థవంతమైన చర్చ జరగడానికి కృషి చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రజా పద్దు బడ్జెట్‌లో ప్రజా సంక్షేమాన్ని ఆవిష్కరించారు. ముఖ్యంగా రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేసి కాంగ్రెస్ పార్టీ మరోసారి రైతు పక్షపాతి అని నిరూపించారు.

ప్రతిపక్ష నేత హోదాలో ప్రోటోకాల్ అనుభవిస్తూ, ప్రజా సమస్యల మీద చర్చించడానికి శాసనసభకు హాజరుకాని కేసీఆర్‌ను తెలంగాణ సమాజం ఛీత్కరించుకుంటున్నది. దళిత వర్గానికి చెందిన అత్యున్నత సభాపతి ప్రసాద్ కుమార్ వైపు ప్రతిసారీ 'అధ్యక్షా' అని మైకు అవకాశం కోసం చూడలేకనే రాచరికపు పోకడల కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదు అనే వాదన అసెంబ్లీలో మంత్రులు బలంగా వినిపించారు. దశాబ్ద కాలంలో చేసిన శతాబ్దపు దోపిడీ నుంచి తేరుకుని, ఆగమైన తెలంగాణను గాడిన పెట్టి, వాస్తవాలకు దగ్గరగా ప్రవేశపెట్టిన రూ.2,91,00,159 కోట్ల ప్రజా సంక్షేమ, అభివృద్ధి పద్దు (బడ్జెట్)పై చర్చించేందుకు కేసీఆర్ ముఖం చాటేసాడు.

తెలంగాణ భావితరాల భవిష్యత్తు కోసం, ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చారిత్రాత్మక 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్శిటీ తెలంగాణ' బిల్లును ఈ సమావేశాల్లో సభ ఆమోదించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణను టీజీ (TG)గా రాసుకునే వాళ్ళం. కానీ, కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని టీఎస్ (TS)గా మార్చారు. తెలంగాణ ప్రజల కోరిక మేరకు దాన్ని తిరిగి టీజీగా మార్చి ఆ బిల్లుకు ఆమోదం తెలపడం జరిగింది. యాదృచ్ఛికంగా, శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడే మాదిగల ఏబీసీడీ వర్గీకరణపై సర్వోన్నత న్యాయస్థానం ఏబీసీడీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునివ్వడంతో, సభా నాయకుడిగా రేవంత్ రెడ్డి ఆ తీర్పును స్వాగతిస్తూ సుప్రీంకోర్టుకి కృతజ్ఞతలు తెలుపుతూ, ఈ తీర్పును అమలు తెలంగాణ నుంచి మొదలుపెడతామని హామీ ఇచ్చారు. ఇలాంటి కీలకమైన బిల్లుల మీద చర్చించడానికి, నిర్మాణాత్మకమైన సూచనలు ఇవ్వడానికి కూడా ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ సభకు రాకపోవడం ఆయన నిర్లక్ష్యపూరిత రాజకీయాలకు నిదర్శనం. నిబంధనల ప్రకారం ఆరు నెలల్లో ఒక్కసారైనా హాజరు కాకుంటే ఎమ్మెల్యేగిరి సభ్యత్వం రద్దు అవుతుంది కాబట్టి, బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు చర్చ జరగదు కాబట్టి, సమాధానం చెప్పాల్సిన అవసరం రాదు కాబట్టి, తన పదవిని కాపాడుకోవడానికి ఒక్కరోజు హాజరై వెళ్ళిపోయాడు.

రైతు రుణమాఫీపై ప్రజల దృష్టిని మళ్లించడానికి సభలో చర్చ జరగకుండా బీఆర్ఎస్ తొండి రాజకీయాలకు తెగబడింది. ముఖ్యమంత్రి మా అక్క చెల్లెమ్మలు అని సంబోధించిన అంశానికి రాజకీయ రంగు పులుముతూ ప్రశాంతంగా జరుగుతున్న సభలో ఆడబిడ్డలను అడ్డుపెట్టి సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. చర్చలో పాల్గొనాలని సభాపతి, సభా నాయకుడు, శాసన వ్యవహారాల మంత్రి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకోకుండా, ప్రజా సమస్యలపై చర్చ తమకు పట్టదని వాకౌట్ చేశారు. ఓ బీఆర్ఎస్ శాసనసభ్యుడు, సీతక్కను మహిళా మంత్రిని నాలెడ్జ్ లేదని మాట్లాడిన సందర్భం వారు క్షమాపణ చెప్పగానే, ప్రభుత్వం చాలా హుందాగా వ్యవహరించింది. ఇదే సదరు సభ్యుడు గతంలో గవర్నర్‌గా ఉన్న తమిళిసై గారిని అసభ్య పదాలతో దూషించిన సంగతి మనందరికీ తెలుసు. మరి మహిళల గౌరవం ఆనాడు టీఆర్ఎస్ నాయకులకు గుర్తుకు రాలేదా?

తెలంగాణ ఉద్యమం పునాదులే నిరుద్యోగులు. నీళ్లు నిధులు నియామకాలు అనే ట్యాగ్ లైన్‌తో తెలంగాణ ఉద్యమం సాగింది. కానీ కేసీఆర్ అధికారంలో ఉన్న పదేళ్ళల్లో ఒక్క డీఎస్సీ పెట్టకపోగా, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 నియమకాలు చేపట్టకుండా నిరుద్యోగులను వంచించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ మానిఫెస్టోలో నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని ప్రకటించాం. అధికారంలోకి రాగానే 30వేల ఉద్యోగాలు భర్తీ చేసాం. అలాగే గ్రూప్ 1 ద్వారా 563, డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 11,602 టీచర్ పోస్టులు భర్తీ చేసే ప్రక్రియ మొదలైంది. గ్రూప్ 2 పరీక్షా అభ్యర్థుల అభ్యర్థన మేరకు వాయిదా వేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించిన తీరు కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం.


ఈ సభకు కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు అదృష్టవంతులు. దాదాపూ అందరికీ అవకాశం దొరికింది. గత పదేళ్ళల్లో ప్రతిపక్షాలను సస్పెండ్ చేసి, ఏకపక్షంగా సభ నడిపిన నిరంకుశ పాలనకూ, మీరు ఎంత ఆందోళన చేసినా మిమ్మల్ని చర్చలోకి ఆహ్వానిస్తామే తప్ప సస్పెండ్ చేయం అని రాజనీతిజ్ఞతను ప్రదర్శించిన ప్రస్తుత ప్రజాపాలనకూ మధ్య స్పష్టమైన తేడాను ప్రజలు గమనిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు దేశం గర్వించదగ్గ స్థాయిలో, ప్రజాస్వామ్య విలువలతో, సభా వ్యవహారాలు నడుపుతారని తెలంగాణ సమాజానికి భరోసా దొరికింది.

● డాక్టర్ కొనగాల మహేష్
కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

దయనీయస్థితిలో చేనేత రంగం

తెలంగాణలో చేనేత కార్మికుల పరిస్థితి రోజురోజుకి దిగజారుతూ అనేకమంది ఉపాధి కోల్పోతున్నారు. 1990ల నుండి ప్రవేశపెట్టిన ఉదారవాద ఆర్థిక విధానాలు చేనేతరంగాన్ని సంక్షోభంలోకి నెట్టివేశాయి. ఈ రంగంలో వినియోగించే హ్యాంక్ నూలు... ముఖ్యంగా ఎక్కువగా వాడే 40వ కౌంట్ అందుబాటులో లేకుండా పోయింది. నూలు, రంగులు, రసాయనాలు ధరలు విపరీతంగా పెరగడం, మన అవసరాలు చూడకుండా విదేశాలకు ఎగుమతి చేయడంతో దేశీయ అవసరాలను నిర్లక్ష్యం చేసిన పాలకులు ఈ సంక్షోభానికి ప్రధాన కారణం. చేనేత రంగంలో సహకార సంఘాలు సంస్థాగతంగా బలహీనపడటం వల్ల నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వర్గాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నా బలమైన ఉద్యమాలు లేవు.

చేనేత రంగంలో ఉపాధి పొందుతున్న వారి నైపుణ్యాలు, సామర్థ్యాలు పెంచడం; చేనేత వస్త్ర ఎగుమతుల వృద్ధి; మార్కెట్ సర్వే, డిజైన్ల అభివృద్ధి; తగిన రుణ సౌకర్యాలు వంటి చర్యల ద్వారా అనేకమందికి ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉన్న రంగం ఇది. చేనేత పరిశోధన కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేనేత కార్మికుల పరిస్థితిపై కోయిలగూడెం, పోచంపల్లి, పుట్టపాక, ఘట్టుప్పల్, చండూల్ గ్రామాలలో క్షేత్రస్థాయి అధ్యయనం జరిగింది. ఈ రంగంలో విధానం మార్పుల ద్వారా; ఉపాధి, నైపుణ్యాల పెంపు ద్వారా చేనేత మార్కెట్ పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చేనేత డిజైన్లకు జిఐ ట్యాగ్ గుర్తింపు ఉన్నప్పటికీ, ఆ డిజైన్లను పెద్ద ఎత్తున మిల్లు మరమగ్గాల రంగంలో కాపీ చేస్తున్నా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవడం లేదు. చేనేత రంగంలో చట్టపరంగా, విధిగా కొన్నిరకాల వస్త్రాలకు రిజర్వేషన్ కేటాయించి, రక్షణ కల్పించాల్సి ఉన్నా, దానిని అమలు చేయడం లేదు. చేనేత వస్త్రాలు, సిల్క్ వస్త్రాలు, ఉన్నత స్థాయి నైపుణ్యంతో ఉత్పత్తి చేసే రకాలను మరమగ్గాలు, మిల్లులపై యంత్రాలతో పెద్ద ఎత్తున చౌక రకం, నకిలీ సిల్క్ వస్త్రాలు ఉత్పత్తి చేసి, చేనేత రంగంలో వారి జీవనోపాధిని, హక్కులను దెబ్బతీస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 సంవత్సరం నుండి చేనేత సహకార సంఘాలు ఎన్నికలు లేకుండా అధికారుల పాలనలో ఉన్నాయి. చేనేత రంగ ప్రతినిధులు ఆ రంగానికి అనుకూలమైన నిర్ణయాలు చేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారు. చేనేత రంగంలో డిజైనర్ల మేధోపరమైన హక్కులను ఉల్లంఘిస్తున్నా దీనిని అరికట్టాల్సిన అధికారులు మౌనంగా ఉండడం కూడా ప్రస్తుత సంక్షోభానికి కారణం. ఫలితంగా అనేకమంది చేనేత వృత్తికారులు, మాస్టర్ వీవర్స్ కింద పరిమిత రోజుల్లోనే పనిచేయాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. సహకార సంఘాలలో వస్త్ర నిల్వలు పేరుకుపోయి కొనుగోలు చేయగల ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో, సొసైటీలు వద్ద నిల్వలు పేరుకుపోయాయి. ఒకప్పుడు బాగా నడిచిన సహకార సంఘాలు నిర్వీర్యమై స్తబ్దంగా తయారయ్యాయి.

తెలంగాణలో బతుకమ్మ పండుగను రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తూ, బతుకమ్మ చీరల ఉత్పత్తి ద్వారా చేనేత రంగంలో వృత్తికారులకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తామని ప్రచారం చేసింది. కానీ ఆచరణలో ఇతర రాష్ట్రాల్లోని మరమగ్గాల లాబీ ద్వారా చీరలను కొనుగోలు చేసింది. ఈ పథకం సక్రమంగా అమలు జరిగివుంటే చేనేత కార్మికులకు ఉపాధి లభించడమే గాక, నాణ్యమైన వస్త్రాలను ప్రజలకు అందించగలిగేవారమని నేతన్నలు ఆశపడ్డారు. తెలంగాణ రాష్ట్ర సమితి బతుకమ్మ పండుగను ఒక అపహాస్యంగా తయారు చేసి చేనేత కమ్యూనిటీ స్ఫూర్తికి, తెలంగాణ గుర్తింపునకు తీరని నష్టం చేసింది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధి కల్పన, జీవనోపాధి, సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా చేనేతరంగాన్ని ఈ దుస్థితి నుంచి బయటపడేస్తుందని ఆశిద్దాం.

– కే. శ్రీనివాసులు, విశ్రాంత ప్రొఫెసర్, ఉస్మానియా యూనివర్సిటీ
(నేడు చేనేత దినోత్సవం)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 7 ఆగస్టు 2024



'ఉపాధి'పై అనుమానాలు!

- లక్ష్యాన్ని మించి పనులు కల్పించడం పట్ల సందేహాలు
- తనిఖీలకు ప్రత్యేక కేంద్ర బృందాల ఏర్పాటు
- త్వరలో క్షేత్రస్థాయి పరిశీలనకు ఉమ్మడి జిల్లాకు రాక
- రికార్డులను సిద్ధం చేస్తున్న డీఆర్‌డీవో అధికారులు

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం తీరుతెన్నులపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా అధికారులు రికార్డుల్లో చూపిన మేరకు వాస్తవంగానే ఉపాధి పనులు జరిగాయా? హాజరైన కూలీల సంఖ్య సక్రమంగానే ఉందా? అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ అనుమానాలకు చెక్‌పెట్టేలా కేంద్రం క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలకు శ్రీకారం చుడుతోంది. ఇందుకోసం కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి రికార్డులో చూపిన మేరకు ఉపాధి లెక్కలు సక్రమంగా ఉన్నాయా? ఏవైనా అవకతవకలు ఉన్నాయా? అంశాలపై నిగ్గుతేల్చనున్నాయి. ఇందులో భాగంగా ఆ బృందంలోని అధికారులు సంబంధిత రికార్డులను పరిశీలించడంతో పాటు అవసరమైతే కూలీలతో నేరుగా మాట్లాడతారు. త్వరలోనే కేంద్ర బృందాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో కూడా పర్యటించనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రికార్డులను సిద్ధం చేస్తున్నారు.

గణాంకాల పెరుగుదలతో అనుమానాలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 18 జిల్లాల్లో కూలీల సంఖ్య, పనిదినాలు 150శాతానికి పైగా పెరిగినట్టు గణాంకాలు వెలుగు చూడడంతో పనుల కల్పన, కూలీల హాజరుపై కేంద్ర ప్రభుత్వానికి అనుమానం కలిగింది. క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించి నిగ్గుతేల్చాలని నిర్ణయించింది. ఈ మేరకు పనులను పరిశీలించడానికి కేంద్ర బృందాలను పంపుతోంది. పని దినాల కల్పన విషయంలో కేంద్రానికి అనుమానం కలిగిన రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఉమ్మడి వరంగల్‌లోని ఆరు జిల్లాలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఆరు జిల్లాల్లో పనులు, కూలీలకు సంబంధించిన రికార్డులు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం 2022-23 సంవత్సరంలో జరిగిన పని దినాలతో 2023-24 సంవత్సరంలో జరిగిన పనిదినాలను పోల్చి చూసింది. 2022-23లో ఉపాధి పని దినాలు 2023-24 కన్నా తక్కువగా ఉండడంతో అనుమానం పడుతోంది. ఇటీవల అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా సభకు రాష్ట ప్రభుత్వం సమర్పించిన 2024 సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టులో కూడా రాష్ట్రంలో 18 జిల్లాల్లో లక్ష్యానికి మించి పని దినాలు కల్పించినట్టు పేర్కొన్నది.

రికార్డులను సిద్ధం చేస్తున్న అధికారులు

కూలీల పని దినాలు పెరగడానికి నిర్దిష్టమైన కారాణాల అన్వేషణ కోసం కేంద్ర బృందాలు ఈనెలలోనే తనిఖీలకు రానున్నాయి. ఈ క్రమంలో అధికారులు ఉపాధి పనులకు సంబంధించిన రికార్డులు సరి చూసుకుంటున్నారు. గ్రామ సభ తీర్మానం, ఎన్‌వోసీ పత్రం, పనుల ప్రదేశాల్లో బోర్డులు, చేసిన వ్యయం, ఎంత మందికి పని కల్పించామనే వివరాలు, పని ప్రారంభానికి ముందు, ఆ తర్వాత ఫొటోలు సేకరిస్తున్నారు. కేంద్ర

మిగతా 8వ పేజీలో..

లక్ష్యాలకు మించి..



మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరోస్థానంలో నిలవగా మహబూబాబాద్ జిల్లా అట్టడుగున 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2022-23 సంవత్సరంలో 24.8లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా దానిని మించి 30.5 లక్షల పని దినాలను (123శాతం) పని దినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5 లక్షల పని దినాలను కల్పన లక్ష్యంకాగా అంతకు మించి 20.3 లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా పనిదినాల లక్ష్యం 19.3లక్షలు కాగా 21.9లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానం, ములుగు జిల్లాలో 12.1లక్షల పని దినాలు లక్ష్యం కాగా 13.4లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా 21.2లక్షల పని దినాలతో (106 శాతం) 29వస్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3లక్షల పని దినాలు లక్ష్యం కాగా 55.9 (105 శాతం) పని దినాలతో రాష్ట్ర స్థాయిలో అట్టడుగున 31వ స్థానంలో నిలిచింది.

వర్షాలు తక్కువ పడడం వల్లే పనులు పెరిగాయి

- కె.నాగ పద్మజ, డీఆర్‌డీవో
గ్రామీణాభివృద్ధి శాఖ, హనుమకొండ జిల్లా



2022-23 సంవత్సరంలో కన్నా 2023-24లో వర్షాలు తక్కువ పడ్డాయి. చాలినన్ని వర్షాలు పడకపోవడంతో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోయాయి. దీంతో సహజంగానే గ్రామాల్లో వ్యవసాయ పనులు మందగించాయి. కూలీలకు వ్యవసాయ పనులు దొరకని పరిస్థితి ఏర్పడింది. దీంతో కూలీలంతా ఉపాధి హామీ పనులవైపు మళ్లారు. పైగా కేంద్ర ప్రభుత్వం కూడా ఉపాధి హామీ పథకం కింద ప్రతీ గ్రామ పంచాయతీలో గరిష్ఠంగా 25 మంది కూలీలకు పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఆ మేరకు కూలీలను సమీకరించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అదే లక్ష్యం ప్రకారం ఉపాధి పనులను చేయించాం. దీంతో సహజంగానే 2023-24 సంవత్సరంలో పని దినాలు పెరిగాయి. అంతేకాకుండా ఎన్ఆర్ఎం పనులు కూడా ఈ సారి ఎక్కువ చేశారు. దీనికితోడు వ్యవసాయాధారిత పనులు చేపట్టాము. ఈ కారణాలను ప్రభుత్వానికి రాసి పంపాము.



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

జయశంకర్‌సార్ ఆశయాలను కొనసాగించాలి

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

బాలసముద్రం, ఆగస్టు 6: ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను కొనసాగించాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలపార్క్‌లో ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతి వేడుకలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండా ప్రకాశ్ హాజరై ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో జరిగిన ఆకలిచావులు, రైతుల ఆత్మహత్యల మీద, తెలంగాణ వెనుకబాటుతనం నిధులు, నియామకాల మీద విస్తృతంగా పరిశోధనలు చేసి తెలంగాణ సమాజాన్ని చైతన్యవంతం చేసిన వ్యక్తి జయశంకర్‌సార్ అని అన్నారు. వైస్‌చాన్స్‌లర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన తరువాత తన జీవితాన్ని తెలంగాణ ఉద్యమానికి అంకితం చేసినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిషన్ ఎదుట, ప్రణబ్ ముఖర్జీ కమిటీ ఎదుట తన వాదనలు వినిపించి తెలంగాణ ఏర్పాటుకు కృషిచేసినట్లు ఆయన పేర్కొన్నారు. శాసన సభ ప్రాంగణంలో కూడా జయంతి ఉత్సవాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జయశంకర్ ఆలోచనలు కింది స్థాయికి తీసుకువెళ్లి తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసినప్పుడే వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ 90వ జయంతిని అధికారికంగా జరుపుకున్నట్లు తెలిపారు. వారి సేవలు చిరస్మరణీయమన్నారు. జయశంకర్‌సార్ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, ఆర్డీవో వెంకటేశ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



గంగ, యమున, సరస్వతీ నదుల నుంచి తీసుకొచ్చిన నీటితో తయారు చేసిన చీరను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

చేయూతనిద్దాం.. చేనేత వస్త్రాలను ధరిద్దాం..

- రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6: చేనేత వస్త్రాలను తయారు చేసే నేతన్నలకు చేయూతనిద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికులకు, వృత్తిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్‌కుమార్ గంగ, యమున, సరస్వతీ నదుల నుంచి తీసుకొచ్చిన నీటితో తయారు చేసిన చీరను కొత్తకొండలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... ప్రముఖ సిరిసిల్ల చేనేత కళాకారుడు నల్ల విజయ్ గతంలో అగ్గిపెట్టెలో పట్టే చీరను శాలువాతో తయారు చేసిన గొప్ప కళాకారుడని కొనియాడారు. ఇప్పుడు గంగ, యమున, సరస్వతీ మూడు నదుల నుంచి తీసుకొచ్చిన నీటితో చీరను తయారు చేశాడన్నారు.

చేనేత వృత్తికి ఆదారణతో పాటు గౌరవం పెరగాలన్నారు. అప్పుడే చేనేత వృత్తిదారులకు ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు. చేనేతతో తయారైన వస్తువులను అందరూ ధరించినట్లయితే వారికి ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయన్నారు. కళా నైపుణ్యం కలిగి మూడు నదుల నీటితో చీరను తయారు చేసిన విజయ్ సోదరులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం తరుపున వారికి అన్ని రకాలుగా అండదండలు అందిస్తామన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత వృత్తిని కాపాడాలన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడి ఉన్నవారు తయారు చేసిన వస్త్రాలను ధరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?

వివరాలు : 7లో..



49వ డివిజన్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

రెండో రోజూ.. అదే జోరు..

- డివిజన్లలో 'స్వచ్ఛదనం.. పచ్ఛదనం' కార్యక్రమాలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 6: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ 66 డివిజన్‌ల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'స్వచ్ఛదనం.. పచ్ఛదనం' కార్యక్రమాలు మంగళవారం పండగలా కొనసాగాయి. రెండో రోజు వర్షాన్ని సైతం లెక్క చేయక కార్పొరేటర్ల సహకారంతో ప్రత్యేక అధికారులు, స్వయం సహాయక బృందాల పర్యవేక్షణలో పలు అవగాహన కార్యక్రమాలు కొనసాగాయి. మంగళవారం సుమారు 2500మంది ప్రజలను భాగస్వాములను చేస్తూ 66 మంది స్వయం సహాయక బృందాల సభ్యులు వార్డులో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. 32 కిలోమీటర్ల వరకు వీధులు, 22 పబ్లిక్ ప్లేస్‌లు, 66 ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలను శుభ్రం చేశారు. వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ఇంకా, ఇంకుడు గుంతలు లేని 478 భవనాలను గుర్తించి అధికారులకు రిపోర్టు అందించారు. ఈ కార్యక్రమాలలో పలు డివిజన్‌ల కార్పొరేటర్లు, ప్రత్యేక అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

కర్షకుడి శ్రమ పుడమిపాలు

- కాసులకోసం ఓ ప్రబుద్ధుడి కర్కషం
- ఒంటిమామిడిపల్లిలో మొక్కజొన్న, పత్తి పంటల ధ్వంసం




ధ్వంసమైన పత్తి చేను, నేలమట్టమైన మొక్కజొన్న చేను వద్ద రోదిస్తున్న సాంబరాజు

ఐనవోలు, ఆగస్టు 6: ఆస్తి కోసం ఆరుగాలం శ్రమించి సాగుచేసిన పంటను ఓ ప్రబుద్ధుడు కర్కషంగా పుడమిపాలు చేశాడు. ఈ సంఘటన ఒంటిమామిడిపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఇదే గ్రామానికి చెందిన బండమీది సాంబరాజుకు గ్రామ శివారులో 2 ఎకరాల భూమి ఉంది. అందులో ఒక ఎకరం మొక్కజొన్న, ఒక ఎకరం పత్తిని సాగుచేశాడు. పెట్టుబడి పెట్టాడు. పంట ఏపుగా పెరిగింది. మొక్కజొన్న కంకులు వేసు తోడుతున్నాయి. పత్తి చేలో పూత వస్తోంది. పంట చేతికి అందుతుందని నమ్మకంగా ఉన్నాడు. ఇంతలోనే నందనంకు చెందిన సాంబరాజు మేనబావ పిడుగు కుమార్ సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్ రోటవేటర్‌తో మొక్కజొన్న, పత్తిపంటను అక్కరకు రాకుండా నేలమట్టం చేశాడు. మంగళవారం ఉదయం సాంబరాజు చేను వద్దకు వెళ్లగా ధ్వంసమైన పంట కనిపించడంతో కన్నీటి పర్యంత మయ్యాడు. సుమారు రూ.3లక్షల విలువచేసే పంటను తన మేన బావ కుమార్ ధ్వంసం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ధ్వంసమైన పంటచేనును క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డబ్బుల కోసం..

సాంబరాజు, కుమార్ మధ్య మధ్య ఆర్థికపరమైన వివాదం ఉంది. ఒంటిమామిడిపల్లికి చెందిన పెద్దులు-యాదమ్మ దంపతులకు సాంబరాజు పుట్టక ముందు నందనంలో యాదమ్మ సోదరుడి కుమారుడైన కుమార్‌ను దత్తత తీసుకున్నారు. ఆ తర్వాత సాంబరాజు జన్మించాడు. ఇద్దరిని సాకారు. కుమార్‌కు పెళ్లి సైతం చేసి మూడెకరాల భూమిలో ఎకరం భూమి, ఇంటిలో సగభాగం ఇచ్చారు. అయితే అతడు ఎకరం భూమిని, ఇంటిని సాంబరాజుకే విక్రయించి తన స్వగ్రామమైన నందనంకు కుమార్ వెళ్లాడు. భూమి విక్రయించిన ఆర్థిక లావాదేవీల్లో రూ.26లక్షలు చెల్లించగా, ఇంకా రూ.10లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇంతలోనే సాంబరాజు తండ్రి పెద్దులు కాలం చేయడంతో డబ్బులు చెల్లించలేక గడువును కోరాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తి అర్ధరాత్రి పంటనష్టానికి దారితీసిందని స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

జిల్లా అధికారులతో ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



వరంగల్ అభివృద్ధిపై మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 6: వరంగల్ సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ నగరాభివృద్ధిపై మంగళవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంత్రి కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు, వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించేం దుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందన్నారు. ఇందుకనుగుణంగా అధికారులు పనిచేయాలని సూచించారు. వరంగల్ నగరం చుట్టుపక్కల ఉన్న ఇన్నర్, ఔటర్ రింగురోడ్డు, ఎయిర్‌పోర్టులో భూములు కోల్పోయిన రైతులకు మానవీయకోణంలో న్యాయం చేస్తామన్నారు. చారిత్రక భద్రకాళి దేవాలయం పనులు ఆగమ శాస్త్రం ప్రకారం జరుగుతాయన్నారు. సీజన్‌వ్యాధులు ప్రబల కుండా ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్లు స్పందించి తగు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీలు పోచంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, బస్వరాజు సారయ్య, ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిశోర్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లా కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలు పాల్గొన్నారు.

పారిశుధ్య లోపం.. ప్రజలకు శాపం..

- కాలనీల్లో పేరుకుపోతున్న చెత్త చెదారం
- అపరిశుభ్రతతో విజృంభిస్తున్న విషజ్వరాలు
- దోమలను నివారించాలని వేడుకోలు




పోలీసు కాలనీలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు

వడ్డేపల్లి, ఆగస్టు 6: హనుమకొండ పట్టణంలోని వివిధ డివిజన్లలో పారిశుధ్య సమస్య పడకేసింది. కాలనీలలో చెత్త చెదారం పేరుకుపోయి విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మౌలిక వసతులు కల్పించి విషజ్వరాల బారి నుంచి తమను కాపాడాలని ప్రజలు గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులను వేడుకుంటున్నారు.

పేరుకుపోయిన చెత్త

గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పోలీసు కాలనీ, సప్తగిరి కాలనీ, బంజారా కాలనీ, గోపాల్‌పూర్, 57వ డివిజన్ గాంధీనగర్, అశోక కాలనీ, సమ్మయ్య నగర్ ప్రాంతాలలో చెత్త పేరుకుపో తోంది. రోడ్డుకిరువైపులా చెత్త పేరుకుపోవడంతో వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోందని కాలనీల వాసులు వాపోతున్నారు. కుళ్లిపోయిన చెత్త, వ్యర్థాలపై వాలిన ఈగలు, దోమల తిను బండా రాలపై వాలడంతో తాము రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మురుగునీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందడంతో రాత్రివేళల్లో వాటి బారిన పడుతున్నామని వివిధ కాలనీల వాసులు అంటున్నారు. దోమల బెడద వల్ల విషజ్వరాల పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కాలనీల ఖాళీస్థలాల్లో నిరుపయోగమైన చెట్లు ఏపుగా పెరిగి దోమల వృద్ధికి విడిది కేంద్రాలుగా మారుతున్నాయి. దోమల నివారణ మందును చల్లించి విషజ్వరాల బారి నుంచి తమను కాపాడాలని వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులను కోరుతున్నారు.



డెంగీ బారిన..

గోపాల్‌పూర్‌లోని వివిధ కాలనీలలో ప్రజలు డెంగీ జ్వరాల బారిన పడుతున్నారు. గోపాల్‌పూర్‌లోని బృందావన కాలనీ రోడ్ నంబర్ 1, 2 తోపాటు ద్వారకా సాయి కాలనీ, జవహర్ కాలనీ, పరిమళ కాలనీలలో పక్షం రోజుల నుంచి ప్రజలు డెంగీ జ్వరాలతో బాధపడుతున్నారు. వివిధ కాలనీలలో పారిశుధ్య లోపం వలన దోమలు వృద్ధి చెంది సుమారు 50 మంది డెంగీ జ్వరాలతో ఆస్పత్రి పాలయ్యారు. మహానగర పాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి దోమల నివారణ మందును చల్లించడంతోపాటు కాలనీలలో వైద్య శిబిరాలను నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రతీ రోజు ఫాగింగ్ చేపట్టాలి..

దోమల నివారణకు ప్రతీ రోజు ఫాగింగ్ చేపట్టాలి. మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్ చల్లించి దోమల వృద్ధిని అరికట్టాలి. ఖాళీస్థలాల్లో ఏపుగా పెరిగిన పచ్చిమొక్కలు, చెట్లను తొలగించేందు కోసం ఖాళీ స్థలాల యజమానులకు జీడబ్ల్యూఎంసీ అధికారులు నోటీసులు జారీ చేయాలి. విషజ్వరాలను నివారించేందుకు కాలనీలలో వైద్య శిబిరాలను నిర్వహించాలి.



సప్తగిరి కాలనీలోని ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

బీసీ నేత జక్కని సంజయ్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న జక్కని సంజయ్ కుమార్

హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోటా అమలు కోసం ఈనెల 10వ తేదీన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని ఒక హోటల్‌లో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం వాటా అమలుకు అన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలతో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని బీసీలు విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ బీసీల కోసం పోరాటం చేస్తున్నారని, ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ డిక్లరేషన్ ప్రకటించినందుననే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైందని, కనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తప్పక అమలుచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజకీయ పోరాట సమితి యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పంజల రేవంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో బీసీ నాయకులు తిరుపతి, బొంగోని అభిలాష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, ఆగస్టు 6: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. మంగళవారం ఇన్‌ఫ్లో 3.62లక్షల క్యూసెక్కులు ఉండగా 85 గేట్లను ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం సోమవారం 4.90 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో బ్యారేజీ వచ్చే ఇన్‌ఫ్లో పెరుగుతున్నట్లు తెలిపారు. అన్నారం బ్యారేజీకి 3 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 66 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

వరంగల్ క్రైం, ఆగస్టు 6: కాకతీయ యూనివర్సిటీ పోలీసులు మంగళవారం పేకాటాడుతున్న వారిని అరెస్టు చేశారు. కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకుని తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.


హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న బెగ్లూర్ భక్త బృందం

ఐలోని మల్లన్న సన్నిధిలో హనుమాన్ చాలీసా పారాయణం

ఐనవోలు, ఆగస్టు 6: ఐనవోలు మల్లికార్జునస్వామి దేవస్థానంలో మంగళవారం హనుమాన్ చాలీసాతోపాటు భక్తిగీతాల పారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగింది. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం బెగ్లూర్ గ్రామానికి చెందిన హనుమాన్ చాలీసా పారాయణ బృందం సుమారు 25 మంది పాల్గొని పారాయణం చేసి ఆధ్యాత్మికతను చాటారు. భక్తులు ఎంతో భక్తితో ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, బృందం అధ్యక్షుడు దారం రమణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, ఆగస్టు 6: హసన్‌పర్తి మండల కేంద్రంలో రూ.6,800 విలువైన నిషేధిత గుట్కాను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఏఎస్‌ఐ మల్లిఖార్జున్, కానిస్టేబుళ్లు రాజశేఖర్, నాగరాజు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మండల కేంద్రంలో అన్నం సురేష్ గుట్కా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. పోలీసులు సురేష్ నిర్వహిస్తున్న కిరాణషాపుపై దాడులు నిర్వహించి గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. పరారయ్యేందుకు ప్రయత్నించిన సురేష్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మల్లిఖార్జున్ తెలిపారు.

అద్దింటోళ్లంటే.. అంత అలుసా?

కొందరు యజమానుల తీరుతో కిరాయిదారుల అవస్థలు

- ఏ మాత్రం అసౌకర్యమైనా తక్షణం ఖాళీకి ఒత్తిడి
- కాలనీవాసుల్లోనూ అద్దింటోళ్లపై చులకన భావం
- బ్రహ్మచారులు, నిమ్నవర్గాల వారికి దొరకటం గగనమే..
- భారీగా పెరిగిన అద్దె రేట్లతో ఇబ్బందులు



హనుమకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అద్దె ఇంట్లో ఉన్న వారి అవస్థలు అన్నీ ఇన్నీ కావు. యజమానులు షరతులు పెడుతూ ఏమాత్రం ఇబ్బంది కలిగినా తక్షణమే ఖాళీ చేయిస్తున్నారు. అలాగే చుట్టుపక్కల ఉండే సొంతిళ్ల వారితో ఇబ్బం దులు తప్పడం లేదు. వారు చూసే చిన్నచూపు, సూటిపోటి మాటలతో అద్దె కుంటుంబం తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారు. అయితే తప్పని పరిస్థితుల్లో కాలం వెల్లదీస్తున్నారు. బతుకు దెరువుకోసం నగరానికి వలస వచ్చే వారి సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతోంది. దీనికి తోడు పైచదువుల కోసం నగరానికి వచ్చే విద్యార్థులు కూడా అధిక సంఖ్యలో ఉంటున్నారు. కొందరికి మాత్రమే హాస్టల్ వసతి సమకూరుతోంది. మిగతా వారంతా అద్దె ఇళ్లలోనే తలదాచుకోక తప్పడం లేదు. ప్రైవేటు హాస్టళ్లలో ఉండాల్సి వస్తే భరించలేనంతగా ఫీజులు ఉంటున్నాయి. ఆర్థిక స్తోమత లేని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు నలుగురైదుగురు కలిసి ఇల్లు అద్దెకు తీసుకొని ఏదో విధంగా తక్కువ ఖర్చుతో నెట్టుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

షరతులతో బెంబేలు

పట్టణీకరణ పెరిగిన తర్వాత అద్దె ఇళ్ల పిరమయ్యాయి. అపార్టుమెంట్ సంస్కృతి పెరిగిన తర్వాత ఇండిపెండెంట్ ఇల్లు దొరకడం కష్టంగా మారింది. దొరికినా అద్దె రేట్లు ఆకాశన్నంటుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. ఈ క్రమంలో ఎక్కడైనా టు లెట్ బోర్డు కనిపిస్తే ఎగిరి గంతేసి వెళ్లి వాకబు చేస్తే యజమాని పెట్టే నిబంధనలతో చుక్కలు కనిపిస్తున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోయినా అద్దెలు మాత్రం దండిగానే వసూలు చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఏటా 10 నుంచి 15శాతం పెంచుతున్నారు.

క్షణాలమీద ఖాళీకి ఒత్తిడి

యజమానులు అద్దెలను ఇష్టారాజ్యంగా పెంచడమే కాదు.. పెంచినంత అద్దె ఇవ్వడానికి అద్దెకున్నవారు ఏ మాత్రం తటపటాయించినా ఖాళీ చేయమని హుకుం జారీ చేస్తున్నారు. అలాగే తమతో ఏ చిన్న తగాదా వచ్చినా తట్టాబుట్టా సర్దుకోమని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో తమ ఇంట్లో శుభకార్యం ఉన్నా, లేదా ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే కుమారులు, కుమార్తెలు వచ్చినా అద్దెకున్నవారిని నిర్ధాక్షిణ్యంగా ఖాళీ చేయిస్తున్నారు. మరమ్మతులు చేయించాలనుకున్నా, లేదా కూలగొట్టి మళ్లీ కట్టాలనుకున్నా కనీస ముందస్తు సమాచారం లేకుండానే ఖాళీ చేయాలని చెబుతున్నారు. మరో ఇల్లు వెతుక్కోవడానికి సమయం కూడా ఇవ్వడం లేదు. వాస్తవానికి అద్దెకున్నవారిని ఖాళీ చేయించాలనుకుంటే టెనెంట్ యాక్టు ప్రకారం ఇంటి యజమానులు కొన్ని నిబంధనలు పాటించాలి. అద్దెకున్నవారికి మూడు నెలలు ముందు సమాచారం ఇవ్వాలి. లేదా మరో ఇల్లు అద్దెకు దొరికే వరకు అవకాశమివ్వాలి. తక్షణం ఖాళీ చేయించే హక్కు లేదు. ఒక వేళ అలా చేస్తే అద్దెకున్నవారు సాయం కోసం పోలీసులను ఆశ్రయించవచ్చు.

దారుణంగా పెరిగిన అద్దెలు

నగరంలో పెరిగిన అద్దెలతో జనం అల్లాడిపోతున్నారు. నిన్నమొన్నటి వరకు ఉన్న ఇంటి అద్దెలతో పోల్చితే ఇప్పుడున్న అద్దెలు మరీ ఎక్కువగా పెరిగాయి. దీంతో పేదలు, సామాన్యులకు బాడుగ ఇళ్లలో ఉండడం కూడా భారంగా మారింది. ఇటీవల కాలంలో హైదరాబాద్ లాంటి నగరాల్లో ఇంటి అద్దెలు 9 శాతం పెరిగితే.. వరంగల్ నగరంలో 6 నుంచి 7 శాతానికి పెరిగాయి. ఇక బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, చౌరస్తా లాంటి ప్రాంతాల్లో ఉన్న ఇళ్లకు అద్దె ఒక రేటు, కాస్త దూరంగా ఉన్నవాటికి మరో రేటు. హనుమకొండ చౌరస్తా, బ్రాహ్మణవాడ, మచిలీబజార్, కాపువాడ, అలంకార్ జంక్షన్, కాజీపేట, నయీంనగర్, నిట్ కేయూ 100 అడుగుల రోడ్డు, కేయూ క్రాస్ రోడ్డు, అంబేద్కర్ జంక్షన్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్డు, టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, అడ్వకేట్స్ కాలనీ, బాలసముద్రం లాంటి నగరం నడిబొడ్డున ఉన్న కాలనీల్లో ఇళ్ల అద్దెలు భగ్గుమంటున్నాయి. సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 5వేలు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ.7వేల నుంచి రూ.8వేలు, త్రిబుల్ బెడ్ రూమ్ ఇళ్లు రూ. 10వేల నుంచి రూ.15వేల మధ్య అద్దెలు ఉంటున్నాయి. కారు పార్కింగ్, ఇంటీరియర్ డిజైన్లు ఉంటే ఆ ఇళ్లకు వేరే రేటు ఉంటోంది. మెరుగైన సౌకర్యాలు ఉన్న ఇళ్ల అద్దెలు ఇంతకన్నా ఎక్కువనే పలుకుతున్నాయి. అపార్ట్‌మెంట్లలో అయితే డబుల్ లేదా త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల అద్దె రేట్లు రూ.15 వేల నుంచి రూ.20వేల వరకు ఉంటున్నాయి. దానికి మెయింటనెన్స్ చార్జీల రూపంలో రూ.1500 నుంచి రూ.2వేలు అదనంగా తీసుకుంటున్నారు. దీంతో చాలామంది నగర నగర శివార్లలో ఉన్న కాలనీలోని ఇళ్లను ఆశ్రయిస్తున్నారు.

ఇళ్లు గగనమే

నగరంలో కొన్ని వర్గాల వారికి అద్దె ఇల్లు దొరక్కపోవడం గగనమే అవుతోంది. దళితుల లాంటి నిమ్నవర్గాలకు ఇళ్ల ఇవ్వడానికి అగ్రకులాల యజమానులు నిరాకరిస్తున్నారన్న అపవాదు ఉంది. టు లెట్ బోర్డు చూసి వెళ్లినవారిని మొదట కులమేంటని అడుగుతున్నారు. తక్కువ కులం వారైతే ఇళ్ల ఖాళీగా ఉన్నా లేవని చెప్పి పంపించేస్తున్నారు. చివరకు వారు దళితులకు చెందిన ఇళ్లలో అద్దెకు దొరికితే అదే అదృష్టంగా సర్దుకుపోతున్నారు. అలాగే, బ్రహ్మచారులకు ఇళ్ల అద్దెకు ఇవ్వడానికి యజమానులు వెనుకాముందాడుతున్నారు. పెళ్లీడుకువచ్చిన అమ్మాయిలున్న యజమానులైతే ససేమిరా అంటున్నారు. బ్రహ్మచారులకు ఇల్లు అద్దెకు ఇస్తే ఇబ్బందులు ఎదర్కొనవలసి వస్తుందన్న భయంతో వారికి నో చెబుతున్నారు. దీంతో బ్యాచిలర్స్ తమ స్నేహితుల ఇళ్లు, లేదా హాస్టల్ గదుల్లో తలదాచుకుంటున్నారు.

అర్ధంతరంగా ఖాళీ చేయించాడు
కుమారస్వామి, బాలసముద్రం, హనుమకొండ

నా ఆఫీసుకు దగ్గరగా ఉంటుందని అద్దె ఎక్కువైనా చెల్లించి హనుమకొండ బాలసముద్రంలోని ఒక అద్దె ఇంట్లో కుటుంబంతో రెండేళ్లుగా ఉంటున్నాను. అద్దె కూడా సకాలంలో చెల్లిస్తూ వచ్చాను. ఒక రోజు ఇంటి యజమానికి, మా కుటుంబ సభ్యులకు మధ్య చిన్న తగాదా ఏర్పడింది. అంతే.. యజమాని అప్పటికప్పుడు ఇల్లు ఖాళీ చేయించాడు. మరో మంచి ఇల్లు వెతుక్కునే అవకాశం కూడా ఇవ్వలేదు. దీంతో అద్దె ఎక్కువైనా సౌకర్యాలు లేకపోయినా దొరికిన ఇంట్లోనే అద్దెకు దిగాము.

కిరాయికి ఉండేటోళ్లా అని నిర్లక్ష్యంగా చూస్తున్నారు..
రామస్వామి, గోపాల్‌పూర్, హనుమకొండ

హనుమకొండలోని గోపాలపూర్‌లోని ఓ సంపన్నమైన కాలనీలో అద్దెకుంటున్నాము. అద్దె కాస్త ఎక్కువే అయినా సర్దుకుపోతున్నారు. కానీ చుట్టుపక్కల సొంతిళ్ల వారు మమ్మల్ని చిన్నచూపు చూస్తున్నారు. ఎవరైనా మా చుట్టాలు, స్నేహితులు మా ఇంటికి వచ్చే క్రమంలో అడ్రస్ అడిగితే గా కిరాయికి ఉన్నోళ్లా.. అంటూ హేళనగా మాట్లాడుతుండడం బాధ కలిగిస్తోంది. పొరుగువారు సొంతిల్లు ఉన్నదన్న పొగరుతో అద్దెకున్నవారిని చిన్నచూపుచూడడం తగదు.

దళితులమని అద్దెకు ఇల్లివ్వలేదు
శ్రీనివాస్, హనుమకొండ

నేను ఒక ప్రైవేటు సంస్థలో ఉద్యోగిని. బదిలీ కావడం వల్ల హనుమకొండకు వచ్చాను. మా ఆఫీసుకు, పైగా చౌరస్తాకు దగ్గరగా ఉంటుందని భావించి సమీప ప్రాంతంలో అద్దె ఇంటికోసం వెతికాను. ఇళ్ల ఖాళీగానే ఉన్నా దళితులమని చెప్పగానే ఓ ఇంటి యజమాని ఇల్లు అద్దెకు ఇవ్వలేమని సున్నితంగా చెప్పాడు. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఎదుర్కొన్నా. చివరికు నా చిన్ననాటి స్నేహితుడిఇంటిలో అద్దెకు దిగాను.

ఇరుగుపొరుగు వారి చిన్నచూపు

అద్దెకున్నవారంటే ఇంటి యజమానికే కాదు.. ఇరుగు పొరుగువారికి కూడా చిన్నచూపే. వారితో సరిగా మమేకం కావడానికి కూడా ఇష్టపడడం లేదు. సొంతింటి ఇంటి దారులమన్న ఆహంతో అద్దెకు ఉంటున్నవారిని దూరంగా పెట్టడం కనిపిస్తోంది. కాజీపేట బాలాజీనగర్‌లో తమపై సొంతిళ్లవారు వివక్ష చూపిస్తున్నారని కొందరు అద్దెలకు ఉండే వారు ఆరోపిస్తున్నారు. కొందరు సొంతిళ్ల వారు అద్దెలకు ఉండే వారిపై యజమాలకు లేనిపోని మాటలు చెప్పి మరీ ఖాళీ చేయిస్తున్న పరిస్థితి ఉంది. దీనికి ఆ కాలనీకమిటీ కూడా వత్తాసు పలకడం విస్మయం కలిగిస్తోంది. బాల సముద్రంలోని ఓ కాలనీలో రాత్రి పూట తలుపుల శబ్దం వినబడుతోందని, పిల్లలు అరుస్తున్నారనే చిన్న చిన్న విషయాలపై పక్కింటివారు గొడవపడి యజమానికి చెప్పి మరీ ఖాళీ చేయించిన సందర్భాలున్నాయి.

అద్దెకుండే వారిలో ఎవరైనా చనిపోతే..

అద్దె ఇంట్లోని కుటుంబసభ్యుల్లో ఎవరైనా ఆనారోగ్యంతోగానీ, మరే ఇతర కారణాల వల్ల ఆస్పత్రిలో లేదా బయట చనిపోతే ఇంటి యజమానులు మృత దేహాన్ని ఇంటికి తీసుకురానివ్వడం లేదు. దీంతో చేసేది లేక కుటుంబసభ్యులు మృతదేహాన్ని అటునుంచి అటే శ్మశానానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు చేయాల్సి వస్తోంది. ఇంట్లో అద్దెకుంటున్నవారు పది రోజులు బయటనే ఉండి కర్మకాండల తర్వాతే ఇంట్లో అడుపెట్టాల్సి వస్తోంది.

రూ.కోటితో ఉడాయించిన వ్యాపారి?

రెండునెలల్లో భారీగా అప్పులు ● లబోదిబోమంటున్న బాధితులు

కేసముద్రం (మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 6: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం స్టేషన్‌కు చెందిన ఓ వ్యాపారి అప్పులు చేసి సుమారు రూ.కోటితో ఉడాయించినట్లు ప్రచారం జరుగుతోంది. మండల కేంద్రంలోని పాన్‌షాప్‌లలో సిగరెట్లు, పాన్‌మసాలాలు, ఇతర సామగ్రిని హోల్‌సేల్‌గా సరఫరా చేసే ఈ వ్యాపారి కొద్దిరోజుల కిందట తన కుటుంబంతో సహా అదృశ్యమయ్యాడు. స్థానికంగా సొంత ఇల్లు, ట్రాలీ ఆటో ఉండడంతో పాటు నిత్యం వేల రూపాయల హోల్‌సేల్ వ్యాపారం చేస్తుండడంతో అప్పు అడగగానే ఇచ్చారు. ఒక్కొక్కరి వద్ద రూ.లక్షల నుంచి రూ.10లక్షల వరకు అప్పులు తీసుకున్నట్లు సమాచారం. స్థానికంగా చిట్టీలు నిర్వహించే వారి వద్ద రూ.2లక్షల నుంచి రూ.5లక్షల చిట్టీల్లో చేరి మొదటి నెలలోనే అధిక కమీషన్‌తో ఎత్తుకున్నట్లు తెలిసింది. ఆ తర్వాతి రెండు, మూడునెలల వరకు సకాలంలో చిట్టీ డబ్బులు చెల్లిస్తూ అదృశ్యం కావడానికి రెండునెలలకు ముందు అప్పులు, ఎత్తుకున్న చిట్టీలు సుమారు రూ.కోటి వరకు పోగేసినట్లు తెలిసింది. కుటుంబం సహా ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసుకొని ఇక్కడి నుంచి ఉడాయించడం ఓ పథకం ప్రకారమే తక్కువ కాలంలో ఎక్కువ అప్పులు చేసి, చిట్టీలు ఎత్తుకున్నట్లు అనుమానిస్తున్నారు. సొంత ఇల్లుపై బ్యాంకులో రూ.25 లక్షల వరకు రుణం తీసుకోగా, ట్రాలీఆటో ఫైనాన్స్‌లో తీసుకువచ్చిందని తెలుసుకున్న అప్పులిచ్చిన వారు లోలోపల లబోదిబోమంటున్నారు. ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించేందుకు బాధితులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక చిట్టీల వ్యవహారమంతా అనధికారికం కావడంతో ఎవరికి చెప్పుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఇదిలా ఉండగా వ్యాపారంలో నష్టాలు రావడం, ఆన్‌లైన్ గేమ్‌లను ఆడడంతో దివాళా తీసి ఉడాయించినట్లు మరికొందరు భావిస్తున్నా రు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: తెలంగాణ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మురాల శంకర్‌రావు మంగళవారం ఒక ప్రటనలో తెలిపారు. సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తులు చేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి వారికి అందుబాటులో ఉన్న ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల్లో సంప్రదించి ప్రవేశాలు పొందాలని కోరారు. టెన్త్‌కు అడ్మిషన్ ఫీజు ఓసీలకు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1150 చెల్లించాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశాలకు ఓబీసీలకు రూ. 1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.1500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని తెలిపారు. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ శంకర్‌రావు (8008403631, 9396337572)ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఊడిన గూడ్స్‌రైలు బోగీల లింకు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 6 : మహబూబాబాద్-తాళ్లపూసపల్లి రైల్వే స్టేషన్ల నడుమ అప్‌లైన్‌లో 434 మైలురాయి వద్ద వరంగల్‌వైపు వెళ్తున్న గూడ్స్‌రైలు బోగీల మధ్య లింక్ (కప్లింగ్) మంగళవారం ఊడిపోయి గూడ్స్ రైలు నిలిచి పోయింది. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు దానిని సరి చేసి అక్కడి నుంచి పంపించారు. దీంతో గూడ్స్ వెనుకాల వస్తున్న వందేభారత్ రైలును మానుకోట రైల్వేస్టేషన్‌లో సుమారు అరగంట పాటు నిలిపారు. గూడ్స్ రైలు బోగిలను సరి చేసి పంపించాక మానుకోట రైల్వేస్టేషన్ నుంచి వందేభారత్ రైలు కదిలి వెళ్లిపోయింది.

సర్వీసుల క్రమబద్ధీకరణకు హోంగార్డుల వినతి

వరంగల్ క్రైం, ఆగష్టు 6: రాష్ట్రంలోని హోంగార్డుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో డీజీపీ జితేందర్‌ను కలిసి హోంగార్డులు వినతిపత్రం ఇచ్చారు. సీనియారిటీ, విద్యార్హతల ఆధారంగా ఏదైనా యూనిఫామ్ సర్వీసులలో విలీనం చేయాలని కోరారు. ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపీని కలిసిన వారిలో రాష్ట్ర హోంగార్డుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుష్పాల అశోక్, వర్కింగ్ ప్రసిడెంట్ దయానంద్, జాయింట్ సెక్రెటరీ నారాయణరెడ్డి, పీఆర్‌వో రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

వీరభద్రస్వామి దీక్షలో మంత్రి పొన్నం



వీరభద్రస్వామి మాలను ధరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

భీమదేవరపల్లి, ఆగస్టు 6: కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి నక్షత్ర దీక్షను బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం స్వీకరించారు. 27రోజులుగా ఉండే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షను ఆలయ ముఖ్య అర్చకుడు, దీక్షల గురుస్వామి మొగిలి పాలెం రాంబాబు వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రుడి ముద్రికతో ఉన్న మాలను మంత్రి పొన్నం ప్రభాకర్ మెడలో వేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ ఈవో కిషన్‌రావు పాటు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎన్నికలకు ముందు తాను ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వీరభద్రస్వామి నక్షత్ర దీక్షలు తీసుకుంటానని మొక్కుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఎమ్మెల్యేగా గెలిచిన పొన్నం ప్రభాకర్ మంత్రిగా కూడా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో 27రోజుల పాటు దేవాలయంలో నియమ నిబంధనలకు అనుగుణంగా పూజ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్తకొండ వీరభద్రస్వామి చరిత్రను రాష్ట్ర ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ద్వాదశ జ్యోతిలింగాల్లో ఒకటైనా శ్రీశైలం మల్లిఖార్జున స్వామిని సోమవారం దర్శించుకున్నానన్నారు. శ్రీశైలంలో దేవుడి పక్కనే భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి విగ్రహం ఉందన్నారు. ఇంత మహిమ కలిగిన ఈ దేవాలయాల్లో ఉమ్మడి కరీంనగర్, వరంగల్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లోని భక్తులు పెద్దఎత్తున తరలివస్తారన్నారు. ఈ విశ్వాసం భక్తులకు ఆకాంక్షలకు అనుగుణంగా వీరభద్రస్వామి దీక్ష తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, మంజులారెడ్డి, కొత్తకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్లు పిడిశెట్టి కనకయ్య, చంద్రశేఖర్‌గుప్తా, చిట్టంపల్లి అయిలయ్య, మాజీ ఎంపీపీ అశోక్‌ముఖర్జీ, కేతిరి లక్ష్మారెడ్డి, మంగ రామచంద్రం, కొల్గూరి రాజు, ఆదరి రవీందర్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అధికారులకు డీజీపీ ప్రశంసలు



డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న సీఐ శ్రీధర్‌రావు

వరంగల్ క్రైం, ఆగష్టు 6: హత్య కేసుల్లో నింధితులకు జీవిత ఖైదు శిక్ష పడటానికి కృషి చేసిన ఇద్దరు సీఐలతో పాటు గతంలో వరంగల్‌లో పనిచేసిన ఏసీపీ, ఎస్‌ఐలకు డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందచేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసు అధికారుల సమావేశంలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ప్రశంసాపత్రాలు అందించారు. పత్రాలు అందుకున్న వారిలో ప్రస్తుతం సీసీఆర్‌బీలో పనిచేస్తున్న సీఐ శ్రీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి, మామూనూర్ సీఐ రవికుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణరెడ్డి, అడిషినల్ ఎస్పీ బోనాల కిషన్, తొర్రూరు ఎస్‌ఐ జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాసుదేవరెడ్డి ఉన్నారు. కాగా, వీరిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.

జర్నలిజంలో మార్పులు సహజమే..

సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్.వెంకటనారాయణ



డాక్టర్ వెంకటనారాయణకు జ్ఞాపికను బహుకరిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

వడ్డెపల్లి, ఆగస్టు 6: మారుతున్న కాలానికనుగుణంగా జర్నలిజంలో మార్పులు సహజమేనని ఇండియాటుడే పూర్వప్రతినిధి, మల్టీ మీడియా ఇండిపెండెంట్ సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు డాక్టర్ ఎస్. వెంకటనారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జర్నలిస్టులతో చిట్‌చాట్ చేశారు. అనంతరం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ వెంకటనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జర్నలిజంలో వస్తున్న మార్పులకనుగుణంగా డిజిటల్ మీడియా హవా చలాయిస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా భారత్‌తో స్నేహపూర్వకంగా ఉండాల్సిందేనని చెప్పారు. బంగ్లాదేశీయులు లండన్‌లో రెస్టారెంట్లు పెట్టుకున్నారని, అయితే పాకిస్తానీయులైనా, బంగ్లాదేశీయులైనా ఇండియన్ రెస్టారెంట్ పేరుతో నడిస్తారని చెప్పారు. భారతదేశం అంటే ప్రపంచమంతా తెలుసునని, బంగ్లాదేశ్ పేరు చెప్పితే ఎవరికీ తెలియదని అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న అల్లర్లతో ఆ దేశ ప్రధాని షేక్‌హసీనా నేరుగా ఇండియాకు వచ్చారని పేర్కొన్నారు. అయితే ఇక్కడి ప్రధానిని కానీ మరెవరిని కలవలేదని అన్నారు. నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్ మాత్రమే వెళ్లి మాట్లాడారని చెప్పారు. తాను ఏపీ సీఎం చంద్రబాబు జీవిత చరిత్ర రాస్తున్నానని తెలిపారు. ఈ నెల 22 నుంచి రెండు వారాల పాటు ఏపీలోని అమరావతిలో ఉంటానని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ల అమర్, ప్రెస్‌క్లబ్ బాధ్యులు గోకారపు శ్యామ్, విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్, పీవీ మదన్‌మోహన్, వల్లాల వెంకటరమణ, చిలుముల్ల సుధాకర్, వేముల సదానందం, మెండు రవీందర్, అంతడుపుల శ్రీనివాస్, నన్నపునేని భరత్, జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావుతో పాటు యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి



మహబూబాబాద్‌లోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో మొక్కను నాటుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం ప్రత్యేకాధికారి అలుగు వర్షిణి

మహబూబాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించి, ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని 'స్వచ్ఛదనం-పచ్చదనం' జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ వసతి గృహాల సెక్రటరీ అలుగు వర్షిణి అన్నారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట, జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్తపేటలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనంలో గ్రామస్థాయిలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక బృందాలు, వీవోలు, పంచాయతీ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం తీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కను నాటా రు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో తడిచెత్త, పొడిచెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అనే నాటికను ప్రదర్శించగా పిల్లలతో కలిసి వీక్షించారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గ్రామ స్థాయిలో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని, అంతర్గత రోడ్ల అభివృద్ధి, గ్రామంలో స్వచ్ఛత, పచ్చదనం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సందర్శించి పిల్లలతో మాట్లాడారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనంను పక్కాగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ప్రత్యేకాధికారులను నియమించి క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తున్నామని చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మానుకోట ఆర్డీవో అలివేలు, జిల్లా అధికారులు నర్మద, హరిప్రసాద్, తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, దైవాదీనం, చంద్రస్వామి పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు ఎన్నికల గండం

- కార్డుల జారీకి సబ్ కమిటీని ఏర్పాటు చేసిన సర్కార్
- సబ్ కమిటీ నివేదిక తరువాత దరఖాస్తుల పరిశీలన
- త్వరలోనే జారీ చర్యలంటున్న అధికారులు
- పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడితే ప్రక్రియలో జాప్యమేనా?



హనుమకొండ సిటీ, ఆగస్టు 6: కొత్త రేషన్ కార్డుల జారీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కార్డుల జారీ ఉంటుందని ప్రకటించిన వెంటనే కేబినెట్ కూడా ఆమోదం తెలపడంతో పాటు కార్డుల జారీ విధానాల కోసం ప్రభుత్వం ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. దీంతో హనుమకొండ జిల్లాలో రేషన్ కార్డుల జారీకోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనే వారిలో ఆశలు చిగురించాయి. కానీ పంచాయతీ ఎన్నికలు వారిలో గుబులు పుట్టిస్తున్నాయి. రేపో,మాపో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ అనే సంకేతాలు ఉండగా.. అదే జరిగితే ఎన్నికల ప్రక్రియలో యంత్రాంగం తలమునలై కార్డుల జారీలో జాప్యం జరుగుతుందేమో అనే సందేహాలు నెలకొంది. కానీ ప్రభుత్వం సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటుందని లబ్ధిదారులు ఆశిస్తున్నారు.

సబ్ కమిటీ ఏర్పాటు

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉప సంఘం పేదలకు రేషన్ కార్డులజారీకి సంబంధించిన విధి విధానాలను నిర్దేశించనుంది. ఆపై ముఖ్యమంత్రికి నివేదించిన అనంతరం రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆరంభం కానుందని పౌర సరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ కమిటీ కార్డుల జారీ మార్గ దర్శకాలను రూపొందించిన తరువాత ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలను వెల్లడి చేస్తోందని, ఆ తరువాత కార్డుల జారీ ప్రక్రియ జిల్లాలో ఆరంభం అవుతుందని పౌర సరఫరాల శాఖ అధికారులు అంటున్నారు.

తొమ్మిదేళ్లుగా నమోదుతోనే సరి

బీఆర్‌ఎస్ హయాంలో కొత్త రేషన్ కార్డుల జారీకి అర్హులైన పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కొత్త కార్డులతో పాటు అదనంగా కుటుంబ సభ్యుల పేర్ల నమోదు దరఖాస్తులను చేపట్టారు. కానీ ఒక్క కార్డు జారీ కాలేదు. ఇలా తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలన కార్డులను జారీ చేయకుండానే ముగిసింది. రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అధికారం చేపట్టగానే రేషన్‌కార్డుల జారీకి సిద్ధమని ప్రకటించింది. ఇటీవల సబ్‌కమిటీ ఏర్పడడంతో త్వరలో కార్డులు వస్తాయని దరఖాస్తుదారులు ఆశపడుతున్నారు.

జిల్లాలో 5580 దరఖాస్తులు

హనుమకొండ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 5,580దరఖాస్తులు నమోదయ్యాయి. ప్రభుత్వం జిల్లాల వారీగా రేషన్‌కార్డుల దరఖాస్తుల సంఖ్యను కోరిన క్రమంలో జిల్లా యంత్రాంగం ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 5,580 దరఖాస్తుల పరిశీలన ఆరంభమై అర్హుల సంఖ్య నిర్ధారణ కానుంది. అదే విధంగా కుటుంబ సభ్యుల పేర్లు చేర్పుల ప్రక్రియ కూడా ఉండనుంది.

పంచాయతీ ఎన్నికల భయం

కొత్త కార్డుల జారీపై ఒక ఆనందం.. ఆ వెంటే పం చాయతీ ఎన్నికల భయం దరఖాస్తుదారులను వెంటా డుతోంది. రేపో, మాపో పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయనే సంకేతాలు, నోటిఫికేషన్ విడుదల అం శం దరఖాస్తుదారుల్లో సందేహాన్ని కలిగిస్తోంది. ఇదే జరిగితే కార్డుల జారీకి మళ్లీ అవరోధం తప్పని పరిస్థితి. పంచాయతీ ఎన్నికలు, ఆపై జిల్లా పరిషత్ ఎన్నికలు, కోడ్ ముగిసిన తరువాత అంతా సర్దుబాటు చేసే సమయం.. ఇదంతా జరిగే వరకు మరో మూడు నెలల బ్రేక్ తప్పదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



కేయూ పీఎస్‌లో బాలుడితో సీఐ సంజీవ్

కిడ్నాపైన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత

వరంగ్ క్రైం, ఆగష్టు 6: బిస్కెట్లు ఇస్తానని చెప్పి.. బిట్టు అనే ఐదేళ్ల బాలుడిని కిడ్నాప్ చేయగా, గంట సమయంలో బాలుడిని పట్టుకున్న కేయూ పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన మంగళవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్టేషన్ పరిధిలోని పూరిగుట్ట ప్రాంతానికి చెందిన బాలుడు కిడ్నాప్ అయినట్లు సమాచారం అందుకున్న సీఐ సంజీవ్.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వెతుకుతున్న క్రమంలో పోలీసుకాలనీకి చెందిన పంతేగాని కార్నేయస్ (రైల్వే ఉద్యోగి) అనే వ్యక్తి బండిమీద బాలుడిని తీసుకుని వెళుతుండగా అనుమానం వచ్చి పట్టుకున్నారు. విచారణలో బిట్టును కిడ్నాప్ చేసి తీసుకెళుతున్నట్లు నిర్ధారణ అయింది. కాగా, కార్నేయస్‌ను అదుపులోకి తీసుకుని బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడిని కిడ్నాప్ చేసిన నిందితుడు కార్నేయస్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు. కాగా, బిట్టు మహబూబాబాద్ జిల్లా ఉత్తర తండాకు చెందిన బోడ సురేష్ - ప్రియాంక దంపతుల కుమారుడు. పూరిగుట్ట వద్ద అమ్మమ్మ వినోద వద్ద ఉంటున్నాడు.

భారత రాజ్యాంగం అత్యుత్తమమైంది

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అత్యుత్తమమైనదని న్యూఢిల్లీ సీనియర్ జర్నలిస్టు ఎస్.వెంకట్‌నారాయణ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకొని కేయూ జయశంకర్ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ 12వ ఎండోమెంట్ లెక్చర్ కార్యక్రమం జరిగింది. కేయూ సెనెట్ హాల్‌లో జరిగిన లెక్చర్‌లో ప్రధాన వక్తగా పాల్గొన్న వెంకట్‌నారాయణ్ ప్రసంగించారు. మన రాజ్యాంగంలో సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. ప్రసంగానికి ముందు జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ లింగమూర్తి, కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ నవీన్, డాక్టర్ చిర్ర రాజు, పుల్లూరి సుధాకర్, అనితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి




జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మేయర్ సుధారాణి

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు6: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి వేడుకలు హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, డీఆర్‌వో వై.వి. గణేష్ జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- రాంనగర్: 55వ డివిజన్ భీమారంలో జయశంకర్ సార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం భీమారం సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ హాజరయ్యారు. డివిజన్ నేతలతో కలిసి జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అటికం రవిందర్. నేతలు విక్టర్‌బాబు, లక్ష్మణ్, నాయకపు శ్రీనివాస్, రామ్‌రాజ్, త్యాగరాజ్, సాయికుమార్, సరోజన, చంద్రమోహన్, రఘు శ్రీనివాస్‌రెడ్డి, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.
- వరంగల్ ఎడ్యుకేషన్: జయశంకర్ సార్ 99వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కార్యాలయంలో ఏడీ రంగయ్యనాయుడు సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించగా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో డి.వాసంతి జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హై సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. వరంగల్, హనుమకొండ డీఐఈవో కార్యాలయంలో డీఐఈవోలు కె.మాధవరావు, ఎ.గోపాల్ ప్రొఫెసర్ జయశంకర్‌కు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కారక్రమమంలో సిబ్బంది పాల్గొన్నారు.
- వరంగల్ కార్పొరేషన్: తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ అని, ఆయన తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరిచిపోలేరని మేయర్ గుండు సుధారాణి కొనియాడారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో జయశంకర్ 91వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, సిటీ ప్లానర్ ఎం.శైలజ, టీపీఆర్‌వో కోలా రాజేశ్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఏసీపీ ఖలీల్, జేఏవో జగదీశ్వరి, సూపరింటెండెంట్ సంతోష్ పాల్గొన్నారు.
- హనుమకొండ టౌన్: తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నతమైన వ్యక్తి కొత్తపల్లి జయశంకర్ అని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. జయశంకర్ 90వ జయంతిని పురస్కరించుకొని మంగళవారం నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్‌లో ఆయన చిత్రపటానికి సీఎండీ పూలమాల వేసి నివాలర్పించారు. డైరెక్టర్స్, సీజీఎంలు, జీఎంలు, ఇంజనీర్లు పాల్గొన్నారు.
- వరంగల్ క్రైం: తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జయంతిని వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జయశంకర్ చిత్రపటానికి అదనపు పరిపాలనా విభాగం అదనపు డీసీపీ రవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ సురేష్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, డేవిడ్‌రాజ్, ఏఓ రామకృష్ణ పాల్గొన్నారు.
- హనుమకొండ కల్చరల్: ప్రభుత్వ మర్కజీ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలను మంగళవారం విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జీవి.రామారావు, శ్రీనివాస్ మాట్లాడుతూ జయశంకర్‌సార్ మర్కజీ పాఠశాలలో చదువుకున్నప్పుడు ఆనాటి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిజాంకు సలాం చెప్పమని అనగా ఆయన వందేమాతరం అని నినదించి ధైర్యం చాటి చెప్పాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- రాంనగర్: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ జాతిని జాగృతం చేసిన మహనీయుడు జయశంకర్ సార్ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ కొనియాడారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏకశిలా పార్కులో జయశంకర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బి.అశోక్, చెన్నం మధు, రంజాత్‌రావు, నర్సింగ్, నేతలు జనార్ధన్‌గౌడ్, పులి రజనీకాంత్, ఉడతల సారంగపాణి, జోరిక రమేశ్, లక్ష్మీనారాయణ, బాబురావు, మనోజ్, సదాంత్, నయీమ్ రవీందర్‌రావు, రామ్మూర్తి, పరుశరాములు పాల్గొన్నారు.
- బాలసముద్రం: జయశంకర్‌సార్ 90వ జయంతి సందర్భంగా ఏకశిలపార్కులోని జయశంకర్ విగ్రహానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఏర్పాటుకు ఎంతో కృషిచేసినట్లు ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. జయశంకర్‌సార్ పేరును రాష్ట్ర జాతిపితగా ప్రభుత్వం ప్రకటించాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జయశంకర్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జయశంకర్ 90వ జయంతి సందర్భంగా డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రజాయుద్దనౌక గద్దర్ మొదటి వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
- కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మంగళవారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 84వ జయంతి వేడుకలు నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి గబ్బెట శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నార్లగిరి రమేశ్, పాలడుగు శివకుమార్, సుంచు అశోక్, శృంగవరపు బిక్షపతి, తండమల్ల వేణు, కొండ్ర శంకర్, భైరి ప్రభాకర్, ఎస్డీ సర్వర్, ఎంఈ హుస్సేన్, ఇమ్మడి రవితోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.
- ఐనవోలు : ఆచార్య జయశంకర్ సార్ జయంతి వేడుకలను మంగళవారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్యుడి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఆయన సేవలను కొనియాడారు.పెరుమాండ్లగూడెంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో కుమారస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ చందర్‌రావు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడి టీచర్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలి : డీఎన్ఎస్ఎస్

వడ్డెపల్లి, ఆగస్టు 6: దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ, సుప్రీంకోర్టు తీర్పు, కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా కుల గణన బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టి అమలు చేయాలని అన్నారు. కులగణన బిల్లును ప్రస్తుత పార్లమెంటు సమావేశంలో పెట్టలేదని అన్నారు. 1931 నుంచి కుల గణన ఇప్పటి వరకు జరుగలేదని పేర్కొన్నారు. సమావేశంలో డీఎన్ఎస్ఎస్ జిల్లా నాయకులు హన్మకొండ రాజు, ముఖేష్, చరణ్, చినపల్లి బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, ఆగస్టు 6: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఆర్‌ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, చైతన్యపురి కాలనీ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా ప్రయాణికులకు బహుమతుల ప్రదానం

బాలసముద్రం, ఆగస్టు 6: ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళా ప్రయాణికులకు లక్కీ డ్రా ద్వారా బహుమతులను వరంగల్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ డి.విజయభాను మంగళవారం ప్రదానం చేశారు. హనుమకొండ బస్టాండులో వరంగల్-1, 2 డిపోల సంబంధించిన మహిళా ప్రయాణికులకు లక్కీడ్రా నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. ఆర్టీసీని మరింతగా ఆదరించి సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. మూడు డిపోలకు సంబంధించిన తొమ్మిది మంది మహిళా ప్రయాణీకులకు బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె.భానుకిరణ్, వరంగల్-2 డిపో మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ బస్టాండ్ ఏఎంటీఏ స్వామి, నజీయా సుల్తానా, చంద్రశేఖర్, పబ్బాల వెంకటేశ్వర్లు, అలీ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

ధర్మసాగర్, ఆగస్టు 6: ఈ నెల 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రజా కళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజానాట్య మండలి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలో కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. జిల్లా నుంచి కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గట్టమ్మ, సుగుణ, గట్టయ్య, రజిత, రాజయ్య, భూషణం తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌లో మొక్కలు నాటిన ఎస్సై

వేలేరు (ధర్మసాగర్)ఆగస్టు 6: ప్రభుత్వ పిలుపుమేరకు పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా వేలేరు పోలీసుస్టేషన్‌లో ఎస్సై సురేష్ మొక్కలను మంగళవారం నాటారు. పీఎస్‌లోని పరిసరాలను శుభ్రం చేసి ఆయన సిబ్బందితో కలిసి పండ్లను మొక్కలను నాటారు. అనంతరం బదిలీపై వెళుతున్న కానిస్టేబుల్ సునిల్‌ను శాలువతో ఎస్సై, సిబ్బంది సన్మానించి అభినందించారు.

విద్యార్థుల పొట్టకొడుతున్న వర్సిటీ అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: కాకతీయ యూనివర్సిటీ అధికారులు విద్యార్థుల పొట్టకొడుతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి మంద శ్రీకాంత్ ఆరోపించారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాయ్స్ కామన్ మెస్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న భోజన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. ఉదయం 9 గంటలకే టిఫిన్ అయిపోతుందని, రాత్రి 9గంటలకే భోజనం అయిపోతోందని వాపోయారు. హాస్టళ్ల సమస్యలపై మాట్లాడుతున్న విద్యార్థులను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి బెదిరిస్తున్నారని ఆరోపించారు. హాస్టల్ ఫీజులు, మెస్ బిల్లులు అడ్డగోలుగా పెంచి సౌకర్యాలను మరిచిపోయారన్నారు. వర్సిటీకి రెగ్యులర్ వీసీని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్సిటీలోని సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్షుడు పి. సాయికుమార్, సహాయకార్యదర్శి జశ్వంత్, నాయకులు ప్రణయ్, పృథ్విరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని వినాశనానికి వినియోగించొద్దు : జనవిజ్ఞాన వేదిక

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 6: శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని వినాశనానికి వినియోగించవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి హితవు పలికారు. మంగళవారం ఆర్ట్స్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక, ఆర్ట్స్ కళాశాల సంయుక్తంగా హిరోషిమా ప్రపంచశాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అణుబాంబును తయారు చేసిన అమెరికా దాని పూర్తిగా తెలియక రెండో ప్రపంచ యుద్ధంతో హిరోషిమా, నాగసాకిలపై అణుబాంబును వినియోగించి లక్షల మంది ప్రాణాలు బలిగొన్నారన్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజావసరాల కోసం, ప్రపంచ శాంతి కోసం మాత్రమే వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ పురుషోత్తం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్ల రమేష్, జేవీవీ జిల్లా ప్రధానకార్యదర్శి పి. వేణు, శ్రవణ్‌కుమార్, అవయవదాన సంస్థ జిల్లా అధ్యక్షుడు సదయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని అధికారులు

▸▸ 10వ డివిజన్ కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 6: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా జీడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గతితప్పుతోందని 10వ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు ఆరోపించారు. మంగళవారం 10వ డివిజన్ పరిధిలోని మచిలీబజార్, బెస్తవాడ, గుండం ప్రాంతాలను ఆయన సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలను స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ద్వారా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరినా పట్టించుకోకపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా మచిలీబజార్, బెస్తవాడ ప్రాంతాలలో డ్రైనేజీలు పనిచేరు సరిగాలేక మురుగునీరు పెద్దఎత్తున రోడ్లపైకి పారుతూ స్థానికుల ఇళ్లలోకి చేరి తీవ్ర దుర్గంధాన్ని వెదజల్లుతోందని స్థానికులు గగ్గోలు పెడుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. డివిజన్‌లో పేరుకుపోయిన సమస్యలను పలుమార్లు జీడబ్ల్యూఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా అలంకార్ జంక్షన్ నుంచి వేయిస్తంభాల ఆలయం వెనుక నుంచి బస్టాండ్‌కు వెళ్లే రోడ్డుమార్గంలోని మారెమ్మ చెట్టు, హనుమాన్ టెంపుల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఏర్పడ్డ గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాల్సిన కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేస్తున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అధికార పార్టీ కార్పొరేటర్‌గా, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్‌లీడర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న తన మాటను జీడబ్ల్యూఎంసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడమే కాకుండా తన ప్రమేయం లేకుండానే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు.

బొడ్రాయి ఉత్సవాలకు ఎన్నారై ఆర్థిక సాయం

మడికొండ, ఆగస్టు 6: గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌లో బొడ్రాయి, భూ లక్ష్మీ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఈ నెల 7 నుంచి 11వరకు వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా స్థానిక నాయకుడు తక్కళ్ళపల్లి వినయ్ రాంగోపాల్‌రావు తనయుడు ఎన్నారై తక్కళ్ళపల్లి అరవింద్‌రావు మంగళవారం రూ.5,20,111ల చెక్కును తన తండ్రి చేతుల మీదుగా బొడ్రాయి ప్రతి ష్ఠాపన కమిటీ సభ్యులకు అందజేశారు. ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతా వరణంలో జరుపుకోవాలని అరవింద్‌రావు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

మడికొండ పీఎస్‌లో 'స్వచ్ఛదనం-పచ్చదనం'

మడికొండ, ఆగస్టు 6: ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మడికొండ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం స్థానిక ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో స్టేషన్ ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. నేడు మొక్కలు నాటి సంరక్షిచితే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు పర్యావరణ హిత వాతావరణాన్ని అందించిన వారము వుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై దివ్య, ఎఎస్సైలు చంద్రమౌళి, రమేష్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యూటేషన్లపై గందరగోళం


ఐనవోలు, ఆగస్టు 6: ఐనవోలు మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రాజకీయరంగును పులుముకుంటున్నాయి. తమ పాఠశాల ఉపాధ్యాయుడు ఆ పాఠశాలకు ఎలా పంపిస్తారంటూ రాజకీయనాయకులు జోక్యం చేసుకోవడంతో రెండు గ్రామాల మధ్య వివాదం తలెత్తుతోంది. ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల(ఇ.మీ.)లో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 150 మంది విద్యార్థులున్నారు. కానీ స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) విషయ నిపుణులైన ఉపాధ్యాయులు ఒక్కరు లేరు. ప్రైవేటు ఉపాధ్యాయులతోపాటు ఎస్జీటీ ఉపాధ్యాయులే ఉన్నత తరగతులకు బోధిస్తుండటం విశేషం. కాగా, ఇటీవల ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఒంటిమామిడిపల్లి పాఠశాలను సందర్శించినప్పుడు ఎస్ఏ ఉపాధ్యాయులు లేని సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డీఈవోతో మాట్లాడి కొత్త పోస్టులు మంజూరయ్యే వరకు మండలంలోని ఆయా పాఠశాలల్లో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించాలని సూచించారు. దీంతో వెంకటాపురం, ఐనవోలు, పంథిని పాఠశాలల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఒంటిమామిడిపల్లికి డిప్యూటేషన్‌పై వెళ్లాలని డీఈవో ఆదేశాలు జారిచేశారు. అందుకు ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లడానికి ససేమిరా అంటూ ముకుమ్మడిగా ముగ్గురు మెడికల్ లివ్ పెట్టి వెళ్లడం గమనార్హం. అంతేకాదు.. సంఘాల నాయకులు, ఎమ్మెల్సీల ద్వారా డిప్యూటేషన్లను రద్దు చేసుకునేందుకు ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇదే విషయంపై ఇన్‌చార్జి ఎంఈవో వెంకటేశ్వర్‌రావు మంగళవారం ఐనవోలు ఎంఆర్సీకి రాగా, ఐనవోలుకు చెందిన పాఠశాల అభివృద్ధి కమిటీ పేరిట కొందరు నాయకులు ఎంఈవోను కలిసి డిప్యూటేషన్ రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. మా పాఠశాల ఉపాధ్యాయుడిని ఆ పాఠశాలకు ఎలా పంపిస్తారంటూ హంగామా చేశారు.



ఐనవోలు పాఠశాల ఉపాధ్యాయుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఐనవోలు నాయకులు

ఈ విషయంపై ఎంఈవో మాట్లాడుతూ.. మూడు పాఠశాలల్లో అదనంగా ఉన్న ముగ్గురికి డిప్యూటేషన్ వేస్తే మెడికల్ సెలవు పెట్టి వెళ్లారని ఒక ఎస్జీటీ మాత్రమే డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

మడికొండ, ఆగస్టు 6: మడికొండలోని అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా యుద్ధనౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్థానిక మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డి, సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, కార్యదర్శి జవ్వాజి కిషన్, మాజీ ఎంపీపీ అకేశ్వరపు కుమారస్వామి, జిట్ల అనిల్, కట్ట పెంటస్వామి, మూల వీరస్వామి, మూల నవీన్, బండారి మహేందర్, అంకూస్ అప్పి, నెలకంటి వెంకటేష్, చిత్తు భాస్కర్, వీరస్వామి, మూల సారయ్య, శ్రీనివాస్, నాతి సదానందం పాల్గొన్నారు.

- ధర్మసాగర్: ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతి కార్యక్రమాన్ని ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లి గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్బంగ మాజీ సర్పంచ్ మునిగెల రాజు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారు చేసిన సేవాలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కొంరయ్య, ప్రధాన కార్యదర్శి రవి తేజ, వెంకటేశ్వర్లు, కుమార్, శ్రీధర్, రమేష్, యాదగిరి, మల్లయ్య, ఏలియా, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.
- బాలసముద్రం: హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం ఆవరణలో విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గద్దర్ మొదటి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఎస్ఏ అధ్యక్షులు దూడపాక నరేశ్ మాట్లాడుతూ.. గద్దర్ విగ్రహాన్ని కళాక్షేత్రం ఆవరణలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూడపాక సురేశ్, కొత్తూరు జేఏసీ చైర్మన్ తాడిశెట్టి క్రాంతి, రోహణ్, రాగూర్ రామంచ శ్రీను తదితరులు పాల్గొన్నారు.
- వడ్డెపల్లి: ప్రజా యుద్ధ నౌక గద్దర్ ప్రథమ వర్ధంతిని మంగళవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహాల పరిరక్షణ కమిటీ జిల్లా కన్వీనర్ బండి అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సింగారపు రవికుమార్, జాతీయ మాల మహానాడు మహిళా అధ్యక్షురాలు అనిత, ప్రజా సంఘాల నాయకులు పొన్నగంటి లక్ష్మీనారాయణ, కొరివి అనిల్‌కుమార్, డాక్టర్ సురేష్‌కృష్ణ, శేషాద్రి, నాగులు, దండ్రె శ్రీనివాస్, దస్తగిరి, దండురాజు, నూనె రాములు, పోతుల కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు. డీసీసీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ శ్రేణులు వల్లాల జగన్‌గౌడ్, పులి రాజు, కార్తీక్, మహేందర్, అరూరి సాంబయ్య, మధు, రాజు, జాఫర్, ఉదయ్ తదితరులు ఉన్నారు. దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ఆధ్వర్యంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కంజర్ల సమ్మయ్య, జిల్లా నాయకులు హన్మకొండ రాజు, బి. ముఖేష్, చరణ్, చినపెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'పై అనుమానాలు!

5వ పేజీ తరువాయి

బృందాల తనిఖీల్లో అక్రమాలు వెలుగు చూస్తే ఉపాధి పనులకు నిధుల మంజూరులో ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఒత్తిడితోనే..

ఈ ఏడాది ఉపాధి పనులను లక్ష్యానికి అనుగుణంగా చేపట్టాలని సిబ్బందిని పురమాయించడంతో పాటు గతానికంటే భిన్నంగా రోజు వారీ ప్రగతిపై సమీక్షించడం వల్లే కూలీల హాజరు సంఖ్య పెరిగిందని అధికారులు చెబుతున్నారు. కేంద్ర బృందాల తనిఖీల్లో వాస్తవాలు వెలుగు చూడనున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయాల్లో పనులు, కూలీలు, పని దినాలకు సంబంధించిన రికార్డులను తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఈ వేసవిలో కూలీలు ఇతర ప్రాంతాలకు వెళ్లి పనులు వెతుక్కునే అవకాశం లేకుండా స్థానికంగానే ఉపాధి పథకం కింద పనులు చూపిస్తామని అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించడంతో కూలీల సంఖ్య పెరిగింది. ఉపాధి కూలీ రూ.270 నుంచి రూ.300 పెరగడంతో అధిక సంఖ్యలో పనులు చేసేందుకు కూలీలు ముందుకు వస్తున్నారనేది మరో కారణం. క్షేత్ర స్థాయిలో వారానికి ఒక రోజు పనులు పరిశీలించడంతో పాటు, కూలీల హాజరు తక్కువగా ఉన్న చోట పెంచే విధంగా అవగాహన కల్పించారు. వార్షిక ఉపాధి ప్రణాళికలో రూపొందించిన పనుల దినాల్లో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో 70 శాతానికి చేరుకోవాలనే లక్ష్యంతో సిబ్బంది పని చేశారు. దీంతో కూలీల హాజరు శాతం పెరిగిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో కూలీలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో అధికారులు పర్యటనలు చేసి పనులకు రాని వారితో సమావేశాలు నిర్వహించారు. గతంలో ఉపాధి కూలీల వేతనాల కోసం రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం సకాలంలో వేతనాలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో పనులకు వచ్చే వారి సంఖ్య పెరిగిందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.




ఆ ఎస్‌యూవీలు ఆమె 'కృపే'

సృజనాత్మకత, దార్శనికత, రాబోయే మార్పులను ఊహించగలిగే సామర్థ్యం... రామ్‌కృప అనంతన్ వీటన్నిటి సమాహారం. మహీంద్రా థార్, స్కార్పియో, ఎక్స్‌యూవీ 700 లాంటి అనేక ఇండియన్ ఎస్‌యూవీలు ఆమె మేధస్సులోనే రూపుదిద్దుకున్నాయి. ప్రస్తుతం ఈ ఆటోమోటివ్ డిజైనింగ్ దిగ్గజం తన నైపుణ్యంతో ఎలక్ట్రిక్ వాహనాల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

మగవారు ఎంతగానో ఇష్టపడే మహీంద్రా థార్, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, స్కార్పియోలను డిజైన్ చేసింది ఒక మహిళ అనేది చాలామందికి తెలియకపోవచ్చు. వాటన్నిటి వెనుకా ఉన్న వ్యక్తి రామ్‌కృప అనంతన్. సాంకేతికతతో సృజనాత్మక నైపుణ్యాలను జోడిస్తే అద్భుతాలు చెయ్యవచ్చనడానికి ఆమె చక్కటి ఉదాహరణ. "డిజైనింగ్‌ను వృత్తిగా నేను ఎంచుకోవడానికి కారణం నా సోదరుడు. నాకు చిన్న వయసు నుంచే రెండు లక్షణాలున్నాయి. మొదటిది సృజన. నా చేతుల్తో వస్తువులు తయారు చెయ్యడమంటే చాలా ఇష్టం. మరోవైపు ఏ విషయాన్నైనా తార్కికంగా విశ్లేషించడం కూడా అలవాటు. "ఈ రెండు లక్షణాలు ఉన్నవారు డిజైనింగ్‌లో రాణిస్తారు" అంటూ నా సోదరుడు నన్ను ఈ దిశగా ప్రోత్సహించాడు" అని చెబుతారు రామ్‌కృప. అప్పటికే బిట్స్-పిలానీలో మెకానికల్ ఇంజనీరింగ్ చేసిన ఆమె... ఐఐటి ముంబయిలోని డిసిఐ స్కూల్ ఆఫ్ డిజైన్ నుంచి ఇండస్ట్రియల్ డిజైన్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. "కార్ల మీద, వాటి డిజైనింగ్ మీద అప్పుడే నాకు ఆసక్తి బాగా పెరిగింది. 1997లో 'మహీంద్రా అండ్ మహీంద్రా'లో ఇంటీరియర్ డిజైనర్‌గా నా ఉద్యోగ జీవితం మొదలైంది" అని గుర్తు చేసుకున్నారామె.

నిరూపించుకోవడానికి కష్టపడ్డాను...

కార్ల డిజైనింగ్ పూర్తిగా మగవారికే పరిమితమైన ప్రొఫెషన్‌గా భావించేవారు. తొలి రోజుల్లో తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి రామ్‌కృప ఎంతో శ్రమించాల్సి వచ్చింది. కానీ ఆమె ప్రతిభను కంపెనీ గుర్తించింది. బొలేరో, స్కార్పియో, జైలో ఇంటీరియర్ల రూపకల్పనలో... ఆచరణాత్మకతను, సౌందర్యాన్నీ ఆమె మేళవించిన తీరు కంపెనీని ఆకట్టుకుంది. 2005లో మహీంద్రా డిజైన్ డిపార్ట్‌మెంట్ అధిపతిగా ఆమెను నియమించింది. "అరవై మంది టీమ్‌కి సారథ్యం వహించే అవకాశం నాకు వచ్చినప్పుడు... మహిళలకు ఏదైనా చెయ్యగలిగే సామర్థ్యం ఉందనేది చూపించాలనుకున్నాను. ఒక ప్రీమియం ఎస్‌యూవీకి రూపకల్పన చెయ్యడం నా బాధ్యత. 2007లో ఎక్స్‌యువి 500 ప్రాజెక్ట్‌ను 'మహీంద్రా అండ్ మహీంద్రా' చేపట్టింది. దానికి నేను సారథ్యం వహించాను. వివిధ దేశాలకు చెందిన 1500మందితో ఒక సర్వే నిర్వహించాను. "ఎలాంటి ఎస్‌యూవీని మీరు కోరుకుంటున్నారు?" అని వారిని ప్రశ్నించి వివరాలు సేకరించాను. వాటి ప్రకారం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించుకున్నాను. నాలుగేళ్ళపాటు నేను, నా బృందం దాదాపు 500 డిజైన్లను రూపొందించాం. తుది డిజైన్ ఆమోదం పొందడానికి ముందు వరకూ మార్పు చేర్పులు చేస్తూనే ఉన్నాం. 2011లో ఆ కారు విడుదలయింది. ప్రపంచంలోనే ఏకైక మహిళా డిజైన్ చీఫ్‌గా... కారు డిజైన్ చేసి... నన్ను నేను నిరూపించుకున్నాను. ఆ కార్ల డీలర్ షిప్‌ల కోసం బుకింగ్స్ వెల్లువెత్తాయి. ఎక్స్‌యువీ 500 విజయవంతం కావడంతో... టీయూవీ 300, కేయూవీ 100 లాంటి ఆల్ఫాన్యూమరిక్ సిరీస్ కార్లు మరిన్ని డిజైన్ చేశాం" అని వివరించారు రామ్‌కృప. దీంతో 'క్వీన్ ఆఫ్ ఇండియన్ ఆటో డిజైనింగ్'గా ఆమె పేరు ఆటోమోటివ్ పరిశ్రమలో మార్మోగింది. 2019లో చీఫ్ డిజైనర్ స్థాయికి ఎదిగారు. ఆమె నాయకత్వంలో థార్, ఎక్స్‌యూవీ 700 లాంటి మోడల్స్ రూపొందాయి. స్కార్పియోను కూడా ఆమె పునరావిష్కరించారు.



ఒంటరిగా మొదలై...

"రాబోయే కాలం ఎలక్ట్రిక్ వాహనాలదే" అని నిశ్చయంగా చెబుతున్న రామ్‌కృప ఆ దిశగా తన దృష్టిని మళ్ళించారు. 2022లో 'మహీంద్రా అండ్ మహీంద్రా' నుంచి బయటకు వచ్చి, 'క్రక్స్ స్టూడియో' పేరిట సొంత కంపెనీ ఏర్పాటు చేశారు. అలాగే 'ఓలా ఎలక్ట్రిక్'లో హెడ్ ఆఫ్ డిజైన్‌గానూ వ్యవహరిస్తున్నారు. ఆ కంపెనీ విడుదల చేస్తున్న ద్విచక్ర వాహనాలతోపాటు భవిష్యత్తులో రాబోయే ఫోర్ వీలర్ శ్రేణి డిజైనింగ్‌కు నాయకత్వం వహిస్తున్నారు. "నేను ఎప్పుడూ ఉత్సాహవంతులైన యువతతో పని చెయ్యాలని కోరుకుంటాను. పని వాతావరణం ప్రోత్సాహకరంగా ఉండేలా చూసుకుంటాను. అందరి సలహాలు తీసుకుంటాను. మహిళా ఆటో డిజైనర్‌గా నా ప్రయాణం ఒంటరిగా మొదలైంది. పదేళ్లలో.... దాదాపు అయిదుగురు మహిళా డిజైనర్లను నా టీమ్‌లో చేర్చుకున్నాను. వారిలో ప్రతిఒక్కరూ తమదైన విభాగంలో ప్రత్యేక నైపుణ్యం కలిగినవారే" అంటారు రామ్‌కృప. "డిజైన్ల విషయంలో నాకు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. డిజైన్లు కస్టమర్ అవసరాలకు అనువుగా ఉన్నాయా? కూర్చొనేవారికి సౌకర్యంగా ఉంటోందా? వాటి పని తీరు ఎలా ఉంటుంది? ముఖ్యంగా డ్రైవింగ్ ఎంత సురక్షితంగా ఉంటుంది?... ఈ అంశాలను నేను ఎక్కువగా పరిగణనలోకి తీసుకుంటాను" అని చెబుతున్న రామ్‌కృప ఖాళీ సమయాల్లో ట్రెక్కింగ్, ట్రావెలింగ్ చేస్తారు. తన బజాజ్ అవేంజర్ మీద మనాలీ నుంచి శ్రీనగర్‌కు పర్యటించారు. రోజూ వ్యాయామం చేస్తారు. వర్కవుట్స్ సమయంలోనూ, ప్రయాణాలు చేసేటప్పుడూ ఆడియో బుక్స్ వింటారు. రాబోయే మార్పులను ముందుగా గుర్తించి, వాటికి తనను తాను సంసిద్ధం చేసుకోవడమే డిజైనర్‌గా ఆమె విజయరహస్యం అంటారు ఆటోమేటివ్ రంగ నిపుణులు, ఆమె సన్నిహితులు.

ఒలిం'పిక్స్'



ముద్దు.. ముచ్చట!

పారిస్ ఒలింపిక్స్‌లో ఆటలతో పాటు మరో 'చిత్రం' కూడా ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. విశ్వక్రీడల ప్రారంభోత్సవంలో ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మానుయల్ మాక్రాన్, ఆ దేశపు క్రీడల మంత్రి అమేలీ ఔడియా కాస్టెరాల ముద్దు ఫొటో ఫ్రాన్స్‌లోనే కాదు... ప్రపంచమంతా 'హాట్ టాపిక్' అయింది. లక్షల్లో కామెంట్స్... కోట్లల్లో వ్యూస్... అంతకుమించిన షేర్స్‌తో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది ఈ ఫొటో. పాశ్చాత్య సంస్కృతిలో హగ్.. కిస్... వింతేమీ కాదు. అలాంటప్పుడు వారి ముద్దు ముచ్చటపై ఎందుకంత చర్చ? ఎందుకంటే... ఆ చిత్రంలో కనిపించిన గాఢతే అంటున్నారు నెటిజనులు. మాక్రాన్‌ను హత్తుకుని, ఒక చేత్తో మెడను చుట్టేసి, మరో చేయిని ఆయన చేతిలో వేసి, అమేలీ ముద్దు పెట్టిన తీరు అభ్యంతరకరంగా ఉందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. ఆ సమయంలో పక్కనే ఉన్న ఫ్రెంచ్ ప్రధాని గాబ్రియల్ అట్టాల్ తన చూపును పక్కకు తిప్పుకున్నారు. 'మర్యాదపూర్వకమైన పెక్ హద్దులు దాటింది' అని సొంత దేశస్థులే విమర్శలు కురిపిస్తున్నారు.

వాగ్దానం నిలబెట్టుకోవాలని...

ఫ్రెంచ్ పారిశ్రామికవేత్త అయిన 46 ఏళ్ల అమేలీ ఒకప్పుడు ప్రొఫెషనల్ టెన్నిస్ క్రీడాకారిణి కూడా. క్రీడలు, ఒలింపిక్, పారాఒలింపిక్ గేమ్స్ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. గతంలో మాక్రాన్ ఆమెకు క్రీడలతో పాటు విద్యా శాఖ బాధ్యతలు కూడా అప్పగించారు. అయితే టీచర్లు లేరన్న కారణంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న తన కూతుర్ని తీసుకువెళ్లి ప్రైవేటు విద్యా సంస్థలో చేర్పడంతో దుమారం రేగింది. దాంతో విద్యా శాఖా మంత్రిగా అమేలీని బాధ్యతల నుంచి తప్పించాల్సి వచ్చింది. ఇదిలావుంటే ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి వేదిక అయిన సీన్ నది కాలుష్యమయమైందని, అందులో ఇ-కొలీ ప్రమాదకర స్థాయికి చేరిందని ప్రపంచ మీడియా వరుస కథనాలు రాసింది. ఇది వేదిక సురక్షితమైనది కాదని పేర్కొంది. 'ఆ కథనాల్లో వాస్తవం లేదని నిరూపించడానికి గేమ్స్‌కు ముందు ఆ నదిలో ఈత కొడతా'నని అమేలీ నాడు ఉద్ఘాటించారు. చెప్పినట్టుగానే ఒలింపిక్స్ ప్రారంభానికి కొద్ది రోజుల ముందు ఆమె సీన్ నదిలో మునిగి చూపించారు. 'మేము మా వాగ్దానాన్ని నిలబెట్టుకున్నాం' అంటూ బలమైన సందేశం పంపించారు.

ఫ్యాషన్

నిండుగా కనిపించడం కోసం చీర కట్టడం ఓల్డ్ ఫ్యాషన్ అనుకుంటే, బదులుగా లాంగ్ గౌన్స్ ఎంచుకోవచ్చు. రకరకాల మెటీరియల్స్‌లో, వేర్వేరు డిజైన్లలో దొరికే లాంగ్ గౌన్స్ అటు సంప్రదాయ వేడుకలకూ, ఇటు ఆధునిక ఫంక్షన్లకూ సూటవుతాయి. ప్రస్తుతం మార్కెట్లో దుమ్ము రేపుతున్న లేటెస్ట్ లాంగ్ గౌన్స్ మీద ఓ లుక్కేద్దాం!



లవ్లీ లాంగ్ గౌన్స్

భిన్నమైన మోడల్స్‌లో...

జార్జెట్, షిఫాన్, కాటన్, లెనిన్... ఇలా వేర్వేరు మెటీరియల్స్‌తో తయారయ్యే లాంగ్ గౌన్స్‌ను సందర్భానికి తగ్గట్టు ఎంచుకోవచ్చు. శాటిన్, కాటన్, సింథటిక్.. ఇలా వేర్వేరు లైనింగ్స్‌తో ఆకట్టుకునే డిజైన్లతో దొరికే లాంగ్ గౌన్స్‌లో మన ఒడ్డూ, పొడవుకు నప్పే గౌన్స్ ఎంచుకోవాలి. బక్కపలుచగా ఉండే అమ్మాయిలకు కాటన్ లాంగ్ గౌన్స్ బాగుంటే, ముద్దుగా బొద్దుగా ఉండే అమ్మాయిలకు జార్జెట్, షిఫాన్ లాంగ్ గౌన్స్ బాగుంటాయి. అలాగే బోల్డ్ లుక్ కావాలనుకునేవాళ్లు స్లీవ్‌లెస్, ఫ్రిల్స్ ఉన్న గౌన్ ఎంచుకోవచ్చు. ఫ్యాషనబుల్‌గా కనిపించాలనుకుంటే, సెక్విన్స్, మోటిఫ్స్, డోరీస్ ఉన్న లాంగ్ గౌన్ ఎంచుకోవచ్చు.



సందర్భానుసారంగా...

ఓవర్ కోట్, కాలర్స్, కార్డిగాన్ మోడల్ లాంగ్ గౌన్స్ రెట్టింపు ఆధునికంగా ఉంటాయి. టాప్, బాటమ్‌లా వేర్వేరు దుస్తులను కలిపి అతికించినట్టుండే లాంగ్ గౌన్స్ కూడా బాగుంటాయి. జరీ అంచు నారాయణ్ పేట చీరలనే లాంగ్ గౌన్స్‌గా కుట్టించే ఫ్యాషన్ కూడా చలామణీ అవుతోంది. ఇవి పెళ్లిళ్ల లాంటి వేడుకలకు ఎంతో బాగుంటాయి. అలాగే మెడ బోసిగా ఉందని అనిపిస్తే లాంగ్ గౌన్స్‌కు జోడీగా చున్నీలను కూడా వేసుకోవచ్చు. ఆధునికంగా కనిపించే లాంగ్ గౌన్స్‌కు విక్టోరియన్ జ్యువెలరీ, సంప్రదాయంగా కనిపించే లాంగ్ గౌన్స్‌కు గోల్డ్ జ్యువెలరీ బాగుంటాయి.




బిజినెస్

ఎల్ఐసీలో మరో 5% వాటా విక్రయం?

ఎఫ్‌పీఓ లేదా క్యూఐపీ ద్వారా విక్రయించే చాన్స్

ఎంపీఎస్ నిబంధనలు పూర్తి చేసేందుకే..



న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ) ఈక్విటీలో మరో 5 శాతం వాటా అమ్మకానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఫాలో ఆన్ ఆఫర్ (ఎఫ్‌పీఓ) లేదా క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషన్ ప్లేస్‌మెంట్ (క్యూఐపీ) ద్వారా ఈ వాటాను విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ఈ వాటా విక్రయం ఉంటుందని తెలుస్తోంది. ఇది కూడా భారత ఐపీఓ చరిత్రలో మరో బాహుబలి ఇష్యూ అవుతుందని మార్కెట్ వర్గాల అంచనా. మినిమమ్ పబ్లిక్ షేర్‌హోల్డింగ్ (ఎంపీఎస్) నిబంధనలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఈ వాటా విక్రయం తలపెట్టినట్టు సమాచారం. 2027 మే 16లోగా ఎల్ఐసీ ఈక్విటీలో కనీసం 10 శాతం ఎంపీఎస్ పూర్తి చేసేందుకు సెబీ ఈ ఏడాది మే 14న అనుమతి ఇచ్చింది. ఈ నిబంధన పూర్తి చేసేందుకు ఎల్ఐసీ ఈక్విటీలో మరో ఐదు శాతం వాటా విక్రయించాలని ప్రభుత్వం భావిస్తోంది.

మదుపరులకు చేదు అనుభవం

2022 మే నెలలో ఎల్ఐసీ ఈక్విటీలో 3.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా విక్రయించింది. ఈ బాహుబలి ఐపీఓ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.21,000 కోట్లు చేరాయి. అయితే ఈ భారీ ఐపీఓ మదుపరులకు లిస్టింగ్ రోజే చేదు అనుభవం మిగిల్చింది. ఒక్కో షేరును రూ.949 చొప్పున జారీ చేయగా, లిస్టింగ్ రోజే రూ.902కు పడిపోయింది. గత 52 వారాల్లో ఒక దశలో రూ.597.65 కనిష్ఠ స్థాయిని తాకింది. ఈ ఏడాది జనవరి 17న మాత్రమే ఎల్ఐసీ షేరు ఐపీఓ జారీ ధరను క్రాస్ చేసింది. మంగళవారం ఎల్ఐసీ షేరు 2.49% నష్టపోయి రూ.1,079.20 వద్ద క్లోజైంది. దీంతో మరో విడత జారీ చేసే ఎఫ్‌పీఓ మదుపరులను ఎంతగా ఆకర్షిస్తుందో వేచి చూడాల్సిందే.



రియల్టీ లాభాల పన్నుపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

స్థిరాస్తి యజమానులకే ఎంచుకునే చాన్స్

న్యూఢిల్లీ: స్థిరాస్తుల (రియల్టీ) అమ్మకంపై వచ్చే లాభాలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ)పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇండెక్సేషన్ ప్రయోజనంతో కూడిన పాత విధానం ఎంచుకోవాలా? లేక ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం ఎంచుకోవాలా? అనే విషయాన్ని స్థిరాస్తుల యజమానులకే వదిలి వేసింది. ఈ విధానంలో పన్ను భారం తక్కువగా ఉంటే, ఆ విధానాన్ని స్థిరాస్తుల యజమానులు ఎంచుకోవచ్చని తెలిపింది. పాత విధానం ఎంచుకుంటే, గత నెల 23వ తేదీకి ముందు అమ్మిన స్థిరాస్తుల దీర్ఘకాలిక లాభాలపై ఇండెక్సేషన్ ప్రయోజనంతో 20 శాతం ఎల్‌టీసీజీటీ చెల్లించాలి. అదే బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఇండెక్సేషన్ ప్రయోజనం లేని కొత్త విధానం ఎంచుకుంటే 12.5 శాతం ఎల్‌టీసీజీటీ చెల్లిస్తే సరిపోతుంది. కొత్త విధానంలో ఎల్‌టీసీజీటీ పైకి తక్కువగా కనిపిస్తున్నా, ఇండెక్సేషన్ ప్రయోజనం తీసివేయడం అధిక పన్ను భారానికి దారితీస్తుందని స్థిరాస్తుల యజమానుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఏ విధానంలో తక్కువ ఎల్‌టీసీజీటీ భారం ఉంటే, స్థిరాస్తుల అమ్మకందారులు ఆ విధానాన్ని ఎంచుకోవచ్చని అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దీనికి సంబంధించి బుధవారం పార్లమెంట్‌లో ఒక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు.

ఎన్‌సీసీ లాభం రూ.210 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఎన్‌సీసీ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను కంపెనీ రూ.5,558.33 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.209.92 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,406.72 కోట్లుగా ఉండగా లాభం రూ.173.54 కోట్లుగా ఉంది. జూన్ త్రైమాసికంలో కొత్తగా రూ.408 కోట్ల ఆర్డర్లను చేజిక్కించుకోవటంతో కంపెనీ ఆర్డర్ బుక్ రూ.52,626 కోట్లకు చేరుకుంది.

- భారత్‌లో ఈ నెల 7 నుంచి నథింగ్ ఫోన్ (2ఏ) ప్లస్ స్మార్ట్‌ఫోన్స్ అందుబాటులోకి రానున్నాయని లండన్‌కు చెందిన టెక్ బ్రాండ్ నథింగ్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా ఉన్న రిటైల్ పార్ట్‌నర్స్‌తో పాటు ఫ్లిప్‌కార్ట్, క్రోమా, విజయ్ సేల్స్‌లో బుధవారం నుంచి ఈ ఫోన్ విక్రయాలు ప్రారంభమవుతాయని తెలిపింది. 8జీబీ రామ్, 256 జీబీ మెమరీ, 12 జీబీ రామ్ 256 జీబీ మెమరీతో అందుబాటులో ఉండనున్న ఈ ఫోన్ ధరలు వరుసగా రూ.25,999, రూ.27,999గా ఉన్నాయి.
- అమెజాన్ ఇండియా గ్రేట్ ఫ్రీడమ్ ఫెస్టివల్‌ను ప్రారంభించింది. ఈ నె 11 వరకు అందుబాటులో ఉండనున్న ఈ ఫెస్టివల్‌లో స్మార్ట్‌వాచీలు, హెడ్‌ఫోన్స్, ఎలక్ట్రానిక్స్‌పై 75 శాతం వరకు, టాప్ బ్రాండ్స్‌కు చెందిన టెలివిజన్ శ్రేణిపై 65 శాతం వరకు, అమెజాన్ ఫ్యాషన్, బ్యూటీ ఉత్పత్తులపై 80 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నట్లు ప్రకటించింది.
- డిజిటల్ సర్వీసుల సంస్థ బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్ లిమిటెడ్.. జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.75.4 కోట్ల రెవెన్యూపై రూ.12.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.5.6 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 127 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో 3.5 కోట్లకు పైగా లావాదేవీలను కంపెనీ చేపట్టింది. ఈ స్థూల లావాదేవీల విలువ రూ.20,000 కోట్లుగా ఉంది.

ఎస్‌బీఐ కొత్త చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

మూడేళ్ల కాలానికి నియమించిన కేంద్రం



న్యూఢిల్లీ:భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కొత్త చైర్మన్‌గా తెలంగాణ వ్యక్తి చల్లా శ్రీనివాసులు శెట్టిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్ల వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. ప్రస్తుతం శెట్టి ఎస్‌బీఐ ఎండీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28తో పదవీ కాలం ముగియనున్న ప్రస్తుత చైర్మన్ దినేశ్ ఖారా స్థానాన్ని శెట్టి భర్తీ చేస్తారు. శ్రీనివాసులు శెట్టిని ఎస్‌బీఐ చైర్మన్‌గా నియమించాలన్న ఆర్థిక సేవల డిపార్ట్‌మెంట్ ప్రతిపాదనను అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆఫ్ ది కేబినెట్ ఆమోదించింది. అలాగే, రాణా అశుతోష్ కుమార్ సింగ్‌ను బ్యాంక్ కొత్త ఎండీగా నియమించింది. ప్రస్తుతం సింగ్ బ్యాంక్ డిప్యూటీ ఎండీగా ఉన్నారు. దేశంలో అతిపెద్ద బ్యాంకైన ఎస్‌బీఐలో చైర్మన్‌తో పాటు నలుగురు ఎండీలు ఉంటారు.

బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ టెక్నాలజీ

అభివృద్ధి చేసిన డీఆర్‌డీఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) సరికొత్త బయోడీగ్రేడబుల్ ప్యాకేజింగ్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. పీబీఏటీ అనే బయోడీగ్రేడబుల్ పాలిమర్ సాయంతో డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డాక్టర్ కే వీరబ్రహ్మం నాయకత్వంలోని బృందం ఈ సరికొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. పెట్రోలియం ఉత్పత్తులు లేదా వృక్ష ఆధారిత నూనెల నుంచి ఈ పాలిమర్‌ను సేకరిస్తారు. ఈ పాలిమర్ ద్వారా తయారు చేసే బ్యాగులు మూడు నెలల్లో భూమిలో కుళ్లిపోతాయని వీరబ్రహ్మం చెప్పారు. దీనివల్ల పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదన్నారు. డీఆర్‌డీఓ ఈ టెక్నాలజీని ఇప్పటికే నలభైకి పైగా కంపెనీలకు బదిలీ చేసింది.

3 రోజుల్లో రూ.22 లక్షల కోట్లు ఆవిరి

భారీ లాభాల నుంచి స్వల్ప నష్టాల్లోకి సూచీలు.. సెన్సెక్స్ 166 పాయింట్లు డౌన్

24,000 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా మూడో రోజూ నష్టపోయాయి. క్రితం సెషన్‌లో 2,222 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్.. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో మంగళవారం మోస్తరు లాభాలతో ట్రేడింగ్‌ను ఆరంభించి ఒక దశలో 1,092 పాయింట్ల వరకు ఎగబాకింది. కానీ, భారీ లాభాలను ఎంతో సేపు నిలబెట్టుకోలేకపోయింది. ఆఖరి గంటలో బ్యాంకింగ్, టెలికాం రంగ షేర్లలో అమ్మకాలు ఊపందుకోవడంతో చివరికి సూచీ 166.33 పాయింట్ల నష్టంతో 78,593.07 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 327 పాయింట్ల వరకు పుంజుకున్నప్పటికీ.. క్రమంగా తగ్గుతూ వచ్చి నష్టాల్లోకి మళ్లించి. చివరికి 63.05 పాయింట్ల నష్టంతో 23,992.55 వద్ద స్థిరపడింది. దాంతో సూచీ 24,000 కీలక స్థాయిని చేజార్చుకుంది.

మధ్యాహ్నం ప్రారంభమైన యూరప్ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం, అమెరికా ఆర్థిక మాంద్యం భయాలు కొనసాగడం, ఆర్‌బీఐ పరపతి సమీక్షకు ముందు మదుపర్ల అప్రమత్తత ఇందుకు కారణమయ్యాయి. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 3,274.48 పాయింట్లు (3.99 శాతం) క్షీణించింది. ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఈ మూడ్రోజుల్లో రూ.22.03 లక్షల కోట్లు తగ్గి రూ.439.60 లక్షల కోట్లకు (5.24 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి.



అకుమ్స్ డ్రగ్స్ షేరు 17% అప్

గతవారంలో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ను ముగించుకున్న అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్.. మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.679తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 6.77 శాతం ప్రీమియంతో రూ.725 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో మరింత పుంజుకుంది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 17.44 శాతం లాభంతో రూ.797.45 వద్ద స్థిరపడింది.

పసిడి పడింది..

బులియన్ ధరలు భారీగా తగ్గాయి. మంగళవారం ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,100 తగ్గి రూ.71,700కు దిగివచ్చింది. ఆభరణ వర్తకులు, రిటైల్ కొనుగోలుదారుల నుంచి గిరాకీ తగ్గడం ఇందుకు కారణమైంది. కిలో వెండి కూడా రూ.2,200 తగ్గుదలతో రూ.82,000కు పరిమితమైంది. వెండి ధరలు తగ్గడం వరుసగా ఇది నాలుగో రోజు. ఈ 4 రోజుల్లో కిలో వెండి రూ.4,200 తగ్గిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్ మార్కెట్లో తులం మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.670 తగ్గి రూ.69,710కి జారుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గి రూ.87,500కు దిగివచ్చింది. రూపాయి మరింత బలహీనపడటంతో పాటు పండుగలు, పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడం దేశీయంగా బులియన్ ధరలకు మద్దతివ్వవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ అన్నారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,710 ▼	63,900 ▼	87,500 ▼
ముంబై	69,182 ▲	63,371 ▲	79,158 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	430
వరంగల్	422	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	75	విజయవాడ	85
వరంగల్	75	గుంటూరు	85
కరీంనగర్	75	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	75	చిత్తూరు	87
కర్నూలు	75	నెల్లూరు	87
విశాఖపట్నం	81	అనంతపురం	85
గోదావరి	85		

సూరత్ వజ్రాల పరిశ్రమకు మాంద్యం భయాలు

50,000 మంది ఉద్యోగులకు సెలవులు

సూరత్: గుజరాత్, సూరత్‌లోని డైమండ్ పాలిషింగ్ కంపెనీలను ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడుతున్నాయి. కొన్ని సంస్థలపై ఇప్పటికే ఈ ప్రభావం కనిపిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ నుంచి సానపెట్టిన వజ్రాలకు డిమాండ్ పడిపోయింది. దీంతో కంపెనీల వద్ద పెద్ద మొత్తంలో సానపట్టిన వజ్రాల నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు కంపెనీలు ముందు జాగ్రత్త పడుతున్నాయి. ఇందులో భాగంగా ఉద్యోగులకు తాత్కాలికంగా సెలవులు ప్రకటిస్తున్నాయి. ప్రపంచంలోనే అతి పెద్ద నేచురల్ డైమండ్స్ కంపెనీగా పేరొందిన కిరణ్ జెమ్స్ అనే కంపెనీ ఇప్పటికే 50,000 మంది ఉద్యోగులకు ఈ నెల 17 నుంచి 27 వరకు సెలవు ప్రకటించింది.

తప్పడం లేదు: మాంద్యం కారణంగానే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కంపెనీ చైర్మన్ వల్లభ్ బాయ్ లఖానీ చెప్పారు. ప్రస్తుతం ముడి వజ్రాల సరఫరా కూడా తగినంతగా లేదని తెలిపారు. ఈ సెలవుల కాలానికి కూడా ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తామన్నారు. సానపట్టిన వజ్రాల తయారీని హేతుబద్ధం చేసేందుకు ఈ నిర్ణయం ఉపకరిస్తుందన్నారు. మిగతా కంపెనీలు కూడా త్వరలోనే ఇదే బాట పడతాయని భావిస్తున్నారు. సూరత్‌లోని దాదాపు 4,000 వరకు ఉన్న చిన్న, పెద్ద డైమండ్ పాలిష్ యూనిట్లలో దాదాపు 10 లక్షల మంది పని చేస్తున్నారు. ఆర్థిక మాంద్యం ముదిరితే వీరిలో ఎక్కువ మంది రోడ్డున పడే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/ రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్టుగా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/BCRzyHuలో చదవండి.

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.



- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 13
చిరునామా: రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034 **వెబ్‌సైట్:** angrau.ac.in

దిక్సూచి DIKSUCHI

SCHOLARSHIP ALERT

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.
- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.
Last Date to Apply: 10-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal

Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 20-08-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/RMKSP4

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

బరువెక్కిన హృదయంతో...

గతంలో కుదుర్చుకున్న పలు చిత్రాల ఒప్పందం కారణంగా బిగ్‌బాస్ నుంచి స్వల్ప విరామం తీసుకుంటున్నట్టు అగ్రనటుడు కమల్ హాసన్ ప్రకటించారు. ఈ విషయాన్ని ఆయన మంగళవారం తన ఎక్స్ ఖాతాలో అధికారికంగా వెల్లడించారు. 'ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభమైన ప్రయాణం నుంచి ఒక చిన్న విరామం తీసుకుంటున్నాననే విషయాన్ని బరువెక్కిన హృదయంతో ప్రకటిస్తున్నాను. బిగ్ బాస్ కారణంగానే మీ ఇళ్లకు వచ్చి మిమ్మల్ని కలుసుకునే భాగ్యం నాకు లభించింది. మీరు అందించిన ఉద్వేగపూరిత, ఉత్సాహభరిత మద్దతు, ఆదరణ కారణంగా బిగ్‌బాస్ తమిళ సీజన్ దేశంలోనే ఉత్తమ టెలివిజన్ రియాలిటీ షోలలో ఒకటిగా మారింది. ఒక ప్రెజెంటర్‌గా నేను వ్యక్తిగతంగా నేర్చుకున్న అనేక విషయాలను నిజాయితీగా మీతో పంచుకున్నాను' అని కమల్ హాసన్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.



ఆంధ్రజ్యోతి (చెన్నై)

'దేవర' నటుడికి అరుదైన వ్యాధి



మలయాళ నటుడు షైన్ టామ్‌చాకో.. 'దసరా', 'రంగబలి' వంటి సినిమాలలో ప్రతినాయక పాత్రలతో తెలుగులోనూ పాపులర్ అయ్యారు. ఇప్పుడు ఆయన ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'లోనూ విలన్‌గా కనిపించనున్నారు. ఇటీవల జరిగిన ఓ మీడియా సమావేశంలో.. తనకు అటెన్షన్ డెఫిసిటీ హైపర్ యాక్టివిటీ డిజార్డర్ (ఏ.డీ.హెచ్.డీ) ఉందని తెలిపారు. ఈ వ్యాధి ఉండే వారు ఇతరుల కంటే ప్రత్యేకంగా కనిపించడానికి ప్రయత్నిస్తారని.. అయితే ఇందుకు తానేం బాధపడట్లేదని.. దీన్నే పాజిటివ్ క్వాలిటీగా భావిస్తా అని చెప్పారు.

క్రేజీ ప్రాజెక్ట్‌కు 9న శ్రీకారం



జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం ఈ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. 'కేజీఎఫ్' చిత్రంతో దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించే ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించనుంది. ఈ సినిమా గురించి నిర్మాతల్లో ఒకరైన రవిశంకర్ యలమంచి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'శుక్రవారం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా సినిమాను ప్రారంభిస్తున్నాం. రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్‌లో మొదలవుతుంది. ఎన్టీఆర్ అక్టోబర్ నుంచి షూటింగ్‌లో పాల్గొంటారు. ఈ లోపు ఆయన లేని సన్నివేశాలను చిత్రీకరిస్తాం. హీరోయిన్ ఎవరన్నది ఇంకా ఎంపిక చేయలేదు' అని చెప్పారు. ప్రస్తుతం తను నటిస్తున్న 'వార్ 2' చిత్రం షూటింగ్‌ను ఈలోగా పూర్తి చేసి, ప్రశాంత్ నీల్ చిత్రం మీద పూర్తిగా దృష్టి పెట్టనున్నారు ఎన్టీఆర్. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచి నిర్మించనున్నారు. పూర్తి వివరాలను చిత్ర ప్రారంభోత్సవం రోజున వెల్లడిస్తారు.

ఇండస్ట్రీ ఏ ఒక్క ఫ్యామిలీ సొత్తు కాదు



'వీళ్లు తప్ప మరేవరూ ఉండరు' అంటూ మెగా ఫ్యామిలీపై చేస్తున్న విమర్శలపై నటుడు నాగబాబు స్పందించారు. సోమవారం 'కమిటీ కుర్రోళ్లు' సినిమా ప్రీ రిలీజ్ వేడుకకు విచ్చేసిన ఆయన మాట్లాడుతూ "సినిమా ఇండస్ట్రీలో ఎటు చూసినా మెగా ఫ్యామిలీదే ఆధిపత్యం.. కొందరి ఎదుగుదలను ఆ ఫ్యామిలీ అడ్డుకుంటోందని అని ఎంతో మంది సార్లు అనడం విన్నాను. అలా అనడం ముమ్మాటికీ తప్పు. మాకు అలాంటి ఫీలింగ్ లేదు. ఇండస్ట్రీ మా తాత సొత్తు కాదు.. మా నాన్న సామ్రాజ్యం కాదు. అలాగే నందమూరి ఫ్యామిలీది కాదు, అక్కినేని కుటుంబానిది కాదు. ఇండస్ట్రీ అందరికీ చెందినది. సినిమా కుటుంబ నేపథ్యం ఏమీ లేకపోయినా అడవి శేష్ వంటి హీరోలు తమ టాలెంట్‌తోనే పైకి వచ్చారు. వారికి ఎవరూ అడ్డం పడలేదుగా. ఇప్పుడు 'కమిటీ కుర్రాళ్లు' చిత్రంలో నటిస్తున్న వాళ్లు ఏ రేంజ్‌కి వెళతారో ఎవరన్నా ఊహించగలరా! ఈ రోజు సినిమాలే కాదు.. ఆర్టిస్టుల కోసం ఎన్నో ఓటీటీ వేదికలు ఉన్నాయి. మంచి కంటెంట్ ఉన్న సినిమాకి ట్రై చేయండి. రెగ్యులర్ సినిమాల్లో రొటీన్ క్యారెక్టర్స్ కోసం ప్రయత్నించకండి" అని చెప్పారు.

సినిమా చెట్టును తిరిగి బతికిస్తాం!



సినిమా చెట్టును శాస్త్రీయ పద్ధతిలో తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు తూర్పుగోదావరి జిల్లా డీఎఫ్‌వో బి.నాగరాజు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న సినిమా చెట్టు సోమవారం తెల్లవారుజామున పడిపోయిన సంగతి తెలిసిందే. ఈ చెట్టు కూలిపోయిందనే విషయం తెలుగు రాష్ట్రాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో రోజంతా ఇదే విషయం హాట్ టాపిక్‌గా మారింది. కాగా అమరావతి నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం డీఎఫ్‌వో బి.నాగరాజు, డీఆర్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో ఎం.కార్తీక్ ఈ సినిమా చెట్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో నాగరాజు మాట్లాడుతూ పడిపోయిన చెట్టును సైంటిఫిక్‌గా తిరిగి బతికించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆంధ్రజ్యోతి (కొవ్వూరు)

వామ్మో.. రూ.పది కోట్లా?

దక్షిణాదిలో కొంత కాలం పాటు అగ్ర నటిగా కొనసాగిన సమంత.. స్టార్ హీరోలకి ఏ మాత్రం తగ్గని రేంజ్‌లో పారితోషికం అందుకున్న సందర్భాలు ఉన్నాయి. అయితే లేటెస్ట్‌గా అందిన సమాచారం మేరకు.. ఆమె తీసుకునే పారితోషికం రూ.పది కోట్లకు చేరిందట. అదీ సినిమాకు కాదండోయ్. 'హనీ బన్నీ' అనే స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్‌కు. 'సిటాడెల్' అనే ఆంగ్ల వెబ్ సిరీస్‌కు భారతీయ వెర్షన్‌గా తెరకెక్కిన ఈ వెబ్ సిరీస్ కోసం రూ.పది కోట్ల రికార్డు పారితోషికం సమంత అందుకున్నారట. వరుణ్‌ధావన్‌తో కలసి నటించిన ఈ సిరీస్ నవంబర్ 7 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవ్వనుంది. ఇంతకు ముందు కూడా ఓ ప్రాజెక్ట్ కోసం ఒక బాలీవుడ్ ప్రొడ్యూసర్ భారీ మొత్తం సమంతకు ఆఫర్ చేయగా.. ఆమె తిరస్కరించారని టాక్. ఆ ప్రొడ్యూసర్ సమంతకు భారీ పారితోషికంతో పాటు లాభాల్లో 25 శాతం వాటా కూడా ఆఫర్ చేశారట. సమంత ఆ చిత్రాన్ని అంగీకరించి ఉంటే అది ప్రస్తుతం ఆమె ఈ సిరీస్ కోసం తీసుకున్న రూ.పది కోట్ల కంటే ఎక్కువే అయ్యేది.



డజనుకు పైగా చిత్రాలు.. ఒకే రోజు!



ఒకే రోజు మూడు నాలుగు సినిమాలు విడుదల కావడం సర్వసాధారణమే. సంక్రాంతికో.. దసరాకో.. ఇలా ఆరు లేదా ఏడు సినిమాలు ఒకే రోజు విడుదలైన సందర్భాలు ఉన్నాయి. వీటిల్లో చాలా వరకూ భారీ బడ్జెట్ చిత్రాలే ఉంటాయి. మీడియం బడ్జెట్‌లో తయారైన చిత్రాలు కూడా ఒక రోజున ఐదారు విడుదలైన సందర్భాలు లేకపోలేదు. అయితే వచ్చే గురువారం (ఆగస్టు 15) నాడు ఒకటి కాదు రెండు కాదు .. దాదాపు డజనుకు పైగా దక్షిణాది చిత్రాలు వెండితెర పై సందడి చేయనున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు లాంగ్ వీకెండ్ కూడా కలసి వస్తుండడమే ఈ సందడికి కారణం. ఆ సినిమాల వివరాల్లోకి వెళితే...

మాస్ మసాలా సినిమాలకు పెట్టింది పేరు రవితేజ. ఆయన నటించిన లేటెస్ట్ చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో థియేటర్లలో జోష్ తీసుకురావడానికి దర్శకనిర్మాతలు సిద్ధంగా ఉన్నారు. ఇందులో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. సినిమాలో ఆయన ఇన్‌కమ్ టాక్స్ అధికారి పాత్రను పోషించారు. . యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. గతంలో రవితేజతో 'షాక్', 'మిరపకాయ్' వంటి చిత్రాలు తెరకెక్కించిన హరీశ్ శంకర్ దీనికి దర్శకుడు. ఇప్పటికే రిలీజైన టీజర్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచేశాయి. ఈ సినిమాలో రవితేజ వింటేజ్ లుక్, నూతన నటి భాగ్యశ్రీ బోర్సే అందాలు సినిమాకు ప్లస్ అవుతాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.





బంగారు గనుల నేపథ్యంలో...

'శివ పుత్రుడు', 'అపరిచితుడు' వంటి చిత్రాలతో తెలుగులోనూ పాపులర్ అయిన నటుడు విక్రమ్. ఆయన లేటెస్ట్‌గా నటించిన పీరియాడికల్ డ్రామా చిత్రం 'తంగలాన్'. 'మద్రాస్', 'కాలా' చిత్రాల ఫేమ్ పా.రంజిత్ దీనికి దర్శకత్వం వహించారు. 19వ శతాబ్దంలో కర్ణాటకలోని కోలార్ బంగారు గనుల కార్మికుల జీవితాల నేపథ్యంలో జరిగే కథగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఈ సినిమాలో విక్రమ్‌తో పాటు పాత్రధారులందరూ విభిన్నమైన లుక్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా అయినా విక్రమ్ విజయాల కొరతను తీరుస్తుందని ఆయన అభిమానులు ఆశిస్తున్నారు. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్.. సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేశాయి.

డబుల్ ఎంటర్టైన్‌మెంట్



'ఇస్మార్ట్ శంకర్'తో 2019లో సూపర్ హిట్ కొట్టారు డైరెక్టర్ పూరి జగన్నాథ్, హీరో రామ్ పోతినేని. వారి కలయికలో ఈ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'పై భారీ అంచనాలు ఉన్నాయి. వరుస ఫ్లాపుల్లో ఉన్న పూరీ జగన్నాథ్, రామ్ పోతినేనికి ఈ చిత్ర విజయం చాలా కీలకం కానుంది. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్, సాంగ్స్ సినిమాపై అంచనాలను పెంచేసేలా చేశాయి. యాక్షన్ సన్నివేశాలకు థియేటర్స్‌లో పూనకాలు గ్యారంటీ అని చిత్ర బృందం ధీమాగా ఉంది. పూరి మార్క్ డైలాగ్స్‌ను తెలంగాణ యాసలో రామ్ పలికిన తీరు.. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటిస్తుండడం, మణిశర్మ సంగీతం సినిమాకు ప్రధానాకర్షణగా ఉండనున్నాయి.

'ఆయ్' అంటూ సందడి

గోదావరి యాస నేపథ్యంలో.. ఇప్పటికే ఎన్నో చిత్రాలు వచ్చాయి. ఆ కోవలోకి చెందిన చిత్రమే 'ఆయ్'. 'మేం ఫ్రెండ్సండి' ట్యాగ్‌లైన్. ఫుల్ లెంగ్త్ వినోదం గ్యారంటీ అంటూ ప్రచార చిత్రాలతోనే అందరి దృష్టిని ఆకర్షించిన ఈ సినిమాను అంజి కంచిపల్లి తెరకెక్కించారు. నార్నే నితిన్, నయన్ సారిక ఇందులో హీరో హీరోహీరోయిన్లుగా నటించారు. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రం నుంచి విడుదలైన టీజర్, ట్రైలర్, సాంగ్స్‌తో సినిమాకు పాజిటివ్ బజ్ వచ్చింది.

అదే రోజున ఈ చిత్రాలు కూడా...

నటనా ప్రాధాన్యం ఉన్న పాత్రలకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే కీర్తి సురేశ్.. కయల్విజి అనే పాత్రలో, హిందీ రాని తమిళమ్మాయిగా.. నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'.. 'ఎవడే సుబ్రమణ్యం', 'కల్యాణ వైభోగమే' ఫేమ్ మాళవిక నాయర్ నటించిన 'క్రిష్ణమ్ ప్రణయ సఖీ' అనే కన్నడ సినిమా.. హిందీ చిత్రం 'అంధాధూన్' రీమేక్‌గా తమిళంలో తెరకెక్కిన 'అంధగాన్'.. 'డిమోంటీ కాలనీ' అంటూ తెలుగు వారిని భయపెట్టిన తమిళ హారర్ చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న 'డిమోంటీ కాలనీ 2'.. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించిన థ్రిల్లర్ 'భైరతి రణగల్'.. భావన నటించిన 'హంట్' అనే మలయాళ హారర్ థ్రిల్లర్.. 'దృశ్యం' సినిమా సిరీస్‌తో నేషనల్‌వైడ్ గుర్తింపు పొందిన జీతూ జోసెఫ్ తెరకెక్కించిన కామెడీ ఎంటర్టైనర్ 'నునకూజి'.. 'వాజా' అనే మలయాళ కామెడీ చిత్రం కూడా అదే రోజు బాక్సాఫీస్ వద్ద ఇతర సినిమాలతో పోటీ పడుతున్నాయి. ఈ సినిమాల్లో ఏవి ప్రేక్షకుల ఆదరాభిమానాలు దక్కించుకుంటాయో ఈ నెల 15 వరకు వేచి చూడాల్సిందే.



పెద్ద విజయం కోసం... చిన్న కథ

వినోదాత్మక చిత్రాలతో ఓ వైపు అలరిస్తూనే.. ప్రయోగాత్మక చిత్రాలు, వైవిధ్యమైన పాత్రలకు ఎప్పుడూ ముందుండే నటుడు ప్రియదర్శి ఆయన చాణక్య వర్మ అనే పాత్రతో స్కూల్ టీచర్‌గా నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. సెలక్టివ్‌గా సినిమాలు చేసే నివేదా థామస్ ఇందులో ఓ మధ్య తరగతి ఇల్లాలి పాత్రను పోషించారు. విశ్వదేవ్, భాగ్యరాజ్ కీలక పాత్రల్లో నటించారు. నంద కిశోర్ ఈమని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఇంటిల్లిపాదినీ అలరించే వినోదంతో పాటు గుండెని బరువెక్కించే భావోద్వేగాలూ ఉన్నాయని టీజర్ ద్వారా తెలుస్తోంది.



సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా'



యువ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ నటించే కొత్త చిత్రం 'తెలుసు కదా' రెగ్యులర్ షూటింగ్ మంగళవారం ప్రారంభమైంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలు, పాటలు చిత్రీకరిస్తామని నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ చెప్పారు. తొలి రోజు షూటింగ్‌లో రాశీ ఖన్నా కూడా పాల్గొన్నారు. శ్రీనిధి శెట్టి మరో కథానాయిక. వైవా హర్ష ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ సంగీతాన్ని, జ్ఞానశేఖర్ బాబా ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.

ప్రేమికులు రిలేట్ అయ్యేలా...



విజయ్‌శంకర్, విషిక జంటగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. మంగళవారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఇదనీ, ప్రేమలో ఉన్న ప్రతి లవర్ రిలేట్ చేసుకొనేలా సినిమా ఉంటుందని విజయ్‌శంకర్ చెప్పారు. తను పోషించిన పాత్ర చూశాక అమ్మాయిలు తమ బాయ్‌ఫ్రెండ్స్‌ని ఇబ్బంది పెట్టరని హీరోయిన్ విషిక చెప్పారు.

యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్



సాగర్, శ్రుతి శంకర్ జంటగా నటించిన 'కాలం రాసిన కథలు' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకుని ఈ నెల 29న విడుదలకు సిద్ధమైంది. యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. యం. యన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు.

కొత్తగా..

పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్ సేన్



విభిన్న పాత్రలతో అలరిస్తున్న విశ్వక్ సేన్ ఇప్పుడు పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. 'దసరా' తో భారీ బ్లాక్ బస్టర్‌ను అందించిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్ర నిర్మాత. శ్రీధర్ గంటా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఎవ్రీ యాక్షన్ హైర్స్ ఏ రియాక్షన్' అనేది సినిమా ట్యాగ్‌లైన్. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇదనీ, విశ్వక్ సేన్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తారని దర్శక నిర్మాతలు చెప్పారు. విశ్వక్ సేన్‌కు ఇది 13వ సినిమా.

అలరించే కుర్రోళ్లు



అంతా కొత్త వారితో నిర్మించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఈ నెల 9న విడుదల కానుంది. యదు వంశీ దర్శకుడు. తెలుగు రాష్ట్రాల్లో వంశీ నందిపాటి విడుదల చేస్తున్నారు. సోమవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో వరుణ్ తేజ్, సాయిదుర్గ తేజ్, అడవి శేష్, నాగబాబు, వెంకీ అట్లూరి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చిత్ర సమర్పకురాలు నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'పదిహేను మంది కొత్త ఆర్టిస్టులను పరిశ్రమకు అందిస్తున్నాను..అనే తృప్తి నాకు ఉంది. చిత్ర దర్శకుడు వంశీ పేరు ఇకపై ఎక్కువగా వినిపిస్తుంది' అని చెప్పారు. చిత్రం పెద్ద హిట్ కావాలని అతిథులు కోరారు.

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)

ఆనందం వెల్లివిరిసింది.. ఉడుంపట్టు పట్టిన రెజ్లర్ వినేశ్ ఫొగాట్.. అంచనాలను తారుమారు చేస్తూ ఏకంగా స్వర్ణ పోరుకు దూసుకెళ్లింది. ఏడాది కిపైగా వివాదాలు.. విమర్శలు.. అనుమానాలు.. అవమానాలకు ఎదురు నిలిచిన వినేశ్.. పోటీల ఆరంభం లోనే అద్భుతం చేసింది. తొలి రౌండ్ లోనే నమ్మశక్యం కాని రీతితో.. ప్రపంచ మేటి రెజ్లర్ సుసాకికి తొలి ఓటమి రుచి చూపించిన ఫొగాట్.. ఒక్కసారిగా ఫేవరెట్‌గా మారిపోయింది. అలవోకగా సెమీస్ చేరి.. స్వర్ణ చరిత్రకు అడుగు దూరంలో నిలిచింది. నైరాశ్యం ఆవహించిన భారత అభిమానుల్లో.. జోష్ నింపింది.

వినేశ్ వండర్

పసిడి పోరుకు ఫొగాట్



సెమీస్‌లో విజయానందంలో ఫొగాట్

ఫైనల్ చేరిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర

నేడే ఫైనల్ (రాత్రి11.20)

● ఓటమి ఎరుగని సుసాకికి షాక్ ● కనీసం రజతం ఖాయం

పారిస్: ఏం గెలుస్తుందిలే.. అని తేలిగ్గా తీసుకొన్న రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పెను సంచలనం సృష్టించింది. ఓటమి ఎరుగని డిఫెండింగ్ చాంప్ యుయి సుసాకికి ఓటమి రుచిచూపింది. క్వార్టర్స్‌లో ఓక్సానా లివాచ్ (ఉక్రెయిన్)పై నెగ్గిన ఫొగాట్.. సెమీస్‌లో యుస్నేలిస్ గుజ్‌మన్ (క్యూబా)ను ఓడించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ క్రమంలో దేశానికి రజత పతకాన్ని ఖాయం చేసిన వినేశ్.. పసిడి పోరుకు చేరుకొన్న తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. బుధవారం రాత్రి జరిగే ఫైనల్లో అమెరికా రెజ్లర్ సారా హిల్డ్‌బ్రాంట్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సాధారణంగా తాను తలపడే 53 కిలోల విభాగంలో మరొకరికి బెర్త్ ఖరారు కావడంతో.. తక్కువ వెయిట్ కేటగిరీలో బరిలోకి దిగడానికి తన బరువు తగ్గించుకొంది. ట్రయల్స్‌లో ఎలాగోలా అవకాశం దక్కించుకొన్న ఫొగాట్.. ఒక్క ఉడుంపట్టుతో యావత్ దేశం దృష్టినీ తనవైపునకు తిప్పుకొంది.

ఆడలేదు.. వేటాడింది..

50 కిలోల విభాగంలో తొలి రౌండ్‌లో ఫొగాట్ ప్రత్యర్థి జపాన్ టాప్ రెజ్లర్ సుసాకి అని డ్రా ఖరారు కావడంతో అందరూ ఆశలు వదిలేసుకొన్నారు. ఎందుకంటే అంతర్జాతీయ కెరీర్‌లో ఆడిన 82 మ్యాచ్‌లో సుసాకి ఒక్క బౌట్ కూడా ఓడలేదు. పైగా టోక్యోలో గోల్డ్‌తోపాటు నాలుగుసార్లు వరల్డ్ చాంపియన్ కావడంతో ఫొగాట్ పని ఇక అంతే అని పెదవి విరిచారు. కానీ, బలమైన ప్రత్యర్థిని వ్యూహాత్మకంగా ఎలా దెబ్బకొట్టాలో ముందుగానే సిద్ధమైన వినేశ్.. మ్యాట్‌పై దాన్ని ఆచరణలో పెట్టి అద్భుతం చేసింది. మంగళవారం జరిగిన రౌండ్-16లో ఫొగాట్ 3-2 సుసాకిపై చిరస్మరణీయ విజయంతో క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. బౌట్‌లో 90 సెకన్లు ఇద్దరు రెజ్లర్లు ఒకరిని ఒకరు అంచనా వేసుకోవడానికే కేటాయించారు. వినేష్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో తొలి పాయింట్ కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఫొగాట్, సుసాకి అదను కోసం వేచి చూసే ధోరణినే అవలంబించారు. ఈక్రమంలో మరో పాయింట్ కోల్పోయిన ఫొగాట్ 0-2తో వెనుకబడింది. కానీ, పటిష్ఠమైన డిఫెన్స్‌తో సుసాకి పాయింట్లు ఇవ్వకుండా ఎంతో చతురతతో వ్యవహరించింది. ఈ క్రమంలో పోటీ ముగియడానికి మరో 15 సెకన్ల సమయం ఉందనగా.. అప్పటి వరకు దూరదూరంగా ఉంటూ ప్రత్యర్థిని మభ్యపెట్టిన వినేశ్.. ఒక్కసారిగా సుసాకిపై ఎదురుదాడి చేసింది. పట్టుకోల్పోయిన జపాన్ రెజ్లర్‌ను మ్యాట్‌పై పడేసి రెండు పాయింట్లు స్కోరు చేసింది. హఠాత్ పరిణామంతో సుసాకి నివ్వెరపోయి చూస్తుండగా.. ఫొగాట్ సంబరాల్లో మునిగింది. జపాన్ రెజ్లర్ చాలెంజ్ చేసినా.. ఆమెకు నిరాశే ఎదురైంది. ఇక, క్వార్టర్స్‌లో ఓక్సానాపై వినేశ్ 7-5తో గెలిచింది. తొలుత ఫొగాట్ 4-0తో ఆధిక్యం సాధించింది. కానీ, పోరాడిన ఓక్సానా.. వినేశ్‌ను తన పట్టులో బిగిస్తూ 4 పాయింట్లు స్కోరు చేసింది. చివరి 48 సెకన్లలో ఓక్సానాను టేక్‌డౌన్ చేసిన ఫొగాట్ బౌట్‌ను ముగించింది.



ప్రీ క్వార్టర్స్‌లో..



క్వార్టర్స్‌లో..

అంతా ఏకపక్షంగా..

వరుసగా రెండు బౌట్‌లు నెగ్గి ఆత్మవిశ్వాసంతో ఉన్న ఫొగాట్.. సెమీస్‌లోనూ అదే జోరు చూపింది. ఏకపక్షంగా సాగిన పోరులో వినేష్ 5-0తో యుస్నేలిస్ గుజ్‌మన్ లోపెజ్ (క్యూబా)ను చిత్తు చేసింది. ఇద్దరు ఆరంభంలో ఆచితూచి ఆడారు. అయితే, లోపెజ్ రక్షణాత్మకంగా వ్యవహరించడంతో.. ఫొగాట్‌కు తొలి టెక్నికల్ పాయింట్ లభించింది. తర్వాత మరింత దూకుడుగా వ్యవహరించిన వినేష్ 4 పాయింట్లతో బౌట్‌ను సొంతం చేసుకొంది. రియో, టోక్యో క్రీడల్లో క్వార్టర్స్‌లోనే వెనుదిరిగిన ఫొగాట్ ఈసారి ఏకంగా ఫైనల్‌కు చేరుకోవడం విశేషం

సివంగి..

'ఆమె.. మన సివంగి. డిఫెండింగ్ చాంప్‌ను ఓడించిన వినేశ్. వెంటనే మరో మాజీ వరల్డ్ చాంపియన్‌పై గెలవడం అద్భుతం. ఆమె ప్రపంచాన్ని జయించబోతోంది'
- బజ్‌రంగ్ పూనియా.

ఏడాది క్రితం సరిగ్గా రోడ్డు పైనే నిద్రించింది.. మానసికంగా ఎంతో వేదనకు గురైంది.. ప్రాక్టీస్‌ను కోల్పోయింది.. మోకాలి గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంది... కొన్నాళ్లు ఆటకు దూరమైంది.. అసలు ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుందా అన్న సంశయాన్ని దాటుకొని పారిస్ క్రీడలకు ఎంపికైంది.. ఇన్ని సవాళ్లు, ప్రతికూలతల మధ్యే పోటీపడింది. గెలవాలన్న కసితో, సంకల్ప బలంతో ముందుకు సాగింది.. రౌండ్ రౌండ్‌కు ప్రత్యర్థులను ఉడుం పట్టుతో హడలెత్తిస్తూ ఏకంగా స్వర్ణపోరులో నిలిచింది. ఇలా.. తానెదుర్కొన్న విమర్శలు, అవమానాలన్నింటికీ ఆటతోనే బదులిచ్చిన పోరాట యోధురాలు వినేశ్ ఫొగాట్.

నాడు న్యాయం కోసం నేడు దేశం కోసం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఏడాది క్రితం మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలతో బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌కు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమంలో వినేశ్ కీలకపాత్ర పోషించింది. రోజుల తరబడి సహచర రెజ్లర్లతో కలిసి ధర్నాలో పాల్గొంది. ఆపై అరెస్టయింది. పోలీసుల దాష్టీకాన్ని చవిచూసింది. ప్రభుత్వంలో ఉన్న పెద్దలు ఏమాత్రం కనికరించలేదు. బ్రిజ్‌భూషణ్‌ను తిరిగి రెజ్లింగ్ సమాఖ్యలోకి రానివ్వకుండా చేసేందుకు ఆమె అన్ని ప్రయత్నాలు చేసింది. ఈ క్రమంలో తాను సాధించిన ఖేల్ రత్న లాంటి ప్రతిష్ఠాత్మక అవార్డులను సైతం వెనక్కిచ్చేసింది. ఆన్‌లైన్‌లో ఆఫ్‌లైన్‌లో వేధింపులు ఎదుర్కొంది. అయినా వెనక్కి తగ్గలేదు. చివరకు అనుకున్నది సాధించింది. బ్రిజ్‌భూషణ్ తిరిగి సమాఖ్య ఎన్నికలకు దూరమవడంతో మళ్లీ ఆటపై దృష్టి పెట్టింది. ఈ సమయంలోనే మోకాలి గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంది. ఏడాదిపాటు ఆటకు దూరమైంది. అయినా వెరవలేదు. శిక్షణలో రాటుదేలింది. ఈ సమయంలోనే తాను పోటీపడాల్సిన 53 కిలోల విభాగంలో అంతిమ్ ఫంగల్ ఒలింపిక్స్ కోటా గెలిచింది. దీంతో తన బరువు విభాగాన్ని 50 కిలోలకు మార్చుకుంది. అందులో జాతీయ సెలెక్షన్స్‌లో నెగ్గి ఆసియా ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో పోటీపడింది. అదే జోష్‌లో వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌కు ఎంపికై ఈ ఘనత సాధించిన తొలి భారత మహిళా రెజ్లర్‌గా చరిత్ర సృష్టించింది. 50 కిలోల విభాగంలో భారీ అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ప్రీ క్వార్టర్స్ బౌట్‌లో వరల్డ్ నెంబర్‌వన్, టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత సుసాకి రూపంలో ఎదురైన సవాల్‌ను సమర్థవంతంగా అధిగమించింది. ఆ తర్వాత క్వార్టర్స్‌లో ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానాను చిత్తుచేసి సెమీస్‌కు చేరడంతో వినేశ్ ఆనందానికి హద్దుల్లేవు. ఇక సెమీస్‌లో క్యూబా అమ్మాయి గుజ్‌మాన్‌ను చిత్తుచేసి భారత రెజ్లింగ్ చరిత్రలో తన ప్రస్థానాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది.నాడు కన్నీళ్లు పెట్టుకున్న ఆ వనితే.. ఇప్పుడు విశ్వవేదికపై యోధురాలిలా పోరాడి దేశానికి గర్వకారణమైంది.



పోరాడినా.. ప్చ్

హాకీ సెమీస్‌లో జర్మనీ చేతిలో భారత్ ఓటమి

స్పెయిన్‌తో కాంస్య పతక పోరు రేపు



పారిస్: నాలుగు దశాబ్దాల తర్వాత భారత హాకీ జట్టు ఒలింపిక్ ఫైనల్‌కు చేరుతుందని ఆశపడిన అభిమానులకు నిరాశే మిగిలింది. మంగళవారం వరల్డ్ నెంబర్ 2 జర్మనీతో అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన సెమీస్‌లో భారత్ 2-3తో పరాజయం పాలైంది. భారత హాకీ జట్టు ఆఖరి సెకను వరకు స్కోరును సమం చేసేందుకు పోరాడినా ఫలితం దక్కలేదు. పలుమార్లు పెనాల్టీ కార్నర్ అవకాశాలు లభించినా సద్వినియోగం చేసుకోకపోవడం దెబ్బతీసింది. ఇక భారత జట్టు కాంస్య పతకం కోసం స్పెయిన్‌తో.. స్వర్ణం కోసం జర్మనీ జట్టు టీమ్ నెదర్లాండ్స్‌ను ఢీకొంటుంది. భారత్ నుంచి కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ ఏడో నిమిషంలోనే గోల్ సాధించగా, రెండో గోల్‌ను 36వ నిమిషంలో సుఖ్‌జీత్ సింగ్ అందించాడు. జర్మనీ తరఫున గోంజలో పిల్లట్ (18), క్రిస్టోఫర్ రుర్ (27), మార్కో మిల్ట్‌కా (54) గోల్స్ సాధించారు.

ఆరంభంలోనే ఆధిక్యం దక్కినా..: తొలి క్వార్టర్‌లో భారత్ ఆధిపత్యం సాగింది. అయితే ఈ సమయంలో ఆరు పెనాల్టీ కార్నర్లు లభించినప్పటికీ జట్టు ఒక్కటి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. పీసీ ద్వారా ఏడో నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ జట్టుకు తొలి గోల్ అందించాడు. కానీ రెండో క్వార్టర్‌లో జర్మనీ ఎదురుదాడికి భారత తడబడింది. మిడ్‌ఫీల్డ్‌లో వీరిదే హవా సాగడంతో భారత్ గోల్‌పోస్టుపై దాడులు ఎక్కువయ్యాయి. చివరకు జర్మనీ కూడా పీసీ ద్వారానే 18వ నిమిషంలో స్కోరును సమం చేసింది. అలాగే 27వ నిమిషంలో జర్మనీకి పెనాల్టీ స్ట్రోక్ లభించడంతో 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో క్వార్టర్ ఆరంభంలో భారత్‌కు స్కోరును సమం చేసే అవకాశం వచ్చినా ప్రత్యర్థి కీపర్ వమ్ము చేశాడు. కాసేపటికే మరో పీసీతో గోల్ చేసిన భారత్ 2-2తో స్కోరును సమం చేసి ఉత్కంఠ పెంచింది. 47వ నిమిషంలో జర్మనీ గోల్ అవకాశాన్ని కీపర్ శ్రీజేష్, వివేక్ సమర్థంగా అడ్డుకున్నారు. అయితే పదే పదే దాడులు జరిపిన జర్మనీ చివరకు 54వ నిమిషంలో చేసిన ఫీల్డ్ గోల్‌తో భారత్ షాక్‌కు గురైంది. చివరి నిమిషాల్లో కీపర్ శ్రీజేష్ స్థానంలో మరో ప్లేయర్‌ను గ్రౌండ్‌లోకి పంపినా ఫలితం దక్కలేదు. అలాగే ఆఖర్లో జర్మనీ పీసీని కీపర్ లేకుండానే భారత్ నిలువరించింది. ఇక ఆఖరి సెకన్లలో రెండు అవకాశాలు వచ్చినా ఒకటి వైడ్‌గా, మరొకటి పోస్ట్ పైనుంచి వెళ్లడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

నడవలేని స్థితిలో కాంబ్లీ



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ క్రికెటర్, సచిన్ టెండూల్కర్ చిన్ననాటి స్నేహితుడు వినోద్ కాంబ్లీ ప్రస్తుతం తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్టు తెలుస్తోంది. అందుకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. ఏదో పనిమీద బయటకొచ్చిన 52 ఏళ్ల కాంబ్లీ.. ఓ షాప్ ముందు పూర్తిగా నడవలేని స్థితిలో బైక్‌ను ఆసరాగా పట్టుకొని నిలబడినట్టు ఆ వీడియోలో ఉంది. కింద పడిపోతున్న అతడిని స్థానికులు కొందరు పక్కకు తీసుకొచ్చి కూర్చోబెట్టారు. అయితే, ఈ వీడియో ఎప్పుడు తీసిందన్నదానిపై స్పష్టత లేదు. కాగా, ఆర్థికంగానూ అంతంత మాత్రంగానే ఉన్నాననీ, బీసీసీఐ ఇచ్చే పెన్షన్‌తోనే జీవితాన్ని నెట్టుకొస్తున్నట్టు కాంబ్లీ గతంలో ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

వచ్చాడు.. వచ్చేశాడు. ఎవరు ఏ పతకం గెలిచినా.. గెలవకపోయినా స్వర్ణం ఖాయమన్న అంచనాలున్న ఏకైక భారత అథ్లెట్ నీరజ్ చోప్రా. ఇసుమంతైనా ఆ నమ్మకాన్ని తగ్గించకుండా క్వాలిఫయింగ్‌లో ఈ స్టార్ జావెలిన్ త్రోయర్ తొలి ప్రయత్నంలోనే వావ్.. అనిపించాడు. మిగతా ప్లేయర్లు కిందా మీదా పడుతుంటే, ఊపిరి బిగపట్టి విసిరిన త్రోకు అతడి జావెలిన్.. రాకెట్ వేగంతో అలా.. అలా దూసుకెళ్లి 89.34మీ. దూరం వెళ్లి పడింది. తద్వారా నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించి అభిమానులను ఆనందడోలికల్లో ముంచాడు. గుర్తుందా.. టోక్యో గేమ్స్‌లో అతడు 87.58మీ. దూరంతోనే గోల్డ్ కొట్టేశాడు. మరో భారత అథ్లెట్ కిశోర్ జెనా మాత్రం నిరాశపర్చాడు.

ఒకే ఒక్క త్రో...

జావెలిన్‌త్రోలో ఫైనల్‌కు నీరజ్
తొలి ప్రయత్నంలోనే 89.34మీ. దూరం
కిశోర్ జెనా విఫలం



పారిస్: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా తాజా ఒలింపిక్స్‌ను ఘనంగా ఆరంభించాడు. మంగళవారం స్టేడ్ డి ఫ్రాన్స్ స్టేడియంలో జరిగిన పురుషుల జావెలిన్‌త్రో క్వాలిఫయింగ్‌లో తను తొలి ప్రయత్నంలోనే 89.34మీ. దూరం విసిరి ఫైనల్‌కు అర్హత సాధించాడు. నీరజ్ కెరీర్‌లో ఇది రెండో బెస్ట్ త్రో. అలాగే క్వాలిఫికేషన్ రెండు గ్రూపుల్లో 32 మంది త్రోయర్లు పాల్గొనగా నీరజ్‌దే టాప్ షో. ఫైనల్‌కు అర్హత సాధించాలంటే అథ్లెట్లు జావెలిన్‌ను కనీసం 84మీ. దూరం విసరాల్సి ఉంటుంది. నీరజ్ మొదటి ప్రయత్నంలోనే అంతకుమించి వేయడంతో మిగిలిన రెండు చాన్స్‌లను ఉపయోగించుకోవాల్సిన అవసరం లేకపోయింది. మరోవైపు టాప్-12 మంది అథ్లెట్ల మధ్య జరిగే ఫైనల్ గురువారం రాత్రి 11.55కు ఆరంభమవుతుంది. వాస్తవానికి నీరజ్ ఈ ఏడాది బెస్ట్ 88.36మీ. (దోహా డైమండ్ లీగ్‌లో) దూరమే అయినా ఒలింపిక్స్ క్వాలిఫికేషన్‌లో మాత్రం దాన్ని సునాయాసంగా అధిగమించాడు. ఇక రెండుసార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన గ్రెనెడా అథ్లెట్ పీటర్స్ అండర్సన్ (88.63మీ.), పాక్‌కు చెందిన అర్షద్ నదీమ్ (86.59మీ.) కూడా గ్రూప్ 'ఎ'లో నీరజ్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే బెర్త్ దక్కించుకున్నారు. బ్రెజిల్ త్రోయర్ డా సిల్వా లూయిజ్ (85.91మీ) మాత్రం మూడో ప్రయత్నంలో అర్హత సాధించాడు. ఇదిలావుండగా గ్రూప్ 'ఎ'లో బరిలోకి దిగిన మరో భారత త్రోయర్ కిశోర్ జెనా మాత్రం తొమ్మిదో స్థానంతో నిరాశపర్చాడు. అతడు తొలి ప్రయత్నంలో 80.73మీ., మూడో ప్రయత్నంలో 80.21మీ. విసరగా.. రెండో ప్రయత్నంలో ఫౌల్ అయ్యాడు.

పారిస్‌లో నేటి భారతం

అథ్లెటిక్స్: మిక్స్‌డ్ మారథాన్ వాక్ రిలే పతకరౌండ్: ప్రియాంక గోస్వామి, సూరజ్ పన్వర్ (ఉ. 11.00); పురుషుల హైజంప్ క్వాలిఫికేషన్: సర్వేశ్ (మ. 1.35); మహిళల జావెలిన్ త్రో క్వాలిఫికేషన్: అన్నూ రాణి (మ. 1.55); మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రౌండ్ 1: జ్యోతి యర్రాజీ (హీట్ 4) (మ. 1.45); పురుషుల ట్రిపుల్ జంప్ క్వాలిఫికేషన్: ప్రవీణ్ చిత్రవేల్, అబ్దుల్లా అబూబాకర్ (రా. 10.45); పురుషుల 3వేల స్టీపుల్ చేజ్ ఫైనల్: అవినాశ్ (రా. 1.13)
గోల్ఫ్: మహిళల వ్యక్తిగత ఫైనల్స్-రౌండ్ 1: అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30)
టేబుల్ టెన్నిస్: మహిళల టీమ్ క్వార్టర్స్: భారత్ X జర్మనీ (మ. 1.30).
రెజ్లింగ్: మహిళల 53 కిలోల ప్రీక్వార్టర్‌ఫైనల్స్: అంతిమ్ X జ్యెనెప్ ఎట్గిల్ (టర్కీ) (మ. 3.05); మహిళల 50 కిలోల ఫ్రీస్టయిల్ ఫైనల్: వినేశ్ ఫొగట్ X సారా ఆన్ (అమెరికా) (రాత్రి 11.20 గం.)
వెయిట్‌లిఫ్టింగ్: మహిళల 49 కిలోల పతక రౌండ్: మీరాబాయి (రా. 11.00).

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
అమెరికా	22	31	29	82
చైనా	22	20	16	58
ఆస్ట్రేలియా	14	12	9	35
ఫ్రాన్స్	13	16	19	48
బ్రిటన్	12	15	18	45
భారత్	0	0	3	3

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.



అమెరికాలో పర్యటిస్తున్న భారత అంధుల క్రికెట్ జట్టు.. సీఎం రేవంత్ రెడ్డిని న్యూయార్క్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. క్రికెటర్లతో రేవంత్ కొద్దిసేపు ముచ్చటించారు.

సమం చేస్తారా?

● తడబడుతున్న భారత బ్యాటర్లు
● 27 ఏళ్ల తర్వాత లంకకు సిరీస్ గెలిచే చాన్స్
● మూడో వన్డే మ. 2.30 నుంచి



కొలంబో: స్పిన్‌ను ఎదుర్కోవడంలో తడబడుతున్న భారత బ్యాటింగ్.. భంగపాటును తప్పించుకోవాలనుకొంటోంది. మూడు వన్డేల సిరీస్‌లో 0-1తో వెనుబడిన రోహిత్ సేన.. బుధవారం శ్రీలంకతో జరిగే చివరి మ్యాచ్‌లో గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్ గెలిస్తే సిరీస్ 1-1తో సమమవుతుంది. తొలి వన్డే టై కాగా.. రెండో మ్యాచ్‌లో 32 పరుగుల తేడాతో భారత్ ఓటమి పాలైంది. మరోవైపు ఫుల్‌జోష్‌లో ఉన్న ఆతిథ్య లంక.. ఈ వన్డే నెగ్గి 27 ఏళ్ల తర్వాత భారత్‌పై తొలి సిరీస్ పట్టేయాలన్న పట్టుదలతో ఉంది. 1997లో సచిన్ టెండూల్కర్ కెప్టెన్సీలో చివరిసారి భారత్ 0-3తో లంక చేతిలో ద్వైపాక్షిక సిరీస్‌లో పరాజయం పాలైంది. కాగా తాజాగా రెండు వన్డేల్లోనూ టీమిండియా మిడిలార్డర్ వైఫల్యం బహిర్గతమైంది. ఓపెనర్ రోహిత్ దూకుడైన ఆరంభాన్నిచ్చినా.. కోహ్లీ పేలవ ప్రదర్శన ఎంతో ప్రభావం చూపిస్తోంది. రెండో వన్డేలో వాండర్సే స్పిన్ దెబ్బకు శివమ్ దూబే, కేఎల్ రాహుల్ డకౌట్ కాగా.. శ్రేయాస్ అయ్యర్ (7) వికెట్ల ముందు దొరికిపోయాడు. తగిన ఫుట్‌వర్క్ లేకపోవడంతో స్లో బౌలర్లను ఎదుర్కోవడంలో బోల్తాపడుతున్నారు. మధ్య ఓవర్లలో కోహ్లీ నిలబడి పరుగులు సాధిస్తే భారత్ విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. రోహిత్ ఎలా ఆడుతున్నాడో గమనించి వీరు కూడా అదే తరహాలో స్పిన్‌ను ఎదుర్కొంటే.. లంక బౌలర్లకు చుక్కలు చూపించవచ్చు. హిట్‌మ్యాన్ ఫిట్‌నెస్‌పై అనుమానాలున్నా.. అతడు ఈ మ్యాచ్‌లో ఆడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దూబే స్థానంలో స్పిన్ బౌలింగ్ చేయగల రియాన్ పరాగ్‌కు చాన్స్ దక్కొచ్చు. భారత బౌలర్లు కూడా టెయిలెండర్ల పనిపట్టడంపై దృష్టిసారించాలి. కాగా, లంక సిరీస్‌పై గురిపెట్టింది. బ్యాటర్లు ఓ మాదిరైన స్కోర్లు అందిస్తున్నా.. స్పిన్నర్లు హసరంగ, వాండర్సే ప్రత్యర్థి వెన్ను విరుస్తున్నారు. వీరి నుంచి జట్టు మరోసారి అదే తరహా ప్రదర్శనను ఆశిస్తోంది. మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించే అవకాశాలున్నాయి.

జట్టు (అంచనా):

భారత్: రోహిత్, గిల్, కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, దూబే/పరాగ్, అక్షర్, సుందర్, కుల్దీప్, సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్. **శ్రీలంక:** పథుం నిస్సంక, అవిష్క ఫెర్నాండో, కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), సదీర సమరవిక్రమ, అసలంక (కెప్టెన్), జనిత్ లియనాగే, వెల్లలగే, కమిందు మెండిస్, వాండర్సే, ధనంజయ, అసిత ఫెర్నాండో.

'స్థానికత'పై సర్కారు తీరు అనుమానాస్పదం

- వైద్య విద్య ప్రవేశాల్లో తెలంగాణ విద్యార్థులకు నష్టం
- సర్కారు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీకి స్థానికత విషయంలో ప్రభుత్వ తీరు అనుమానాస్పదంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జీవో 33 ప్రకారం నిర్దేశించిన స్థానికతలోని అంశాల వల్ల తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 9 నుంచి 12 తరగతి వరకు తెలంగాణలో చదివిన విద్యార్థులే స్థానికులు అవుతారని ప్రభుత్వం చెబుతోందని, దీని ప్రకారం హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ఇతర రాష్ట్రాల విద్యార్థులు చాలామంది తెలంగాణ లోకల్ అవుతారని తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల్లో చదివే మన విద్యార్థులు నాన్ లోకల్ అవుతారన్నారు. దీనివల్ల మన విద్యార్థులు వైద్య విద్య సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక అలంపూర్ ఎమ్మెల్యే విజయుడి అరెస్టు సరికాదని, ప్రజలు ఎనుకున్న ప్రజాప్రతినిధులను అవమానించేందుకు ఈ ప్రభుత్వం ప్రొటోకాల్ విధానాలను మార్చిందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణలో ఐటీ ఎగుమతులు, ఉద్యోగాలు క్షీణించడం ఆందోళన కలిగిస్తోందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రం నుంచి రూ.57,706 కోట్ల ఐటీ ఎగుమతులుంటే 2023-24లో రూ.26,948 కోట్లే జరిగాయని తెలిపారు. ఐటీ ఉద్యోగాల కల్పన భారీగా పడిపోయిందని, 2022-23లో 1,27,594 కొత్త ఉద్యోగాలు వస్తే.. 2023-24లో 40,285 ఉద్యోగాలే కల్పించారని పేర్కొన్నారు.

బోగస్ కంపెనీలతో ఒప్పందాలా?: క్రిశాంక్

అమెరికా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణకు ఫ్రాడ్ (బోగస్) కంపెనీల ద్వారా పెట్టుబడులు తెస్తారా? అని బీఆర్ఎస్ నేత మన్నెక్రిశాంక్ ప్రశ్నించారు. ఎ రాష్ట్రంలోని మహిళలకు ఉపయోగపడేలా రూ.839కోట్ల పెట్టుబడిపెట్టేందుకు వాల్ష్‌కర్రా హోల్డింగ్స్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నట్లు సీఎం కార్యాలయం తెలిపిందని, ఆ కంపెనీ నాలుగు నెలల క్రితమే ప్రారంభమైందన్నారు. ఈ సంస్థలో ఇద్దరు డైరెక్టర్లు ఉన్నారని, వారిద్దరికీ చెరో యాభై షేర్లు ఉన్నాయని, ఇలాంటి కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు ఎలా పెడుతుందని ఆయన ప్రశ్నించారు.

ఆ నిబంధన మీరు పెట్టిందే..!

- కేటీఆర్ వ్యాఖ్యలకు బదులిచ్చిన మంత్రి రాజనర్సింహ



వైద్య విద్యలో సీట్ల భర్తీకి స్థానికత విషయంపై మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించారు. స్థానికత విషయంలో ప్రభుత్వ తీరు అనుమానాస్పదంగా ఉందంటూ ఎక్స్‌లో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు రాజనర్సింహ కూడా ఎక్స్‌లోనే సమాధానం ఇచ్చారు. ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపునకు సంబంధించి 2017 జూలై 5న నాటి బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన జీవో 114ను ప్రస్తావించారు. ఆ జీవోలో 9 నుంచి 12వ తరగతి వరకు చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణిస్తూ చేసిన నిబంధననే జీవో 33లో చేర్చామని వెల్లడించారు. ఈ జీవోతో ఇతర రాష్ట్ర విద్యార్థులు స్థానికులవుతారన్న కేటీఆర్ వ్యాఖ్యలను కొట్టిపారేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 114 ప్రకారం 6 నుంచి ఇంటర్ వరకు కనీసం నాలుగేళ్ల పాటు విద్యార్థులు చదివిన ప్రాంతానికి స్థానికతను వర్తింపజేయాలన్న నిబంధనను కొనసాగించలేమని స్పష్టం చేశారు. ఆ జీవో మేరకు నాలుగేళ్లు తెలంగాణలో, మిగిలిన మూడేళ్లు ఏపీలో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించారని గుర్తుచేశారు. విభజన చట్టం హామీలు ఈ ఏడాది జూన్ 2తో ముగిసినందున, ఆ నిబంధనను కొనసాగించబోమని మంత్రి స్పష్టం చేశారు.

త్వరలోనే బెయిలు.. ఏర్పాట్లు చేస్తున్నాం!

- కవితకు ధైర్యం చెప్పిన కేటీఆర్, హరీశ్
- 15 రోజుల్లో రెండోసారి ములాఖత్
- ఢిల్లీలో జయశంకర్‌కు కేటీఆర్ నివాళి

న్యూఢిల్లీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. మంగళవారం వారిద్దరూ జైలుకు వెళ్లి కవితతో ములాఖత్ అయ్యారు. ఉదయం 11 గంటల నుంచి 11.20 వరకు కవితతో ముచ్చటించారు. త్వరలోనే బెయిల్ వస్తుందని, అందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని.. న్యాయ నిపుణులతో చర్చిస్తున్నామని కవితకు వారు ధైర్యం చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దాదాపు నాలుగున్నర నెలలుగా జైల్లోనే ఉంటున్న కవిత ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో జైల్లో వసతులు, ఆరోగ్యపరమైన ఇబ్బందులు, భోజనం తదితర విషయాలపై ఆరా తీసినట్లు తెలిసింది. ట్రయల్ కోర్టులో బెయిల్ పిటిషన్ ఉపసంహరణ, సుప్రీంకోర్టులో న్యాయ పోరాటం తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. కాగా, తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా కేటీఆర్ మంగళవారం ఢిల్లీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలో కేసీఆర్‌తో కలిసి జయశంకర్ 36 పార్టీలను ఒప్పించి, తెలంగాణకు అనుకూలంగా లేఖలు ఇప్పించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే కేసీఆర్ పదేళ్ల పాలన సాగిందన్నారు. ప్రస్తుత పాలకులు కూడా జయశంకర్ కలలు కన్న తెలంగాణ కోసం పనిచేయాలని సూచించారు.

బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కవిత

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ట్రయల్ కోర్టులో వేసిన బెయిల్ పిటిషన్‌ను ఎమ్మెల్సీ కవిత ఉపసంహరించుకున్నారు. సీబీఐ అనుబంధ చార్జిషీట్‌లో అన్నీ తప్పులే ఉన్నాయని, అక్రమంగా కేసు పెట్టారని.. తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ జూలై 6న కవిత రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చార్జిషీట్ ఫైలింగ్ మాత్రమే సరిగా లేదని, కోర్టు ఆదేశాలతో సరైన పద్ధతిలో దాఖలు చేశామని, అంతే తప్ప అందులో తప్పులేమీ లేవని సీబీఐ వాదనలు వినిపించింది. ఆ వాదనలతో ఏకీభవించిన జడ్జి కావేరి బవేజా చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు జూలై 22న ప్రకటించారు. ఆ తర్వాత బెయిల్ పిటిషన్‌పై విచారణ జరుగుతోంది. సీనియర్ న్యాయవాది రాలేదని, మరో రోజు వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని సోమవారం కవిత తరఫు న్యాయవాది కోరారు. దీనిపై జడ్జి కొంత అసహనం వ్యక్తం చేశారు. బుధవారం తుది వాదనలు వినిపించాలని స్పష్టం చేశారు. అయితే మంగళవారం బెయిల్ పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు కవిత తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. బెయిలు పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పునే కవిత సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్నట్లు తెలిసింది. అందుకే.. ట్రయల్ కోర్టులో పిటిషన్‌ను విరమించుకున్నట్లు సమాచారం.

రాజధానికి మల్లన్న సాగర్ నీళ్లు

(మొదటిపేజీ తరువాయి)



తరలించేందుకు సన్నద్ధమవుతోంది. ఇందు కోసం రూ.5,560 కోట్లను కేటాయిస్తూ పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఈ పథకం కింద 15 టీఎంసీల నీటిని తరలించనున్నారు. దీని ద్వారా నగరానికి తాగునీటిని తరలించడంతోపాటు మూసీ నది మీద నిర్మించిన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ జలాశయాలను పునరుజ్జీవింపచేయనున్నారు. ప్రాజెక్టు వ్యయంలో 40 శాతం వరకు వాటర్‌బోర్డు భరిస్తుండగా.. 60శాతం నిర్మాణ సంస్థ భరించాల్సి ఉంటుంది. ఈ ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

2030 అవసరాలను దృష్టిలో పెట్టుకుని..

ప్రస్తుతం హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వివిధ జలాశయాల నుంచి 580-600 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నారు. 2030 అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 170 ఎంజీడీల నీటిని తరలించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గోదావరి నుంచి 30 టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉండటంతో అదనపు జలాల కోసం రెండోదశ పనులు చేపట్టాలని నిర్ణయించింది. 2030 వరకు హైదరాబాద్ తాగునీటి అవసరాలు 750 ఎంజీడీలకు పెరుగుతాయని సర్కారు అంచనా వేసింది. 2050 నాటికి ఇది 1014 ఎంజీడీలకు చేరుతుందని, అందులో భాగంగానే మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీటిని తరలించే ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని అధికార వర్గాలు తెలిపాయి.

మల్లన్నసాగర్ నుంచి తరలింపు ఇలా..

గోదావరి తొలి దశ ప్రాజెక్టు కింద నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలికి ఇప్పటికే ఏటా 10 టీఎంసీల నీరు తరలిస్తున్నారు. తాజాగా రెండో దశ పనుల ద్వారా 50 టీఎంసీల సామర్థ్యం కలిగిన మల్లన్న సాగర్ నుంచి ఏటా 15 టీఎంసీల నీటిని తరలించనున్నారు. ఇందులో 10 టీఎంసీలు తాగునీటి అవసరాలకు.. మిగిలిన 5 టీఎంసీలు జంట జలాశయాల పునరుజ్జీవం, మూసీ ప్రక్షాళన కోసం వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను వ్యాప్కోస్ సంస్థ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా మల్లన్న సాగర్ నుంచి శామీర్‌పేట వద్ద గల ఘన్‌పూర్ వరకు 3,600 ఎంఎం వ్యాసం కలిగిన భారీ పైపులైన్ నిర్మించనున్నారు. అక్కడి నుంచి జంట జలాశయాలకు చేరేవిధంగా ఓ పైపులైన్.. నగర తాగునీటి అవసరాల కోసం మరో పైపులైన్ నిర్మిస్తారు.

ఘన్‌పూర్ నుంచి నగరానికి..

ఘన్‌పూర్‌లో 780 ఎంఎల్‌డీల నీటి శుద్ధి కేంద్రాన్ని నిర్మించనున్నారు. అక్కడి నుంచి 2400 ఎంఎం వ్యాసం కలిగిన పైపులైన్ ద్వారా 10 టీఎంసీలను నగరానికి తరలించనున్నారు. గోదావరి జలాలను ఫేజ్-1 కింద ఇప్పటికే ఘన్‌పూర్ నుంచి మూడు రింగ్ మెయిన్ పైపులైన్లు ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు అందిస్తున్నారు. ఒక రింగ్ మెయిన్ బిట్స్ పిలానీ మీదుగా సైనిక్‌పూరి ప్రాంతానికి గోదావరి జలాలను తరలిస్తుండగా.. రెండో రింగ్ మెయిన్ కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి మీదుగా లింగంపల్లికి.. మూడో రింగ్ మెయిన్ నుంచి ఔటర్ వెంట పటాన్‌చెరు మీదుగా కోకాపేట ప్రాంతానికి గోదావరి జలాలను తరలిస్తున్నాయి. అయితే ఫేజ్-2 ప్రాజెక్టులో భాగంగా ఘన్‌పూర్ నుంచి నాలుగో రింగ్ మెయిన్ పైపులైన్‌ను 40 కి.మీ. మేర ముత్తంగి వరకు వేయనున్నారు. దీనిని ఇప్పటికే ఉన్న రింగ్ మెయిన్లకు అనుసంధానం చేస్తారు. దీంతో కోకాపేట, కొల్లూరు, ఐటీ కారిడార్ ప్రాంతానికి నేరుగా గోదావరి జలాలు అందనున్నాయి.

జంట జలాశయాలకు తరలింపు ఇలా..

ఘన్‌పూర్ నుంచి 2200ఎంఎం వ్యాసం కలిగిన పైపులైన్‌ను ఔటర్ అవతలి భాగం నుంచి ముత్తంగి, కొల్లూరు, ఇంద్రారెడ్డి కాలనీ, జన్వాడ మీదుగా జన్వాడ-ఖానాపూర్ మధ్యలో నుంచి ఉస్మాన్‌సాగర్ వరకు నిర్మిస్తారు. ఈ పైప్‌లైన్ దాదాపు 58కి.మీ. మేర ఉంటుంది. ఉస్మాన్‌సాగర్‌లో గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండిన తర్వాత హిమాయత్ సాగర్‌లోకి వెళ్లేందుకు చర్యలు తీసుకుంటారు. జంట జలాశయాలు నిండిన తర్వాత మూసీ నదిలోకి నీటిని వదులుతారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఉస్మాన్‌సాగర్ దిగువన 120ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే), హిమాయత్‌సాగర్ దిగువన 70ఎంఎల్‌డీల సామర్థ్యం కలిగిన నీటి శుద్ధి కేంద్రాలను నిర్మించనున్నారు.

బీరు మరింత ప్రియం!

- బ్రూవరీలకు ప్రభుత్వం చెల్లిస్తున్న కొనుగోలు ధర పెంపు
- ఆ భారం వినియోగదారులపై..
- సెప్టెంబరు నుంచి అమల్లోకి



హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా బీర్ల ధరలు పెరగనున్నట్టు తెలిసింది. బీర్ల ఉత్పత్తి కేంద్రాల(బ్రూవరీల)కు ప్రస్తుతం ప్రభుత్వం చెల్లిస్తున్న ధరలను 10 నుంచి 12% మేర పెంచాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ భారం అంతిమంగా వినియోగదారులపైనే పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు బ్రూవరీల్లో ఏటా 68 కోట్ల లీటర్ల బీరు ఉత్పత్తి అవుతోంది. ఆ బీరును తెలంగాణ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌బీసీఎల్) కొనుగోలుచేసి.. మద్యం దుకాణాలకు సరఫరా చేస్తోంది. ఈ క్రమంలో 12 బీర్ల కేసుకుగాను బ్రూవరీలకు టీఎస్‌బీసీఎల్ రూ.289 చెల్లిస్తోంది. పన్నులన్నీ కలుపుకొని కేసుకు రూ.1400 చొప్పున రిటైలర్లకు (మద్యం దుకాణాలు) విక్రయిస్తుండగా.. ఇతర ఖర్చులన్నీ కలిపి మద్యం దుకాణాలవారు కేసు రూ.1800 చొప్పున విక్రయిస్తున్నారు. అంటే.. ఒక్కో బీరునూ ప్రభుత్వం బ్రూవరీల వద్ద రూ.24.08కి కొనుగోలు చేసి రూ.116.66కి మద్యం దుకాణాలకు విక్రయిస్తుండగా.. వినియోగదారుడి వద్దకు వచ్చేసరికి ఒక్కో బీరు ధరా రూ.150 అవుతోంది. రాష్ట్రంలో బీర్ల డిమాండ్‌కు తగ్గట్టు ప్రభుత్వ ఆర్డర్లపై బ్రూవరీలు బీర్లను ఉత్పత్తి చేస్తాయి. ఈమేరకు బ్రూవరీలతో ప్రభుత్వం కుదుర్చుకునే ఒప్పందం రెండేళ్లపాటు అమల్లో ఉంటుంది. గడువు పూర్తయ్యాక ధరలను సవరించి మళ్లీ రెండేళ్ల ఒప్పందాన్ని కొనసాగిస్తారు. ప్రతి రెండేళ్లకూ బ్రూవరీలకు చెల్లించే ధరను ప్రభుత్వం దాదాపు 10% మేర పెంచుతూ ఉంటుంది. చివరిసారిగా రెండేళ్ల క్రితం 2022 మే నెలలో 6% చొప్పున రెండుసార్లు పెంచింది. నిర్వహణ ఖర్చులు పెరిగినందున ఈసారి 20-25% పెంచాలంటూ బ్రూవరీలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈస్థాయిలో పెంచితే వినియోగదారులపై భారం ఎక్కువగా ఉంటుందని భావించిన ప్రభుత్వం 10-12% వరకూ పెంచాలని నిర్ణయించినట్టు తెలిసింది. కొత్త ధరలు వచ్చే నెల నుంచి అమల్లోకి రానున్నట్టు తెలిసింది. అయితే ధరల భారం కేవలం బీర్లకే పరిమితం కానుంది. ఇతర మద్యం తయారీ ఉత్పత్తిదారులతో జరిగిన ఒప్పందం మేరకు.. ప్రస్తుతం వాటికి పాత ధరలే ఉండనున్నాయి.


వేధించినందున మాజీ భర్తకు 15 లక్షలు చెల్లించండి

పరువు నష్టం కేసులో మహిళకు ఢిల్లీ కోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: విడాకులు తీసుకోకముందు భర్తను వేధించినందున పరువు నష్టం కింది ఆయనకు రూ.15 లక్షల పరిహారం చెల్లించాలని ఢిల్లీ కోర్టు ఒకటి ఓ మహిళను ఆదేశించింది. ఈ వేధింపుల కారణంగానే ఆయన ఉద్యోగంలో ఎదగలేకపోయారని కోర్టు నిర్ధారించింది. ఢిల్లీకి చెందిన ఓ జంటకు 2001లో వివాహం జరిగింది. 2009 నుంచి వారు విడిగా ఉండడం ప్రారంభించారు. 2010 నుంచి ఆమె ఆయనపై పలు ఆరోపణలు చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులకు ఈ-మెయిల్స్ పంపడంతో పాటు, వాట్సాప్‌లో చాటింగ్ కూడా చేశారు. దాంతో ఆమె క్రూరత్వానికి పాల్పడుతోందని ఆరోపిస్తూ ఆయన 2011లో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన కోర్టు 2021 డిసెంబరులో విడాకులు మంజూరు చేసింది. అనంతరం ఆయన ఆమెపై సివిల్ పరువు నష్టం దావా దాఖలు చేశారు. ఆమె ఆరోపణల కారణంగా వేధింపులకు గురయ్యాయని, అనారోగ్య సమస్యలు వచ్చాయని, ఆర్థికంగా నష్టపోయానని, గౌరవం, ఉపాధి కోల్పోయానని పేర్కొంటూ ఈ దావా వేశారు. రూ.25 లక్షల పరిహారం ఇప్పించాలని కోరారు. ఇందుకు ఆధారాలుగా ఆమె చేసిన ఈ-మెయిళ్లు, వాట్సా్‌పలను డిజిటల్ సాక్ష్యాలుగా పేర్కొంటూ అఫిడవిట్ సమర్పించారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న జిల్లా జడ్జి సునీల్ బెనివాల్..ఈ ఆరోపణలను ఆమె ఎప్పుడూ ఖండించలేదని పేర్కొన్నారు. రూ.15 లక్షలు చెల్లించాలని ఆదేశించారు.

ధర్మాసనం మీద కూర్చోండి.. మీకు నచ్చిన తేదీలు చెప్పుకోండి

- కేసు త్వరగా చేపట్టాలన్న న్యాయవాదికి సీజేఐ చురక



న్యూఢిల్లీ, ఆగస్టు 6: "సర్! ధర్మాసనం మీద ఒక రోజు కూర్చోండి. దెబ్బకు భయపడి పారిపోతారు"..కేసును త్వరగా విచారణకు చేపట్టాలంటే పదే పదే విజ్ఞప్తి చేసిన న్యాయవాదిని ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్.. కాస్త చిరాకు పడుతూ ఈ వ్యాఖ్య చేశారు. మహారాష్ట్రలోని రాజకీయ వివాదాలపై దాఖలైన రెండు పిటిషన్లకు సంబంధించిన విచారణ తేదీలను మంగళవారం సీజేఐ ఆధ్వర్యంలోని త్రిసభ్య ధర్మాసనం ఖరారు చేసే సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఏక్‌నాథ్ షిండే ఆధ్వర్యంలోని శివసేనను అసలైన శివసేనగా, అజిత్ పవార్ ఆధ్వర్యంలోని ఎన్‌సీపీని అసలైన పార్టీగా గుర్తిస్తూ స్పీకర్ ఆదేశాలివ్వడాన్ని సవాలు చేస్తూ రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. శివసేన కేసులో వాదనలు పూర్తయ్యాయని ప్రకటించిన సీజేఐ.. ఎన్‌సీపీ కేసుపై తేదీలను కేటాయించడం ప్రారంభించారు. ఈ లోగా ఉద్ధవ్ ఠాక్రే గ్రూపు తరఫున హాజరైన న్యాయవాది జోక్యం చేసుకొని సమాధానం ఇచ్చేందుకు రెండు రోజులు సరిపోతుందని అందువల్ల కేసును త్వరగా విచారణ జరపాలని కోరారు. చిరాకు పడ్డ జస్టిస్ చంద్రచూడ్.."దయచేసి కోర్టుకు ఆదేశాలు ఇవ్వొద్దు. ఒక రోజు పాటు ఇక్కడ కూర్చొని మీకు నచ్చిన తేదీలేవో కోర్టుమాస్టర్‌కు చెప్పండి. కోర్టులు ఎలాంటి ఒత్తిళ్లతో పనిచేస్తాయో మీకు అర్థమవుతుంది" అన్నారు.

వలస సమస్యకు మతం రంగు!

బ్రిటన్‌లో హింసాకాండకు ఇదే కారణం.. ముగ్గురు బాలికల హత్యపై సోషల్ మీడియాలో వదంతులు

- ముస్లింలే లక్ష్యంగా దాడులు
- బ్రిటన్‌లో అంతర్యుద్ధం తప్పదు: మస్క్

బ్రిటన్‌లోని పలు నగరాల్లో చోటు చేసుకున్న హింసాకాండను చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. హింసాకాండకు.. ముగ్గురు బాలికల హత్యలే తక్షణ కారణంగా పైకి కనిపిస్తున్నప్పటికీ.. బ్రిటన్‌లోకి అక్రమ వలసలపై అక్కడి జనంలో పేరుకున్న అసంతృప్తి, కొన్ని సంస్థలు ఈ సమస్యలో మతం కోణాన్ని చొప్పించి ఉన్మాదాన్ని రెచ్చగొట్టటం, సోషల్ మీడియాలో అబద్ధాలను ప్రచారం చేయటం ఇలా.. బ్రిటన్‌లో హింసాకాండకు చాలా కారణాలున్నాయి.



మాంచెస్టర్‌లో నిరసనకారులను చెదరగొడుతున్న పోలీసులు

లండన్, ఆగస్టు 6: గత నెల 29వ తేదీన సౌత్‌పోర్ట్ అనే తీరప్రాంత పట్టణంలో 6-9 ఏళ్ల వయస్కులైన ముగ్గురు బాలికలు కత్తి పోట్లకు గురై ప్రాణాలు కోల్పోయారు. ఇదే ఘటనలో మరో 8 మంది పిల్లలు, ఇద్దరు పెద్దవాళ్లు గాయాలపాలయ్యారు. ఇదంతా ఓ 17 ఏళ్ల బాలుడు చేశాడు. అతడిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ ఘటనపై రాత్రికి రాత్రి వదంతులు వ్యాపించాయి. నిందితుడు ముస్లిం అని, బ్రిటన్‌కు వలసవచ్చిన కుటుంబానికి చెందిన వాడని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. మృతి చెందిన బాలికలకు సౌత్‌పోర్ట్ పట్టణంలో నివాళి అర్పించటానికి జనం గుమిగూడిన సమయంలో, వందలాదిమంది స్థానికంగా ఉన్న మసీదుపై రాళ్లు, ఇటుకలు, సీసాలతో దాడి చేశారు. ఈ దాడికి పాల్పడిన వారు 'ఇంగ్లిష్ డిఫెన్స్ లీగ్'కు చెందినవారు. ఇది బ్రిటన్‌లో 2009 నుంచి ముస్లిం వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఓ మతోన్మాద సంస్థ. ఇటువంటి అనేక రైటిస్ట్ సంస్థలు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వదంతులను వ్యాపింపజేశాయి. రష్యాతో సంబంధం ఉందని భావిస్తున్న 'చానల్ 3 నౌ' అనే ఆన్‌లైన్ ఛానల్ కూడా వీటికి ఓ వేదికలా నిలిచింది. ఫలితంగా గంటల వ్యవధిలోనే లండన్, హర్ట్‌పూల్, మాంచెస్టర్, మిడిల్స్‌బరో, లివర్‌పూల్, బ్రిస్టల్, బెల్‌ఫాస్ట్, లీడ్స్, నాటింగ్‌హం తదితర నగరాల్లో నిరసనలు, విధ్వంసం మొదలయ్యాయి. పరిస్థితి చేయి దాటి పోతుండటంతో విద్వేష ప్రచారాన్ని ఎదుర్కోవటానికి పోలీసులు.. హంతకుడు మైనర్ అయినప్పటికీ అతడి వివరాలు బయటపెట్టారు. హంతకుడి పేరు యాక్సెల్ ముగన్వా రుదకుబనా అని, 2006లో బ్రిటన్‌లోనే పుట్టాడని, అతడి తల్లిదండ్రులు రువాండా దేశ మూలాలున్న వారని తెలిపారు. దీంతో హింసాకాండ కొంత సద్దుమణిగింది.

దీర్ఘకాలిక సమస్య!

ఆఫ్రికా, యూరప్ తదితర దేశాల నుంచి బ్రిటన్‌లోకి అక్రమంగా వలస వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వీరికి ప్రభుత్వం తాత్కాలికంగా హోటళ్లలో ఆశ్రయం కల్పిస్తోంది. దీని కోసం గత ఏడాదిలోనే 250 కోట్ల పౌండ్లు (దాదాపు రూ.27,000 కోట్లు) ఖర్చు చేశారు. దేశం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండగా, అక్రమవలసదారుల కోసం అంతంత నిధులు ఖర్చు చేయటం ఏమిటన్న అసంతృప్తి అక్కడి ప్రజల్లో ఉంది. ఈ సమస్య ఇటీవలి ఎన్నికల్లో ఒక ప్రధానాంశమైంది. రువాండా నుంచి పడవల్లో అక్రమంగా వచ్చే వారిని అనుమతించబోమని మాజీ ప్రధాని సునాక్ హామీ కూడా ఇచ్చారు. ఇదిలా ఉండగా, బ్రిటన్‌లో హింసాకాండను ఎంతమాత్రం సహించబోమంటూ ప్రధాని స్టార్మర్ హెచ్చరించారు. ఈ హింసాకాండపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. బ్రిటన్‌లో అంతర్యుద్ధం తప్పదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై స్టార్మర్‌తోపాటు బ్రిటన్‌లోని పలువురు రాజకీయ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇటువంటి వ్యాఖ్యలకు ఎటువంటి ఆధారం లేదు' అన్నారు. 'కొద్దిమంది దారిదోపిడీగాళ్లు చేసే పని బ్రిటన్ మొత్తాన్నీ ప్రతిబింబించదు. వారి కారణంగా చోటుచేసుకున్న చెత్తను బ్రిటన్ ప్రజానీకం తొలగిస్తోంది' అని స్టార్మర్ పేర్కొన్నారు.

భారత ఎంబసీ సూచన

బ్రిటన్ పర్యటనకు వచ్చిన భారత సందర్శకులు, ఆ దేశంలో ఉన్న భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు స్థానిక అధికారులు జారీ చేస్తున్న సూచనలను గమనించాలని ఆ దేశంలోని భారత రాయబార కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన జారీ చేసింది. నిరసనలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లవద్దని పేర్కొంది. అవసరమైతే తమను సంప్రదించాలని పేర్కొంటూ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో ఫోన్‌నెంబర్లను వెల్లడించింది.

'బీమా'పై జీఎస్టీ తొలగించండి

ప్రజలను దోచుకోవడం ఆపండి.. పార్లమెంటు మెట్లపై ఇండియా నిరసన



న్యూఢిల్లీ, ఆగస్టు 6: ఆరోగ్య జీవిత బీమా ప్రీమియంలపై విధించిన 18% జీఎస్టీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మంగళవారం పార్లమెంటు మకర ద్వారానికి ఉన్న మెట్లపై కూర్చుని తృణమూల్, కాంగ్రెస్, ఆప్, ఎస్పీపీ(ఎస్పీ) సహా పలు పార్టీలకు చెందిన ఎంపీలు మోదీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ట్యాక్స్ టెర్రరిజం' పేరిట ప్లకార్డులను ప్రదర్శించారు. బీమా ప్రీమియంలపై ఏకంగా 18% జీఎస్టీ విధించాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు. జీఎస్టీని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించారు. "తమ ఆరోగ్య సమస్యల విషయంలో ఎవరిపైనా ఆధారపడకూడదని భావించే లక్షలాది మంది ప్రజలు రూపాయి రూపాయి కూడబెట్టి బీమా ప్రీమియంలు చెల్లిస్తున్నారు. మోదీ ప్రభుత్వం మాత్రం వీరిని కూడా వదలకుండా ఏటా రూ.24 వేల కోట్లను పన్నుల రూపంలో దండుకుంటోంది" అని రాహుల్ విమర్శించారు.

మద్రాస్ ఐఐటీకి 228 కోట్లు

పూర్వ విద్యార్థి కృష్ణ చివుకుల విరాళం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మద్రాస్ ఐఐటీ పూర్వ విద్యార్థి, ఇండో ఎంఐఎం ఫౌండర్, సీఈవో కృష్ణ చివుకుల తన ఉన్నతికి కారణమైన ఐఐటీఎంకు రూ.228 కోట్ల భారీ విరాళాన్ని అందించారు. అమెరికాలో స్థిరపడిన, బాపట్ల వాసి కృష్ణను మద్రాస్ ఐఐటీ నిర్వాహకులు మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా కృష్ణ విలేకరులతో మాట్లాడారు. 'ఐఐటీ-మద్రాస్‌లో చేసిన విద్యాభ్యాసం నేను ఉన్నత స్థితికి చేరుకునేలా, జీవితంలో చాలా సాధించగలిగేలా చేసింది. అలాంటి విద్యాసంస్థకు నా వంతుగా బహుమతిగా ఇవ్వాలని భావించి రూ.228 కోట్లను విరాళంగా ఇచ్చా. దేశంలోనే ఒక విద్యా సంస్థకు ఇప్పటివరకు అందించిన అతిపెద్ద విరాళాల్లో ఇదొకటి. మా కంపెనీని క్రమంగా ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరిస్తున్నాం. ఇప్పటికే చెన్నై, తిరుపతిలో మా కంపెనీ ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. మరిన్ని రాష్ట్రాలకు విస్తరించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం' అని చెప్పారు.

ఇరాన్‌కు రష్యా ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్

మాస్కో, బీరూట్ ఆగస్టు 6: మధ్య ప్రాశ్చ్యంలో ప్రాంతీయ యుద్ధం సంభవించే సూచనలు కనిపిస్తున్న నేపథ్యంలో ఇరాన్‌కు రష్యా అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను సరఫరా చేయడం ప్రారంభించింది. వాటితో పాటు రేడార్లను కూడా పంపించింది. హమాస్ నాయకుడు ఇస్మాయిల్ హనియేహ్‌ను టెహ్రాన్‌లో ఇజ్రాయెల్ హత్య చేసినందుకు ప్రతీకారం తీసుకోవాలని ఇరాన్ భావిస్తున్న నేపథ్యంలో రష్యా అందిస్తున్న సహకారానికి ప్రాధాన్యం ఏర్పడింది. మరోవైపు, లెబనాన్‌లోని బీరూట్ గగనతలంలో మంగళవారం మూడు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. కాగా, వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెలీ దళాలు తనిఖీలు చేసి 12 మంది పాలస్తీనియన్లను హతమార్చాయి.

ముర్ముకు ఫిజీ అత్యున్నత పౌర పురస్కారం



సువా, ఆగస్టు 6: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విశిష్ట గౌరవం దక్కింది. ఫిజీ దేశంలో పర్యటిస్తున్న ఆమెకు... ఆ దేశ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'ది కంపెనీయన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ'ని అందజేసింది. అధ్యక్షుడు రటు విలియమే కటోనివెరే మంగళవారం ఆమెకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా... ఫిజీని ధృడమైన దేశంగా మలిచే దిశగా భాగస్వామ్యం కుదుర్చుకునేందుకు భారత్ సంసిద్ధంగా ఉందని ముర్ము పేర్కొన్నారు.

సైనికులు వేసే ప్రతి అడుగులోనూ విద్యుత్!

ఇండోర్, ఆగస్టు 6: ఆర్మీ సిబ్బంది భద్రత కోసం ఐఐటీ ఇండోర్ పరిశోధకులు నూతన ఆవిష్కరణ చేశారు. వారు వేసే ప్రతి అడుగులోనూ విద్యుత్ ఉత్పత్తి చేయగలిగే సరికొత్త బూట్లను అభివృద్ధి చేశారు. అంతేకాదు.. ఈ బూట్లకు అమర్చిన జీపీఎస్ సాయంతో వారు ఎక్కడ ఉన్నారో కూడా రియల్‌టైమ్‌లో గుర్తించవచ్చు. ఇప్పటికే పది జతల బూట్లను డీఆర్‌డీవోకు సరఫరా చేశారు. ఈ బూట్లను ట్రైబో-ఎలక్ట్రిక్ నానోజనరేటర్ (టీఈఎన్‌జీ)తో రూపొందించారు. నడకతో ఉత్పత్తి అయిన విద్యుత్ బూట్లలో అమర్చిన పరికరంలో నిల్వ ఉంటుందని ఐఐటీ అధికారులు వెల్లడించారు.

ఢిల్లీ అపోలోలో చేరిన ఆడ్వాణీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బీజేపీ కురు వృద్ధుడు లాల్ కిషన్ ఆడ్వాణీ (96) సోమవారం ఉదయం ఇంద్రప్రస్థలోని అపోలో ఆస్పత్రిలో చేరారు. న్యూరాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వినీత్ సూరి పర్యవేక్షణలో ఆయన ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి ఓ ప్రకటనలో తెలిపింది. రొటీన్‌గా చేసే ఫాలో అప్ తనిఖీల కోసం ఆయన చేరరాని, అవి పూర్తయినవెంటే ఇంటికి పంపిస్తామని పేర్కొంది.

కమలా హారిస్ డిప్యూటీగా టిమ్ వాల్జ్

వాషింగ్టన్, ఆగస్టు 6: అమెరికా(యూఎస్) ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా నామినేషన్ దక్కించుకున్నారు. అమెరికాలో ఓ ప్రధాన పార్టీ నుంచి ఈ నామినేషన్ దక్కించుకున్న తొలి భారత మూలాలున్న వ్యక్తిగా ఆమె నిలిచారు. డెమొక్రటిక్ పార్టీ జాతీయ డెలిగేట్ల ఓట్లలో ఆమెకు 99% ఓట్లు రావడంతో సోమవారం రాత్రి ఆమె అధ్యక్ష అభ్యర్థిత్వం ఖరారు అయ్యింది. కాగా, కమలా హారిస్ తన ఉపాధ్యక్ష అభ్యర్థిగా మినెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్‌ను ఎంపిక చేసుకున్నారు.

కిసాన్ కార్డు రుణాలపై వడ్డీ రాయితీ కొనసాగింపు

ముంబై, ఆగస్టు 6: కిసాన్ క్రెడిట్ కార్డు(కేసీసీ) ద్వారా రుణాలు తీసుకున్న రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. రూ.3 లక్షల లోపు స్వల్పకాలిక రుణాలు తీసుకుని సకాలంలో చెల్లిస్తున్న వారికి ఇస్తున్న 3శాతం వడ్డీ రాయితీ పథకాన్ని 2024-25 ఆర్థిక సంవత్సరానికి కూడా కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. పంట రుణాలతోపాటు పశు సంవర్ధక, మత్స్య, డెయిరీ తదితర రంగాల రైతులు తీసుకున్న రుణాలకు కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. కేసీసీ ద్వారా రైతులు ఏడాదికి 7% వడ్డీతో రుణాలు పొందుతున్నారు. ఈ రుణాలు సకాలంలో చెల్లిస్తే ఇందులో 3% రాయితీ వస్తుంది.

నారాయణపేట-కొడంగల్ లిఫ్టుకు టెండర్లు
రెండు ప్యాకేజీలుగా పథకం

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు ప్రభుత్వం మంగళవారం టెండర్లు పిలిచింది. పథకాన్ని రెండు ప్యాకేజీలుగా విభజించిన ప్రభుత్వం మొత్తం రూ.2261.05 కోట్ల విలువైన పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు జారీ చేసింది. ప్యాకేజీ-1లో రూ.1134.82 కోట్ల అంచనా వ్యయంతో నారాయణపేట జిల్లా మక్తల్ మండలం భూతూరు గ్రామం వద్ద చేపట్టబోయే వివిధ పనులకు, నందుగుల, జయమ్మ చెరువుల అభివృద్ధికి టెండర్లు ఆహ్వానించింది. అలాగే, ప్యాకేజీ-2 కింద ఉట్కూరులో రూ.1126.23 కోట్లతో చేపట్టబోయే వివిధ పనులకు టెండర్లు పిలిచింది. టెండర్ల దాఖలుకు ఈ నెల 24 తేదీ తుది గడువుగా ప్రభుత్వం నిర్ణయించింది.

'షాద్‌నగర్' వంటి ఘటనలను సహించం: భట్టి



ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వంలో 'షాద్‌నగర్' వంటి సంఘటనలను సహించేది లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. షాద్‌నగర్ పట్టణ పోలీసులు ఓ దళిత మహిళను స్టేషన్‌కు తీసుకొచ్చి తీవ్రంగా కొట్టిన ఉదంతం గురించి తెలిసిందే. ఈ ఘటనపై అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం స్పందించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, సదరు దళిత కుటుంబానికి అండగా ఉండాలని భట్టికి రేవంత్ చెప్పారు. సంబంధిత పోలీసు సిబ్బంది, అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను భట్టి ఆదేశించారు. బాధితురాలికి వైద్య సహాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా నిలుస్తామని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఒక సీఐ సహా ఆరుగురు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ అధికారులు మాకు సహకరించడం లేదు

» వేం నరేందర్‌రెడ్డికి నూతన కార్పొరేషన్ చైర్మన్ల విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో వివిధ కార్పొరేషన్లు, సంస్థలు, శాఖల్లో పాతుకుపోయిన కొంతమంది అధికారులు తమకు ఏమాత్రం సహకరించడంలేదంటూ కొత్తగా నియమితులైన ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఆ అధికారులను ఉపేక్షిస్తే.. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఇటీవల 36 కార్పొరేషన్లు, సంస్థలకు చైర్మన్లను నియమించిన సంగతి తెలిసిందే. మంగళవారం సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఓ హోటల్లో ఇచ్చిన విందుకు వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ల పనితీరు గురించి నరేందర్‌రెడ్డి ఆరా తీయగా.. వారు అధికారుల వైఖరీ గురించి విన్నవించారు. ప్రభుత్వ పథకాల అమలు కోసం సాధ్యమైనంత వరకూ అధికారులను కలుపుకుని పోవాలని ఆయన వారికి దిశానిర్దేశనం చేశారు. అప్పటికీ సహకరించకుంటే తమకు నివేదించాలని సూచించారు. వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

రుణమాఫీ అమలులో అక్రమాలు
16 సహకార సంఘాల సీఈవోలపై వేటు

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పంటరుణమాఫీకి సంబంధించి అక్రమాలకు పాల్పడిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సీఈవో(చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)లపై చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర సహకారశాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్ తెలిపారు. 16 మంది కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు వేశామని మంగళవారం వెల్లడించారు. మరో 13 సంఘాల కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నామని, 92 మంది నుంచి సంజాయిషీ కోరామని డైరెక్టర్ పేర్కొన్నారు. రుణమాఫీ పొందే అర్హత ఉన్న రైతుల పేర్లను సదరు అధికారులు ప్రభుత్వానికి పంపలేదని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీఈవోలు అప్రమత్తంగా ఉండాలని ఉదయ్ కుమార్ హెచ్చరించారు.

యాదగిరిగుట్టలో 26 మందికి స్థానచలనం

» దేవస్థానంలో 15 ఏళ్ల తర్వాత బదిలీలు

భువనగిరి అర్బన్: రాష్ట్రప్రభుత్వం వివిధ శాఖల్లో చేపట్టిన బదిలీల్లో భాగంగా యాదగిరిగుట్ట దేవస్థానంలో 26 మందిని బదిలీచేసింది. మంగళవారం 20మంది ఉద్యోగులకు ఉత్తర్వులను అందజేసినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట దేవస్థానంలో మినిస్టీరియల్(మంత్రిత్వశాఖ) సిబ్బంది 91 మంది, మతపరమైన ఆచారాలు పర్యవేక్షించే సిబ్బంది 98 మంది, నాలుగో తరగతి ఉద్యోగులు 89 మంది కలిపి మొత్తం 278 పనిచేస్తున్నారు. ఇందులో ఐదుగురు ఏఈవోలు, 14 మంది సూపరింటెండెంట్లు, 18 మంది సీనియర్ అసిస్టెంట్లు, 24 మంది జూనియర్ అసిస్టెంట్లు ఉన్నారు. నిబంధన మేరకు 26 మందిని బదిలీ చేశారు. కానీ సిబ్బంది కొరత నేపథ్యంలో 20మంది(ఇద్దరు ఏఈవోలు, నలుగురు పర్యవేక్షకులు, ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు, తొమ్మిది మంది జూనియర్ అసిస్టెంట్లు)నే మంగళవారం రిలీవ్ చేశారు. 2009-10 నుంచి ఇప్పటివరకూ దాదాపు 15 ఏళ్లుగా బదిలీలు లేకపోవడంతో పలువురు ఇక్కడే పదోన్నతులు పొందారు.

మలి దశ ఉద్యమంలో
అగ్రగణ్యుడు గద్దర్: సీఎం రేవంత్‌రెడ్డి



రవీంద్రభారతిలో 'గద్దరన్న యాదిలో' సంస్మరణ కార్యక్రమంలో నివదిస్తూ నివాళులర్పిస్తున్న గోరటి వెంకన్న, అందెశ్రీ

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ మలి దశ ఉద్యమానికి ఊపిరి ఊదిన వారిలో అగ్రగణ్యుడు.. పాటను తూటాగా మార్చిన ప్రజా యుద్ధ నౌక.. గద్దర్' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయన చేసిన సాంస్కృతిక, సాహిత్య సేవకు గుర్తింపుగా నంది అవార్డులను గద్దర్ అవార్డులుగా తమ ప్రభుత్వం మార్చిందనీ గుర్తు చేశారు. మంగళవారం గద్దర్ వర్థంతి సందర్భంగా ఆయనతో తనకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తు చేసుకున్నారు. 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా.. పోరు తెలంగాణమా' అంటూ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆయువు పట్టుగా గద్దర్ నిలిచారన్నారు. పేద కుటుంబంలో పుట్టి ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన గద్దర్.. ఉన్నత కొలువుల వైపునకు దృష్టి సారించకుండా ప్రతి ఒక్కరికీ కూడు, గూడు, నీడ లభించాలన్న లక్ష్యంతో జీవితాంతం తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారన్నారు. తెలంగాణ జనసభలతో పాటుగా పలు ఉద్యమ సంస్థలను ఏర్పాటు చేశారనీ గుర్తు చేశారు.

ప్రొఫెసర్ జయశంకర్‌కు గవర్నర్ నివాళి



జయశంకర్ ఫొటోకు పూలమాల వేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నివాళి అర్పించారు. మంగళవారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో జయశంకర్ పాత్రను ఈ సందర్భంగా గవర్నర్ కొనియాడారు. డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో డీజీపీ జితేందర్, ఇతర ఉన్నతాధికారులు నివాళి అర్పించారు.

రూ.వెయ్యి కోట్లతో
స్వచ్ఛ బయో ప్లాంట్

(మొదటిపేజీ తరువాయి)

నెలకొల్పనుంది. మొదటి దశలో రూ.1000 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్‌ను నిర్మించి, 250 మందికి ప్రత్యక్షంగా, మరో 250 మందికి పరోక్షంగా ఉద్యోగావకాశాలు కల్పించనుంది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు తెలంగాణ అధికార ప్రతినిధి బృందంతో.. స్వచ్ఛ్ బయో చైర్‌పర్సన్ ప్రవీణ్ పరిపాటి మంగళవారం చర్చలు జరిపారు. స్వచ్ఛ్ బయోలో అంతర్జాతీయ భాగస్వామిగా ఉన్న సుగనిత్ బయో రెన్యువబుల్స్ కంపెనీ.. బయోమాస్, సెల్యులోజ్ నుంచి జీవ ఇంధనాలు, జీవ రసాయనాలు ఉత్పత్తి చేసే పేటెంట్ పొందడంతోపాటు అవసరమైన టెక్నాలజీని అభివృద్ధి చేసింది. ఈ కంపెనీ పెట్టుబడులు రాష్ట్రంలో సుస్థిర, పర్యావరణ అనుకూల వృద్ధికి దోహదపడే అవకాశాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం తరఫున అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రవీణ్ పరిపాటి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ వికేంద్రీకృత అభివృద్ధి, దృక్పథం తమను ఆకట్టుకుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములం కావడం తమకు సంతోషంగా ఉందన్నారు.

నగరంలో ట్రైజిన్ ఏఐ ఇన్నోవేషన్ సెంటర్..

ప్రముఖ టెక్నాలజీ కంపెనీ ట్రైజిన్.. హైదరాబాద్‌లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్‌ను నెలకొల్పనుంది. డేటా అనలిటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌లకు అవసరమయ్యే సొల్యూషన్లను అందించే ఈ కంపెనీ.. ఆరు నెలల్లో తన కార్యకలాపాలు ప్రారంభించనుంది. సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా ట్రైజిన్ కంపెనీ ప్రతినిధులతో సమావేశమై ఇందుకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కంపెనీ కార్యకలాపాలు ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతున్నాయి. ఇందులో వంద మంది పని చేస్తున్నారు. తాజా చర్చల అనంతరం కార్యకలాపాలను మరింత విస్తరించాలని కంపెనీ నిర్ణయించింది. ఇందులో భాగంగా రానున్న మూడేళ్ల కాలంలో వెయ్యి మంది ఉద్యోగులను నియమించుకొని శిక్షణ ఇవ్వనుంది. కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా రెండున్నర వేల మంది పని చేస్తున్నారు. ఇందులో వెయ్యి మంది భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 160 మిలియన్ డాలర్ల ఆదాయం కలిగి ఉన్న ట్రైజిన్ విస్తరణతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో హైదరాబాద్ మరింత పురోగతి సాధిస్తుందని ముఖ్యమంత్రి కార్యాలయం మంగళవారం ప్రకటనలో పేర్కొంది. ఐక్యరాజ్య సమితితోపాటు దాని అనుబంధ విభాగాలకు ఈ కంపెనీ రెండు దశాబ్దాలకు పైగా సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

ఆర్సీసీఎం విస్తరణతో కొత్త ఉద్యోగాలు..

టెక్నాలజీ, సర్వీసెస్ సొల్యూషన్స్‌లో పేరు పొందిన అమెరికన్ కంపెనీ ఆర్సీసీఎం తెలంగాణలో తమ కార్యకలాపాలు విస్తరించనుంది. రానున్న రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక



ఆర్సీసీయం కంపెనీ సీఈవో గౌరవ్ సూరీతో సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి దుద్దిళ్ల, సీఎస్ శాంతికుమారి

నిపుణులను నియమించి కార్యకలాపాలు కొనసాగించనుంది. అమెరికా తర్వాత విదేశీ గడ్డపై తొలిసారిగా కంపెనీ విభాగాన్ని తెలంగాణలోనే స్థాపించనుండడం గమనార్హం. ఈ మేరకు అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శ్రీధర్ బాబు.. ఆర్సీసీఎం సీఈవో గౌరవ్ సూరితో చర్చలు జరిపి అధికారుల సమక్షంలో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ రంగంలో బహుముఖ వృద్ధిని సాధించేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ క్రమంలో కంపెనీ విస్తరణకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని చెప్పారు. ఆర్సీసీఎం రాకతో హైదరాబాద్.. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసులు, ఇన్సూరెన్స్ రంగంలో సరికొత్త ఆవిష్కరణ కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ అంటేనే బిజినెస్..


తెలంగాణలో పెట్టుబడులకు అపారమైన అవకాశాలున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిశ్రమల అవసరాలు, అభిరుచికి అనుగుణంగా తమ ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని తెలిపారు. అమెరికాలో ఉన్న వ్యాపార అవకాశాలన్నీ తెలంగాణలో ఉన్నాయని, చైనాకు ప్రత్యామ్నాయంగా ఎదగాలనేది తమ సంకల్పమని పేర్కొన్నారు. తెలంగాణ అంటేనే వ్యాపారం.. తెలంగాణ అంటేనే పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తామని ప్రకటించారు. న్యూయార్క్‌లోని కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వర్కింగ్ లంచ్ అనంతరం వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఫార్మా, ఐటీ, టెక్నాలజీ, ఈవీ, బయోటెక్, షిప్పింగ్ రంగాల్లో పేరొందిన కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న చైర్‌పర్సన్‌లు, సీఈవోలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టుల గురించి వివరించారు. త్వరలోనే హైదరాబాద్‌లో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇది భారత దేశపు భవిష్యత్తుకు చిరునామాగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. దేశంలోనే జీరో కార్బన్ సిటీ ఇక్కడ ఏర్పడతుందన్నారు. ఫ్యూచర్ సిటీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ హబ్‌తోపాటు మెడికల్, టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్‌వేర్, ఫార్మా విలేజ్‌లను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఈ ఫ్యూచర్ సిటీ.. రాష్ట్ర అభివృద్ధితోపాటు పరిశ్రమలకు సిరుల పంట పండిస్తుందన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రాన్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి, అభివృద్ధి చేసేందుకు రూపొందించిన భవిష్యత్తు ప్రణాళికలు, తెలంగాణ చరిత్రపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో ఇది తన మొదటి అమెరికా పర్యటన అని.. ఇక్కడి నుంచి వీలైనన్ని పెట్టుబడులు తెలంగాణకు తీసుకెళ్లాలన్నదే తన లక్ష్యమని ప్రకటించారు. నిజాంలు నిర్మించిన 425 ఏళ్ల పురాతనమైన హైదరాబాద్ ఇంచుమించుగా అమెరికాతో సమకాలీనంగా ఉండటం ఆసక్తి రేపుతోందన్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తలందరూ ఒకసారి తెలంగాణకు రావాలని, హైదరాబాద్ నగరాన్ని సందర్శించాలని ఆహ్వానించారు.

అంధుల క్రికెట్ జట్టును అభినందించిన సీఎం

జీవితంలో ఎన్ని సవాళ్లు ఎదురైనా సంకల్పాన్ని సాధించాలనే పట్టుదలను ప్రదర్శిస్తున్న న్యూయార్క్‌లోని భారత అంధుల బాలుర క్రికెట్ జట్టును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి.. న్యూయార్క్‌లో క్రికెట్ జట్టు సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ఈ జట్టును కలుసుకునే అవకాశం రావడం ఎంతో అమూల్యంగా భావిస్తున్నానని, వీరు ఎందరికో స్ఫూర్తిదాయకులని అన్నారు.

టైమ్‌స్క్వేర్ తెరపై రేవంత్

న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్‌స్క్వేర్ వద్ద ఉన్న భారీ స్క్రీన్‌లపై సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన దృశ్యాలను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఆయన అభిమానులు ఈ ఏర్పాట్లు చేశారు.



ఎండగట్టండి

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది నెలలవుతున్నా ఎందుకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమకు రుణమాఫీ కాలేదంటూ పెద్ద సంఖ్యలో రైతులు బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌కు ఫోన్ చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ అమలుకు సంబంధించిన ప్రాతిపదికపై కూడా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యంపై గ్రామాల్లో రైతు రచ్చబండ నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పార్టీ నేతలకు పిలుపునిచ్చారు. రచ్చబండ తర్వాత సర్కారును నిలదీస్తూ ఆందోళనలు నిర్వహించాలని చెప్పారు. ఈ నెల 15న ప్రధాని మోదీ 11వసారి ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారని, ఆ రోజున ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశానికి కిషన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి 8 మంది ఎమ్మెల్యేల్లో సూర్యనారాయణ గుప్తా మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను సీరియస్‌గా తీసుకోవాలని, పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 8,9 తేదీల్లో ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. 14వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగాలో భాగంగా పార్టీ నిర్దేశించిన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. సుష్మాస్వరాజ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

క్రిమినల్ చట్టాల్లో మరింత పారదర్శకత: బండి

కొత్త క్రిమినల్ చట్టాలు పోలీసులు మరింత పారదర్శకంగా, జవాబుదారీగా పనిచేసేందుకు వీలు కల్పిస్తున్నాయని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అరెస్టయిన వ్యక్తుల గురించి ప్రజలకు తెలియజేసేందుకు ప్రతి పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ స్థాయి వ్యక్తి ఉంటారని, జిల్లా బయట ఎవరినైనా అరెస్టు చేస్తే ఆ సమాచారం కూడా సంబంధిత పోలీసు అధికారికి చేరుతుందని మంగళవారం ఆయన లోక్ సభలో ప్రశ్నోత్తరాల సమయంలో తెలిపారు. మానవ రవాణా విషయంలో భారతీయ న్యాయ సంహితలో కట్టుదిట్టమైన సెక్షన్లు చేర్చామని, ముఖ్యంగా స్త్రీలు, పిల్లల విషయంలో ఐదేళ్ల నుంచి యావజ్జీవ శిక్ష వరకు కఠిన శిక్షలుంటాయని తెలిపారు.

గవర్నర్‌ను కలిసిన మహిళా మోర్చా

రాష్ట్రంలో మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆరోపించారు. మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకీ పెరుగుతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇలాంటి ఘటనలను నియంత్రించేందుకు జోక్యం చేసుకోవాలని ఆమె గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. మంగళవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శిల్పారెడ్డి బృందం.. ఆయనకు వినతి పత్రం అందజేసింది.

అబద్ధాలకు తల్లిగారిల్లు, అత్తగారిల్లు కేసీఆర్‌దే

రేవంత్ హయాంలో హుందాగా అసెంబ్లీ .. ప్రతిపక్ష సభ్యులు మాట్లాడిందే ఎక్కువ

» కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పౌరుషం ఉంటే.. ఐటీఐఆర్ మంజూరు చేయించండి
» మూసీ ప్రక్షాళన అవినీతి కోసమైతే.. గంగా ప్రక్షాళనా అందుకేనా?
» బీజేపీ నేతలు కోతల రాయుళ్లు: జగ్గారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు అత్తగారిల్లు.. తల్లిగారిల్లూ కేసీఆర్‌దేనని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. పదేళ్ల పాలనలో రైతులకు రూ.2 లక్షల మేర రుణమాఫీ చేసిన కేసీఆర్.. దానికి ఏకంగా 8 కిస్తీలు తీసుకున్నారని పేర్కొన్నారు. అదే రూ.2 లక్షల మేరకు రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 8 నెలల్లో ఒకటే దఫాలో చేసిందని కొనియాడారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం ఇచ్చి 8 నెలలు గడవకుండానే ఇచ్చిన హామీ మేరకు పథకాలన్నీ ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఉత్తమ్ సహా సీనియర్ మంత్రుల నాయకత్వంలో పాలన సాఫీగా సాగుతోందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అసెంబ్లీ సమావేశాలు హుందాగా నడుస్తున్నాయంటూ కితాబునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశమే ఇవ్వలేదన్నారు. ఒక సందర్భంలో ప్రజా సమస్యలపై గళమెత్తిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాలనే రద్దు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 8 నెలల్లో మూడు సార్లు శాసనసభ సమావేశమైందని, 30 రోజుల పాటు సభ జరిగితే కేసీఆర్ ఒకే ఒక్క రోజు హాజరయ్యారన్నారు. సభలో మాట్లాడేందుకు అధికార పార్టీ సభ్యుల కంటే.. హరీశ్‌రావు, కేటీఆర్ సహా ప్రతిపక్ష పార్టీలకే ఎక్కువ సమయం ఇచ్చారని తెలిపారు. మాట్లాడేందుకు స్వేచ్ఛను ఇస్తున్నా.. ప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నా నిందలు వేస్తూనే ఉన్నారన్నారు.

మూసీని ప్రక్షాళన చేయాలా.. వద్దా?

"మూసీని ప్రక్షాళన చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటే డబ్బుల కోసమే చేస్తున్నారంటూ బీజేపీ నేతలు ఆరోపిస్తున్నరు. అలా అయితే.. ప్రధాని మోదీ గంగానది ప్రక్షాళన చేపట్టిందీ అవినీతి కోసమేనా? మూసీ ప్రక్షాళన చేయకుంటే పట్టించుకోవట్లేదంటరు. ఏం చేయాలి మరి? మూసీని ప్రక్షాళన చేయమంటరా.. వద్దంటరా? వద్దూ అంటే ఆ మేరకు పార్టీలో తీర్మానం చేసి చెప్పండి" అంటూ కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను నిలదీశారు. గంగానది ప్రక్షాళన అవినీతి కోసమేనంటూ ఏనాడైనా రాహుల్‌గాంధీ గానీ, ఇతర కాంగ్రెస్ నేతలు కానీ ఆరోపణలు చేశారా అని నిలదీశారు. ఈ మాత్రం జ్ఞానం, హుందాతనం బీజేపీ నేతలకు లేకపోవడం బాధాకరమన్నారు. బీజేపీ నేతల వద్ద మాటలే తప్ప చేతలు లేవని, ఆ పార్టీ నేతలు కోతల రాయుళ్లు అని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో సచివాలయం కళకళలాడుతోందని, సీఎం, మంత్రులు ఎవరి పనులు వారు చేసుకుంటున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వారిని కలుస్తూ.. వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రానికి పెట్టుబడుల కోసం అమెరికా వెళ్లిన సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబులు.. వివిధ కంపెనీల యాజమాన్యాలతో సంప్రదింపులు చేస్తూ ఉన్నారన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పౌరుషం ఉంటే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హైదరాబాద్‌కు ఐటీఐఆర్‌ను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో రైతు రుణమాఫీ ఫైళ్లకు బూజు పట్టిపోయిందని, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క వాటిని దులుపుతున్నారని ఓ ప్రశ్నకు సమాధానంగా జగ్గారెడ్డి చెప్పారు.

నేను లేకుండా నీటి విడుదలనా?
మోటార్లను ఎలా ఆన్ చేస్తారు?

» అధికారులపై మాజీ ఎమ్మెల్యే సంపత్ ఆగ్రహం
» అంతకుముందే కార్యక్రమాన్ని ప్రారంభించిన అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు
» ఉద్రిక్తతల మధ్య తుమ్మిళ్ల ఎత్తిపోతల నీటి విడుదల

అలంపూర్ చౌరస్తా/రాజోలి, ఆగస్టు 6: సాగునీటి విడుదల కార్యక్రమం రాజకీయ రంగును పులుముకున్నది. జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ మధ్య ఆధిపత్యపోరు ఉద్రిక్త పరిస్థితికి దారితీసింది. అలంపూర్ నియోజకవర్గం రాజోళి మండలం తుమ్మిళ్ల గ్రామ శివారులో గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.800 కోట్ల వ్యయంతో నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా నీటి విడుదల కార్యక్రమాన్ని తలపెట్టారు. దీనికి అధికారులు బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఆహ్వానించారు. ఎమ్మెల్యే విజయుడు తన అనుచరులు, స్థానిక రైతులతో కలిసి ఉదయం ఏడుగంటలకే తుమ్మిళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. స్టార్టర్లకు పూజలు చేసి మోటార్లను ఆన్ చేశారు. విషయం తెలుసుకున్న సంపత్‌కుమార్.. అనుచరులతో కలిసి హుటాహుటిన ప్రాజెక్టు వద్దకు బయలుదేరారు. ప్రాజెక్టు వద్దకు చేరుకున్న సంపత్ అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను లేకుండా మోటార్లు ఎలా ఆన్ చేస్తారంటూ ప్రశ్నించారు. అనంతరం మోటార్లను ఆఫ్ చేయించి.. తన అనుచరులతో కలిసి అక్కడ పూజలు చేశారు. అదే సమయంలో సాగునీరు కిందకు రాకపోవడంతో ఎమ్మెల్యే విజయుడు తన అనుచరులతో కలిసి డెలివరీ పాయింట్ వద్ద టెంటు వేసుకొని బైఠాయించారు. విషయం తెలుసుకున్న సంపత్‌కుమార్ ఎమ్మెల్యే విజయుడు అక్కడి నుంచి వెళ్లేదాక మోటార్లను ఆన్ చేయవద్దంటూ అధికారులను ఆదేశించారు. ఉద్రిక్తతలు ఏర్పడటంతో పోలీసులు భారీగా మోహరించారు. ఎమ్మెల్యే విజయుడితో పాటు ఆయన అనుచరులను అరెస్ట్ చేశారు. అనంతరం సంపత్ ఆదేశాలతో అధికారులు నీటిని విడుదల చేశారు. ఆ తర్వాత సంపత్‌ను కూడా అరెస్టు చేశారు.

స్థానికంలో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణకు
ట్రిపుల్ టెస్ట్ ఎప్పటికి పూర్తిచేస్తారు?

» 27 లోగా వివరాలు తెలియజేయండి.. ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ల నిర్ధారణకు సుప్రీం కోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల అమలుకు ఎంత సమయం పడుతుందో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 27లోగా సమాధానం తెలియజేయాలని చీఫ్ జస్టిస్ అలోక్‌అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం పేర్కొంది. 'స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్‌ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేయడానికి పూర్తి స్థాయి రాజ్యాంగబద్ధ, డెడికేటెడ్ కమిషన్ ఉండాలి. ఈ కమిషన్ జనాభా నిష్పత్తికి అనుగుణంగా బీసీ రిజర్వేషన్‌లను నిర్ధారించాలి. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లన్నీ కలిపినా 50% మించకూడదు. బీసీ కమిషన్ రిజర్వేషన్లను నిర్ధారించకపోతే స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లే కొనసాగుతాయి' అని సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్‌ల కల్పనకు ట్రిపుల్ టెస్ట్‌ను నిర్దేశించింది. కాగా, బీసీల జనాభా వివరాల సేకరణ, సర్వేల నిర్వహణకు 'తెలంగాణ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్'ను ప్రభుత్వం ఎంచుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమని.. స్థానిక సంస్థల్లో రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్‌తో రిజర్వేషన్లు స్థిరీకరించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ తెలంగాణ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ రిజర్వేషన్లు కల్పించాలని ఇతరులు హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టింది. రిజర్వేషన్‌లు స్థిరీకరించకుండా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పులను స్పీకర్ ఉల్లంఘిస్తున్నారు: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై 3 నెలలలోపు నిర్ణయం తీసుకోకుండా సుప్రీం కోర్టు తీర్పులను అసెంబ్లీ స్పీకర్ ఉల్లంఘిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌పై అనర్హత వేటు వేసేలా స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, వివేకానంద్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ కొనసాగించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరఫున గండ్ర మోహన్‌రావు వాదించారు. కైశం మేఘాచంద్రసింగ్, రాజేంద్రసింగ్ రాణా, కిహోటో హోలోహన్' తీర్పులను మహారాష్ట్ర సంక్షోభానికి సంబంధించిన కేసుల్లో సుప్రీంకోర్టు పునరుద్ఘాటించిందని.. మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని నిర్దేశించిందని పేర్కొన్నారు.

కోల్‌కతాలో
'కాళేశ్వరం' అఫిడవిట్లు

» అక్కడే పరిశీలిస్తున్న జస్టిస్ ఘోష్

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని బ్యారేజీల నిర్మాణాల్లో లోపాలపై విచారణలో భాగంగా ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌లు, ఇంజనీర్లు, నిపుణులు దాఖలు చేసిన అఫిడవిట్లను కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ కోల్‌కతాకు తీసుకెళ్లారు. వాటిని పరిశీలించిన తర్వాత ఎవరెవరికీ నోటీసులు జారీ చేయాలనే దానిపై నిర్ణయం తీసుకోనున్నారు. వాస్తవానికి ఈ నెల 5 నుంచి ఆయన హైదరాబాద్‌లో విచారణ జరపాల్సి ఉంది. కానీ, అఫిడవిట్లను ఇప్పటికే కమిషన్ సిబ్బంది పరిశీలించగా.. తుది పరిశీలన అనంతరం నోటీసుల జారీపై నిర్ణయం తీసుకోవాలని ఆయన భావిస్తున్నారు. ఈ దఫా కీలక వ్యక్తులకు నోటీసులిచ్చే అవకాశాలున్నాయి. అఫిడవిట్లు దాఖలు చేసిన వారిని కమిషన్ స్వయంగా ప్రశ్నించనుంది. ఇచ్చిన సమాచారం సహేతుకమైందా? కాదా? అనే అంశాలపై వారిని విచారించనుంది. అయితే ఎవరెవరికీ నోటీసులు ఇవ్వాలనే దానిపై కోల్‌కతా నుంచే ఆదేశాలు జారీ చేసే అవకాశాలున్నాయి. ఇదే క్రమంలో బహిరంగ విచారణ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను కూడా తీసుకోనున్నారు. ఆ తర్వాతే నివేదికపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అఫిడవిట్ల పరిశీలన అనంతరం రెండో వారంలో జస్టిస్ ఘోష్ హైదరాబాద్‌కు రానున్నారని సమాచారం. ఆ తర్వాతే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికతో పాటు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదికలు రప్పించుకోవడంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించనున్నారు. నివేదికలు ఇవ్వాలని పదేపదే కోరినా ఈ సంస్థలు స్పందించకపోవడంతో తదుపరి ఏం చర్యలు తీసుకోవాలనే దానిపై ఆయన నిర్ణయం తీసుకోనున్నారు.

గడ్డకట్టిన రక్తనాళాలకు ఆధునిక చికిత్స

- ఆ భాగాలను తొలగించాల్సిన అవసరం లేదు
- 'కిమ్స్-సన్‌షైన్' చైర్మన్ డాక్టర్ గురవారెడ్డి



బేగంపేటలోని కిమ్స్-సన్‌షైన్ ఆస్పత్రిలో వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ అండ్ డయాబెటిక్ ఫుట్ కేర్ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గురవారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రక్తనాళాలు గడ్డకట్టి ఇన్‌ఫెక్షన్ ఏర్పడితే ఆ భాగాలను తొలగించాల్సిన అవసరం లేదని, ఆధునిక చికిత్స అందుబాటులోకి వచ్చిందని కిమ్స్‌సన్‌షైన్ ఆస్పత్రి చైర్మన్, చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ ఏ.వీ.గురవారెడ్డి తెలిపారు. బేగంపేటలోని ఆస్పత్రిలో 'వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జరీ అండ్ డయాబెటిక్ ఫుట్ కేర్ డిపార్ట్‌మెంట్‌'ను ఆయన చీఫ్ గైనకాలజిస్టు డాక్టర్ ఏ.భవానీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రక్తనాళాలు గడ్డ కట్టడం, పాదాల్లో పుండ్లు మానకపోవడం వంటి సమస్యలకు గతంలో కచ్చితమైన చికిత్స లేకపోవడంతో ఆ భాగాన్ని తొలగించేవారన్నారు. ఇప్పుడు ఆధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో ఆయా భాగాలను తొలగించకుండానే చికిత్స చేస్తున్నారన్నారు. ఎండోక్రనాలజీ, కార్డియాలజీ విభాగాలు కలిసి రోగికి కచ్చితమైన చికిత్స అందించేందుకు ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. డాక్టర్ నిషాన్ రెడ్డి మాట్లాడుతూ నడుస్తుంటే పిక్కలు పట్టేయడం, మధుమేహం ఉన్న వారిలో పాదాల్లో పుండ్లు, పొగతాగే అలవాటు వల్ల కాలి వేళ్లు నల్లబడడం వంటి సమస్యలతో బాధపడే వారికి పాదాల స్కానర్, న్యూరోపతి చెకప్ టూల్స్ పల్స్ వాల్యూమ్ రికార్డింగ్ పరికరం సాయంతో సమస్య తీవ్రతను గుర్తించి సరైన చికిత్స అందించవచ్చని తెలిపారు.

దేవుడిపై విశ్వాసం లేకుంటే విమర్శలు దేనికి?

- హేతువాది కదిరే కృష్ణయ్యకు హైకోర్టు ప్రశ్న

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దేవుడిపై విశ్వాసం లేకపోతే నిశ్శబ్దంగా ఉండకుండా ఇతర పౌరుల విశ్వాసాలపై విమర్శలు చేయడం ఎందుకు? అని హైకోర్టు ప్రశ్నించింది. ఇలాంటివి వివాదాలుగా తలెత్తకుండా చూసుకోవాలని పిటిషనర్‌కు సూచించింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర స్వామి సుప్రభాతంపై ఓ సభలో అనుచిత వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ హేతువాది కదిరే కృష్ణయ్యపై పలు కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో బెదిరింపులు వస్తున్నందున తనకు భద్రత కల్పించాలని కోరుతూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషన్ తరపున సీనియర్ న్యాయవాది వీ రఘునాథ్ వాదనలు వినిపిస్తూ.. ఒకే అంశంపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. గాంబ్లర్ అయిన చీకోటి ప్రవీణ్ తదితరులు చంపుతామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో జోక్యం చేసుకున్న ధర్మాసనం.. 'దేవుడు, మతంపై విశ్వాసం లేకపోతే దేవుడికి మొక్కకుండా నిశ్శబ్దంగా ఉండవచ్చు కదా.. పక్కవారి విశ్వాలపై విమర్శలు చేయడం ఎందుకు? కమ్యూనిస్టు దేశమైన ఒకప్పటి సోవియెట్ యూనియన్ పతనం తర్వాత విడిపోయిన దేశాలన్నీ భారత్ కంటే ఎక్కువగా మతాన్ని విశ్వసిస్తున్నాయి. ఇక్కడ విమర్శలు చేయడం ఎందుకు?' అని ప్రశ్నించారు. న్యాయవాది రఘునాథ్ సమాధానమిస్తూ హేతువాదులు, నాస్తికులు మాట్లాడకపోయి ఉంటే ఒకప్పుడు హిందూ సమాజంలో దురాచారాలుగా ఉన్న సతీసహగమనం వంటివి సమసిపోయి ఉండేవి కాదని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. భద్రత కోసం పోలీసులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. విచారణ ఈనెల 12కు వాయిదా పడింది.

బాలికపై బీఆర్ఎస్ కౌన్సిలర్ అత్యాచారయత్నం

ఎడపల్లి: నిజామాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి యత్నించాడు. నిజామాబాద్ జిల్లా బోధన్ 3వ వార్డు కౌన్సిలర్ కొత్తపల్లి రాధాకృష్ణ వ్యక్తిగత పనిమీద సోమవారం రాత్రి కారులో నిజామాబాద్ బయలుదేరాడు. అదే సమయంలో బోధన్ మండలానికి చెందిన 17ఏళ్ల బాలిక ఆటో లో నిజామాబాద్ వెళుతోంది. గమనించిన రాధాకృష్ణ మార్గమధ్యలో ఎడపల్లి బస్టాండ్ వద్ద ఆటో ఆపి.. ఎక్కడికి వెళుతున్నావని బాలికను ప్రశ్నించాడు. తన తల్లికి అవసరమైన మందులు తీసుకురావడానికి నిజామాబాద్‌కు వెళుతున్నానని ఆ బాలిక చెప్పగా.. తనతో వస్తే మందులు ఇప్పిస్తానని నమ్మించి ఆమెను కారులో ఎక్కించుకున్నాడు. కారును సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి యత్నించాడు. దీనిపై అటుగా వెళుతున్నవారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రాధాకృష్ణను అరెస్టు చేసి పోక్సో కేసు నమోదు చేసి కోర్టు ఆదేశాలకు మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి అటవీ అనుమతులివ్వండి

- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖకు ఎన్‌హెచ్ఏఐ దరఖాస్తు
- మూడు నమూనాలతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక అందజేత

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం నిర్మాణానికి అడుగులు వేగంగా ముందుకు పడుతున్నాయి. ఈ రహదారి నిర్మాణానికి కీలకమైన అటవీ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర అటవీ, పర్యావరణశాఖకు జాతీయ రహదారుల ప్రాధికారసంస్థ (ఎన్‌హెచ్ఏఐ) తెలంగాణ విభాగం జూలై చివరి వారంలో దరఖాస్తు చేసింది. ఈ మేరకు కేంద్రానికి సమగ్ర ప్రాజెక్టు రిపోర్టునూ అందజేసింది. అదేవిధంగా ఉత్తరభాగం రోడ్డు నిర్మాణంలో అవసరమవుతున్న అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా.. ప్రభుత్వ భూములను ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన విషయాన్ని కేంద్రానికి వివరించినట్టు తెలిసింది. దీంతోపాటు ఉత్తరభాగానికి తాత్కాలిక నంబరు (ఎన్‌హెచ్ 161ఏఏ)ను కేటాయించిన విషయాన్ని కూడా నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ఈ వివరాలను పరిశీలించిన అనంతరం కేంద్రం అనుమతులకు సంబంధించి ఉత్తర్వులను వీలైనంత త్వరగానే విడుదల చేయనున్నట్టు తెలిసింది. మొత్తంగా కేంద్రం నుంచి అనుమతులు రాగానే.. రాష్ట్ర ప్రభుత్వం, ఎన్‌హెచ్ఏ.. ఉత్తరభాగం రోడ్డు నిర్మాణానికి ఈ నెలలోనే టెండర్లను ఆహ్వానించనున్నట్టు సమాచారం. 158 కిలోమీటర్ల మేర ఉండే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం రోడ్డు నిర్మాణాన్ని ఆరు ప్యాకేజీలుగా విభజించి టెండర్లను ఆహ్వానించనున్నారు. కాగా, అటవీ అనుమతుల కోసం కేంద్రానికి చేసిన దరఖాస్తుతో పాటు ఉత్తరభాగం రోడ్డు నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను ఎన్‌హెచ్ఏఐ సమర్పించింది. ఈ మూడు నమూనాలను ఆప్షన్-ఎ, ఆప్షన్-బీ, ఆప్షన్-సీగా పేర్కొని, ఆప్షన్-ఏను ప్రతిపాదిత నమూనాగా తెలిపింది. ఈ మూడింటిలో ఏయే మార్గాల గుండా రోడ్డు నిర్మిస్తే ఎంతమేర అటవీ భూములు కావాల్సి వస్తోంది, ఎన్ని కుటుంబాలకు ఇబ్బంది కలుగుతుందనే వివరాలను పొందుపరిచింది. నిర్మాణ ఖర్చుతోపాటు మార్గమధ్యంలో నిర్మించాల్సిన వంతెనలు, బ్రిడ్జిలకు సంబంధించిన వివరాలనూ పేర్కొంది. దాని ప్రకారం ఆప్షన్-ఏ అలైన్‌మెంట్ రహదారి నిర్మాణానికి చాలా అనుకూలంగా ఉందని, ముఖ్యమైన నగరాలు, జిల్లాలు, మండలాలన్నింటిని కలపడంతో పాటు తక్కువ కిలోమీటర్లలోనే ఉంటుందని తెలిపింది. ఈ అలైన్‌మెంట్‌లో రహదారికి 62.20 హెక్టార్ల అటవీ భూమి అవసరమవుతుంది.

15న మూడో విడత రుణమాఫీ

ఖమ్మం జిల్లా వైరా సభలో 2 లక్షలు మాఫీ చేయనున్న సీఎం

- అక్షర దోషాలు, ఆధార్, బ్యాంకర్ల తప్పిదాలు, ఎర్రర్లున్నా సరిచేసి మాఫీ
- మాఫీపై తప్పుడు ప్రచారం బీఆర్ఎస్, బీజేపీకి తగదు: మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర దినోత్సవాన.. ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను విడుదల చేసే సందర్భాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ చేతుల మీదుగా మూడో విడత రుణ మాఫీ చెక్కుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మం జిల్లా వైరాలో నిర్వహించే బహిరంగ సభ దీనికి వేదిక కానుందన్నారు. రెండు విడతల్లో లక్షన్నర వరకు మాఫీ చేశామని, ఈసారి సున్నా నుంచి రూ.2 లక్షల వరకు ఉన్న రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో మంగళవారం వ్యవసాయ, మార్క్‌ఫెడ్ ఇతర అనుబంధ శాఖలపై సమీక్ష అనంతరం విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడారు. 'రెండు విడతల మాఫీలో 30వేల ఖాతాలకు సాంకేతిక ఇబ్బందులు వచ్చాయి. కొన్ని బ్యాంకులు పొరపాటున కొన్ని ఖాతాల వివరాలు పంపలేదు. ఐదేళ్ల నుంచి రుణాలు తీసుకున్న రైతుల వివరాలు ఇవ్వాలని 32 బ్యాంకులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వ మాఫీ చేసిన ఖాతాలతో పాటు కొన్ని కుడి ఎడమగా అవే 40 లక్షల ఖాతాలు పంపించారు. బ్యాంకర్ల డేటా ప్రకారం 25-26 లక్షల రైతుకుటుంబాలను రుణ విముక్తులను చేస్తున్నాం. బ్యాంకర్ల తప్పిదాలున్నా, ఆధార్ ఎర్రర్లు ఉన్నా, అక్షర దోషాలున్నా అన్నీ సవరిస్తా'మని తెలిపారు. అప్పులున్న ఖాతాలు, తీర్చిన ఖాతాలు, తీర్చని ఖాతాల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉన్నాయని, వాటితో ఏఈవోలు, ఏవోలు రైతుల వద్దకు వెళ్లి ఎర్రర్లు సరిచేసి మాఫీ చేస్తారని ప్రకటించారు. రేషన్ కార్డు లేకపోయినా పాస్‌బుక్ ద్వారా కుటుంబ నిర్ధారణ చేసి రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని తెలిపారు. తొలి విడతలో 17 వేల ఖాతాలు ఎర్రర్ వచ్చాయని, వాటిలో 10 వేల ఖాతాలను సరిచేశామని, రూ.84 కోట్లు తిరిగి రాగా రూ.44 కోట్లు ఇచ్చేశామని, మిగతావీ ఖాతాలు సరి చేసి ఇస్తామని చెప్పారు. 2లక్షల వరకు మాఫీ పూర్తయిన తర్వాత మిగిలిన రైతులకు మాఫీ చేసే బాధ్యతను వ్యవసాయ శాఖ తీసుకుంటుందని వివరించారు. మాఫీ ఎందుకు కాలేదో కారణాలు సహా.. శాఖ వద్ద ఉన్న యాప్‌లో రైతుల వివరాలన్నీ ఉన్నాయని, 15 తర్వాత వాటిని సరిచేస్తామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిన పంటల బీమా పథకానికి ఈ ఖరీఫ్‌లోనే టెండర్లు పూర్తిచేసి, రైతులకు పైసా ప్రీమియం భారం లేకుండా అమలు చేస్తామన్నారు. మిగిలిన జిల్లాల్లో కూడా ప్రజాభిప్రాయ సేకరణ తర్వాత రైతు భరోసాపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కౌలు రైతుల విషయంలో కూడా స్పష్టత రావాల్సి ఉన్నదని ఆయన చెప్పారు.

కృష్ణమ్మ కరుణ.. ఆయకట్టుకు ఢోకా లేదు

వాతావరణ శాఖ అంచనా వేసినట్లు రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, కృష్ణా ప్రాజెక్టులన్నీ ఏక కాలంలో నిండడం గొప్ప విషయమని తుమ్మల పేర్కొన్నారు. ఆయకట్టుకు ఢోకా లేదని చెప్పారు. వానాకాలం 2 నెలలు ఉన్నందున ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రుణమాఫీపై తప్పుడు ప్రచారంతో, తప్పులను కప్పిపుచ్చుకోవడానికి రైతులను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం ప్రతిపక్షాలకు తగదన్నారు. మాఫీ కాని రైతులు వాట్సప్‌కు ఫిర్యాదు చేయాలని బీఆర్ఎస్ నేతలు ప్రకటనలు ఇస్తున్నారని, రూ.2 లక్షల మాఫీ పూర్తయినట్లు ప్రకటించిన తర్వాత మిగిలి నవారుంటే వివరాలు తెప్పించుకొని ఇవ్వాలని, వాటినీ మాఫీ చేస్తామని చెప్పారు. ఏనాడూ రైతుల బాగోగులు చూడని ఎన్డీఏ ప్రభుత్వం మాఫీని ప్రశ్నించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. ఈ నెలకు సరిపోయేలా ఎరువుల నిల్వలు ఉన్నాయని, పూర్తి సరఫరాకు కేంద్రం అనాసక్తిగా ఉన్నప్పటికీ, నిత్యం పర్యవేక్షిస్తున్నామని అన్నారు. మంగళవారం కేంద్ర మంత్రికి లేఖ రాసినట్లుగా తెలిపారు.

'ఉపాధి'లో అక్రమాలపై చర్యలు

- బర్లగూడెం ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్
- ముగ్గురు మేట్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కామేపల్లి, ఆగస్టు 6: ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో జాతీయ ఉపాధి పథకంలో వెలుగు చూసిన అక్రమాలపై అధికారులు చర్యలు చేపట్టారు. పలువురు ప్రభుత్వ ఉద్యోగులను ఉపాధి కూలీలుగా చూపుతూ వారి ఖాతాల్లో నగదు బదిలీ చేసిన వ్యవహారంలో ఓ ఫీల్డ్ అసిస్టెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. మరొకర్ని బదిలీ చేశారు. ముగ్గురు మేట్లను ఉపాధి హామీ పనుల నుంచి తొలగించారు. బర్లగూడెం పంచాయతీలో జరిగిన ఉపాధి అక్రమాలపై జూలై 9న 'ఉపాధి సొమ్ము ఉద్యోగుల ఖాతా ల్లోకి' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'ఉపాధి హామీ'లో అక్రమాలపై విచారణ చేపట్టాలని ఖమ్మం జిల్లా డీఆర్‌డీఏ అడిషనల్ పీవోను ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ విచారణ లో ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్, ముగ్గురు సీనియర్ మేట్లు అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. రాజేష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీఏ డేవిడ్ రాజును డిప్యుటేషన్‌పై వైరాకు బదిలీ చేశారు.

అరకొర విచారణతో కొందరిపైనే చర్యలు

'ఉపాధి' అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాల్లో ఉపాధి సొమ్ము జమ అయినట్లు సవివరంగా ప్రచురించింది. కానీ అధికారుల విచారణ నివేదికలో కొందరి పేర్లు లేకపోవడం గమనార్హం. నివేదికలో భూక్య చంద్రశేఖర్ అనే వ్యక్తి పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్‌గా పనిచేస్తున్నారని, అతడికి 12 రోజులకు రూ.2,470 జమ అయ్యాయని నివేదికలో పేర్కొన్నారు. దాంతో ఆ సొమ్ము రికవరీ చేయాలని ఆదేశించారు. అయితే అక్రమంగా ఉపాధి నిధులు పొందిన కొందరి పేర్లు నివేదికలో లేకపోవడం గమనార్హం. దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదానికి కారణమైన కారు

వ్యక్తిని ఢీకొన్న కారు.. అద్దం తగిలి వేరైన తల

- ఓఆర్ఆర్‌పై నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని ఢీకొన్న కారు
- నేరుగా బానెట్‌పై పడి అద్దానికి బలంగా తగిలిన వ్యక్తి
- అద్దం పగిలి దాని పదునుకు మొండెం నుంచి వేరై కారులో పడ్డ తల

శంషాబాద్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఆ వ్యక్తిది ఎంత దారుణమైన చావు! కారు ఢీకొట్టడంతో ఆ వ్యక్తి బానెట్‌పై పడి.. అద్దానికి (విండ్‌షీల్డ్) బలంగా తగిలాడు! ఆ వేగానికి కారు అద్దం పగిలిపోవడం.. కారులోకి చొచ్చుకెళ్లిన తల ఆ అద్దం పదునుకు శరీరం నుంచి వేరై కారులోపల పడటం.. క్షణాల్లో జరిగిపోయాయి. ఈ ఘోర రోడ్డు ప్రమాదం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఊటీపల్లికి చెందిన తొట్ల అంజయ్య అనే వ్యక్తి సోమవారం రాత్రి 9 గంటలకు ఓఆర్ఆర్‌పై నడుచుకుంటూ వెళ్తున్నాడు. గచ్చిబౌలి నుంచి తుక్కుగూడ వైపు వెళ్తున్న కారు అతడిని వెనుక నుంచి ఢీకొంది. అంజయ్య ఎగిరి కారు బానెట్‌పై పడ్డాడు. కారు అద్దం పగిలి అంజయ్య మెడను కోసేసింది. తల తెగి కారులో పడింది. తీవ్ర ఆందోళనకుగురైన కారు డ్రైవర్ డయల్ 100కు ఫోన్ చేసి ప్రమాదం గురించి చెప్పాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని తల మొండాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. కారు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు స్పీడులో ఉండటం, వ్యక్తి బానెట్‌పై పడి అద్దం పగిలి మెడను కోసిందని సీఐ తెలిపారు. ఘటనపై కేసు నమోదైంది.



గడ్డం సింధూర



ఎండీ సమీయుద్దీన్

ఒక్కరే... ఐదు సాధించారు

- 5 ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన ఖమ్మం యువతి, వికారాబాద్ యువకుడు
- 4 ఉద్యోగాలు సాధించిన జనగామ వాసి



బర్ల సాయిరాం

ఖమ్మం ఖానాపురంహవేలి, జనగామ కల్చరల్, మోమిన్‌పేట్, ఆగస్టు 6: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టసాధ్యమైన రోజుల్లో పలువురు అభ్యర్థులు నాలుగు, ఐదు ఉద్యోగాలకు ఎంపికై స్ఫూర్తిదాయకంగా నిలిచారు. ఖమ్మం నగరానికి చెందిన గడ్డం సింధూర, వికారాబాద్ జిల్లాకు చెందిన ఎం.డీ సమీయుద్దీన్‌లు ఈ ఘనత సాధించారు. వీరు ఆర్‌అండ్‌బీ శాఖలో రెండు, పాలిటెక్నిక్ అధ్యాపకులుగా, గ్రూప్-4 లో కలిపి ఐదు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇందులో సింధూర.. ఇటీవల విడుదలైన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మెయిన్స్‌కు సిద్ధమవుతోంది. సింధూర తండ్రి ఆదినారాయణ ప్రధానోపాధ్యాయుడు. ప్రస్తుతానికి ఏఈఈగా విధుల్లో చేరి భవిష్యత్తులో ఐఏఎస్ లక్ష్యంగా ముందుకెళ్తానని సింధూర తెలిపింది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం టేకులపల్లిలో సాధారణ కుటుంబంలో జన్మించిన సమీయుద్దీన్.. ప్రభుత్వ బడిలో విద్యాభ్యాసం పూర్తిచేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. రైతు అయిన కరీముద్దీన్‌కు వ్యవసాయ పనుల్లో సాయం చేస్తూనే పరీక్షలకు సన్నద్ధమయ్యాడు.కాగా, జనగామకు చెందిన బర్ల సాయిరాం 4 ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబంలో పుట్టినప్పటికీ తల్లిదండ్రులైన గణేశ్- ఉపేంద్ర ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధ్యమైందన్నాడు.

బస్సులో ప్రయాణికుడి వద్ద 4.8 కిలోల బంగారం

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 6: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండం కంకోల్ టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ముంబై నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్స్ బస్సులో తనిఖీ చేయగా చంద్రేశ్ అనే ప్రయాణికుడి వద్ద 4.8 కిలోల బంగారు నగలున్న ఉన్న సూట్‌కేస్ లభ్యమైంది. ఈ బంగారానికి సంబంధించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆభరణాల విలువ సుమారు రూ. 3కోట్ల వరకు ఉంటుందని అంచనా. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంగారెడ్డి పట్టణ పోలీసులకు అప్పగించారు.

గద్దర్ ఆలోచనా విధానాన్ని అనుసరిస్తున్నాం

- గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్ల విరాళం
- స్మృతి వనానికి నెక్లెస్ రోడ్డులో ఎకరం స్థలం
- ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వెల్లడి
- రవీంద్ర భారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ



గద్దర్ ప్రథమ వర్ధంతి సభలో మాట్లాడుతున్న భట్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గద్దర్ ఆలోచనా విధానాన్ని తమ ప్రభుత్వం ఆచరిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. గద్దర్‌ను విశ్వమానవుడిగా అభివర్ణిస్తూ ఆయన లాంటి వ్యక్తి శతాబ్దానికి ఒక్కరే పుడతారంటూ కీర్తించారు. మలి దశ తెలంగాణ పోరాటానికి పాట, మాట, ఆటతో ఊపిరి పోసిన గద్దర్‌కు గత ప్రభుత్వంలో సరైన గౌరవం, సరైన స్థానం దక్కలేదన్న బాధ తమను వెంటాడిందన్నారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్ర భారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న భట్టివిక్రమార్క మాట్లాడుతూ గద్దర్ ఇక లేరన్న వార్త తెలిసిన వెంటనే అందరికన్నా ముందు స్పందించింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని గుర్తుచేశారు. అమెరికా పర్యటన వల్ల ఆయన ఈ సభకు రాలేకపోయారని, కానీ గద్దర్ ఆలోచనలను నిత్యం ప్రజల్లో ఉంచడం కోసం ముందుగానే తమతో చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున గద్దర్ ఫౌండేషన్‌కు రూ.3 కోట్ల విరాళం ప్రకటించారు. గద్దర్ స్మృతి వనాన్ని నెక్లెస్ రోడ్డులో ఎకరం స్థలంలో ఏర్పాటు చేస్తామన్నారు. భారత రాజ్యాంగం ద్వారానే సమసమాజం సిద్ధిస్తుందన్న గద్దర్ ఆలోచనలపై పరిశోధనలు జరగాలని ఆకాంక్షించారు. ప్రతి జిల్లాలో ఏడాదికి రెండుసార్లు గద్దర్ ఆట, పాటను గుర్తుచేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఫౌండేషన్‌కు సూచించారు. సాంస్కృతిక పోరాట సారథి గద్దర్ అని మంత్రి సీతక్క కొనియాడారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడమే గద్దర్‌కు అర్పించే అసలైన నివాళి అని గద్దర్ ఫౌండేషన్ చైర్మన్ శాంతా సిన్హా అన్నారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ సభాధ్యక్షత వహించారు. ప్రొఫెసర్లు హరగోపాల్, కంచె ఐలయ్య, తమిళనాడు వీసీకే పార్టీ ఎంపీ తలైవర్ తిరుమావళవన్, సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ, గద్దర్ కుమారుడు సూర్యం, కూతురు వెన్నెల, వివిధ పార్టీల నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సాహితీవేత్తలు, సినీ రంగ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రతి నెలా కమిషనర్లు, ఎస్పీలతో వీసీ

- పోలీసింగ్‌పైన నిరంతర పర్యవేక్షణ
- ప్రత్యక్షంగా ఆరు నెలల నేర సమీక్ష
- నిఘా చీఫ్, ఉన్నతాధికారులతో డీజీపీ

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ నుంచి కమిషనర్లు, ఎస్పీల వరకు ప్రతి ఒక్కరి పనితీరుపై నిరంతర పర్యవేక్షణకు పోలీస్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇకపై ప్రతి నెల నేరాలు, నమోదు చేసిన కేసులు, నిందితుల అరెస్ట్, రికవరీ, శిక్షలు వంటి పోలీసింగ్‌కు సంబంధించిన అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించనున్నారు. నేరాల కట్టడి, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా డీజీపీ జితేందర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 6 నెలలకు ఒకసారి కమిషనర్లు, ఎస్పీలతో నేరుగా ఆయన సమీక్ష నిర్వహిస్తారు. నిఘా చీఫ్ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీలు శిఖాగోయల్, విజయ్‌కుమార్, సంజయ్‌కుమార్ జైన్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యతో కలిసి మంగళవారం అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐజీలు, కమిషనర్లు, ఎస్పీలు పాల్గొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, డ్రగ్స్, సైబర్ నేరాల కట్టడితో పాటు శాంతిభద్రతల పరిరక్షణ ఇతర కీలక అంశాలపై చర్చించారు. కమిషనర్లు, ఎస్పీలు అనుసరించాల్సిన విధానాలు, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణపై దిశానిర్దేశం చేశారు. క్షేత్ర స్థాయి అధికారులు, సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల్ని భాగస్వాములను చేయాలని డీజీపీ జితేందర్ కోరారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు అవలంబించాలన్నారు. ప్రభుత్వం యుద్ధం ప్రకటించిన నేపథ్యంలో గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మత్తు పదార్థాల కట్టడికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డయల్-100కు వచ్చే ఫోన్‌లకు ప్రతిస్పందన సమయాన్ని మెరుగుపరుచుకునే విషయంలో దృష్టిసారించాలని సూచించారు. పోలీస్ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా.. ఇటీవల బయటపడిన ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని డీజీపీ సూచించారు. రాష్ట్రంలో నమోదైన నేరాలు, శిక్షల శాతంపై సీఐడీ చీఫ్ షికా గోయల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్ని గుర్తించి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మత్తు పదార్థాల కట్టడికి చేపట్టిన చర్యలు, భవిష్యత్ ప్రణాళికను శాండిల్యా వెల్లడించారు.

మావోయిస్టుల కదలికలపై నజర్: నిఘా చీఫ్

ఇటీవలి పరిణామాల నేపథ్యంలో శాంతిభద్రతలను ప్రభావితం చేసే అంశాలు, మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని శివధర్‌రెడ్డి సూచించారు. ముఖ్యంగా మావోయిస్టు ప్రభావిత జిల్లాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు డీజీపీలు అభిలాష బిస్త్, వీవీ శ్రీనివాసరావు, విజయ్‌కుమార్, సంజయ్‌కుమార్ జైన్ తమ విభాగాలకు సంబంధించిన అంశాలపై వివరించారు. 33 కేసుల్లో నేరస్తులకు జీవితఖైదు పడేలా చర్యలు తీసుకున్న 36 మంది అధికారులు, 30 మంది ప్రాసిక్యూటర్లకు డీజీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. 27 హత్య, 6 అత్యాచార కేసులకు సంబంధించి న్యాయస్థానంలో నేరం రుజువు చేయడంలో దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూటర్లు సమన్వయంతో, సమర్థంగా పనిచేసినందుకు డీజీపీ అభినందించారు.





ఎన్నం మాధవి, సంతోషకుమార్

చేనేతల ప్రతిభకు గుర్తింపు

- ముగ్గురు చేనేత కళాకారులకు కొండా లక్ష్మణ్‌బాపూజీ పురస్కారాలు



గడ్డం బాలయ్య

భూదాన్‌పోచంపల్లి/చౌటుప్పల్/చౌటుప్పల్‌రూరల్, ఆగస్టు 6: ప్రతిభావంతులైన చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారం యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ముగ్గురు కళాకారులను వరించింది. భూదాన్‌పోచంపల్లికి చెందిన ఎన్నం మాధవి, సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన తిరందాస్ సంతోషకుమార్, చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గడ్డం బాలయ్య పురస్కారానికి ఎంపికయ్యారు. 285 కొయ్యలు, ఐదు సహజ రంగులు వాడి మూడు ఆసు మడతలతో ఎన్నం మాధవి రూపొందించిన 46.5 అడుగుల యార్డ్‌వేజ్ వస్త్రానికి పురస్కారం దక్కింది. అలాగే, 72 డిజైన్లు, 12 రంగులతో తిరందాస్ సంతోష్‌కుమార్ రూపొందించిన తేలియారుమాల్ అనే వస్త్రం అవార్డు తెచ్చిపెట్టింది. ఇక, 30 రకాల సహజ రంగుల వాడి నూతన ర్యాంపో డిజైన్‌లో బాలయ్య రూపొందించిన మల్‌బార్ సిల్కు చీర పురస్కారం సాధించి పెట్టింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఇఫ్లూలో బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లు

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 7 ఆగస్టు 2024
diksuchi@andhrajyothy.com



హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- బీఏ(ఆనర్స్/రీసెర్చ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. షిల్లాంగ్, లఖ్‌నవూ ప్రాంతీయ క్యాంపస్‌లలో కూడా ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. సీయూఈటీ యూజీ 2024 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఏటా నిర్దేశిత కోర్సులు పూర్తిచేసి ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. ఏడాది కోర్సు పూర్తిచేసి యూజీ సర్టిఫికెట్, రెండేళ్ల కోర్సు పూర్తిచేసి యూజీ డిప్లొమా, మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఏ డిగ్రీ, నాలుగేళ్లు చదివి బీఏ ఆనర్స్/రీసెర్చ్ డిగ్రీ పొందవచ్చు.

హైదరాబాద్ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇంగ్లీష్‌లో 40; అరబిక్, చైనీస్, ఫ్రెంచ్, జర్మన్, జపనీస్, కొరియన్, పర్షియన్, రష్యన్, స్పానిష్, ఇటాలియన్, పర్ఫార్మెన్స్ ఆర్ట్స్-హ్యూమానిటీస్, డిజిటల్ కమ్యూనికేషన్ సబ్జెక్టులలో ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

షిల్లాంగ్ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇంగ్లీష్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ సబ్జెక్టులలో ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.


లఖ్‌నవూ క్యాంపస్‌లో సబ్జెక్టులు-సీట్లు: ఇక్కడ ఇంగ్లీష్‌లో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. సీయూఈటీ యూజీ 2024 అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.550; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.275; దివ్యాంగులకు రూ.110
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 11
- **కౌన్సెలింగ్:** ఆగస్టు 20 నుంచి 22 వరకు
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 23 నుంచి
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- ఎంపీసీ స్ట్రీమ్(ఫార్మర్స్ కోటా) కింద బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ఏపీ ఈఏపీ సెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



కాలేజీలు-సీట్లు
- బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-బాపట్లలో 27 సీట్లు; కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-మడకశిరలో 20 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-బాపట్లలో 21 సీట్లు; కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-పులివెందులలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత
- గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.
- **వయసు:** జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య; దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 13
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

సీఐటీడీలో పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్

హైదరాబాద్-బాలానగర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్(సీఐటీడీ)- 'పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్(పీడీటీడీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 35 సీట్లు ఉన్నాయి. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా ఇన్ మెకానికల్ ఇంజనీరింగ్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 27 ఏళ్లు మించకూడదు.

స్పాట్ అడ్మిషన్స్: అభ్యర్థులు ఆగస్టు 19న డిప్లొమా బ్లాక్‌లో రిపోర్ట్ చేయాలి. ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదిన్నర వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుంది. మధ్యాహ్నం పదకొండు నుంచి పన్నెండున్నర వరకు రిటెన్ టెస్ట్ నిర్వహిస్తారు. సాయంత్రం రెండు గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. తరవాత కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది.

- **మొదటి సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **కాషన్ డిపాజిట్:** రూ.5000 ✦ **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.1200
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.700; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.350
- **స్పాట్ అడ్మిషన్స్ తేదీ:** ఆగస్టు 19
- **అభ్యర్థులు తమవెంట తీసుకురావాల్సిన పత్రాలు:** పదోతరగతి, డిప్లొమా సర్టిఫికెట్లు; టీసీ; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; రెండు ఫొటోలు; మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వికలాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రం, ఫీజులకు సంబంధించిన డీడీలు/యూపీఐ



- **వేదిక:** రూమ్ నెంబర్ 102, డిప్లొమా బ్లాక్, సీఐటీడీ, బాలానగర్, హైదరాబాద్-500037.
- **వెబ్‌సైట్:** www.citdindia.org

బెంగళూరు ఐఐఎంలో డాక్టోరల్ ప్రోగ్రామ్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎంబీ) - డాక్టోరల్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్/ఐఐఎంబీ టెస్ట్ స్కోర్ ఆధారంగా షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ఐఐఎంబీ టెస్ట్‌ను రెండు విడతల్లో నిర్వహిస్తారు. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేసుకోవచ్చు.



స్పెషలైజేషన్‌లు: డెసిషన్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఎకనామిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్స్ అండ్ అకౌంటింగ్, మార్కెటింగ్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ అండ్ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, స్ట్రాటజీ

అర్హత: ఏదేని స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ/అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ డిగ్రీ/రెండేళ్ల పీజీ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. బీకాంతోపాటు ద్వితీయ శ్రేణి మార్కులతో సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎస్ ఉత్తీర్ణులు; ప్రథమశ్రేణి మార్కులతో నాలుగేళ్ల ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. స్పెషలైజేషన్‌ను అనుసరించి 2025 జనవరి 24 నాటికి జీమ్యాట్/జీఆర్ఈ/క్యాట్/గేట్/జేఆర్ఎఫ్ నెట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేదంటే ఐఐఎంబీ నిర్వహించే టెస్ట్ రాయాల్సి ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జాతీయ పరీక్ష వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.1000, రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.1500 చెల్లించాలి. ఐఐఎంబీ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒక స్పెషలైజేషన్‌కు అప్లయ్ చేస్తే రూ.2200; రెండు స్పెషలైజేషన్‌లకు అప్లయ్ చేస్తే రూ.2700 చెల్లించాలి.
- **దరఖాస్తు విండో ఓపెన్:** 2025 జనవరి 24 వరకు
- **ఐఐఎంబీ టెస్ట్ తేదీలు:** 2024 నవంబరు 17, 2025 ఫిబ్రవరి 2
- **ఇంటర్వ్యూలు:** 2025 మార్చి 13, 14, 15
- **వేదిక:** బెంగళూరు క్యాంపస్ ❖ **వెబ్‌సైట్:** iimb.ac.in

SCHOLARSHIP ALERT

Bharti Airtel

Description: Bharti Airtel Foundation invites applications from deserving students enrolled in technology or engineering undergraduate and integrated courses (up to 5 years) at the top 50 NIRF (engineering) institutions across India. The program is designed to support students from diverse socio-economic backgrounds, with focus on girls, to help them become future technology leaders.

Eligibility: For the Bharti Airtel Scholarship Program 2024-25, students should meet the following eligibility criteria:
- Confirmed admission in the first year (starting with the 2024 cohort) of the UG/5 year integrated courses in fields of Electronics & Communication, Telecom, Information Technology, Computer Sciences, Data Sciences, Aerospace and Emerging Technologies (AI, IoT, AR/VR, Machine Learning, Robotics) at the top 50 NIRF Engineering institutions across India. (Basis the latest list available).
- Must be a citizen and resident of India
- Family annual income from all sources should not exceed INR 8.5 Lakh
- Applicants should not be recipients of any other scholarship or grants for the same purposes supported by Bharti Airtel Foundation.

NOTE: Girl students are encouraged to apply.

Prizes & Rewards: Scholarships are for the full duration of the UG courses including integrated courses of up to 5 years (subject to meeting the renewal criteria).
- Each scholarship covers 100% of annual fees as per the fee structure of the respective institute/universities.
- The hostel and mess fees shall be given to all eligible students who apply for it
- For students staying in PG/outside hostel, the support shall be extended as per the Hostel/Mess charges of the institute
- A laptop will be provided in the first year of the course
- Once the Bharti Scholars graduate and are subsequently gainfully employed, they will undertake to voluntarily extend financial support to at least one student at a school or college level at any point of time, to the extent they can.

NOTE: Refundable and security deposits are not covered under the Bharti Airtel Scholarship 2024-25. Students are responsible for these payments and their refunds.

Last Date to Apply: 31-08-2024
Application mode: Online application only
Short Url: ww.b4s.in/aj/BHRSP1

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.
- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.
Last Date to Apply: 10-09-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/ASPI2

Raman Kant Munjal



Description: The Raman Kant Munjal Scholarships 2024-25 is an initiative by the Raman Kant Munjal Foundation, supported by Hero FinCorp, that aims to help undergraduate students pursuing finance-related courses to pursue their dreams of a promising career and a better life.

Eligibility: Students enrolled in the first year of BBA, BFIA, B.Com. (H, E), BMS, IPM, B.A. (Economics), BBS, BBI, BAF, B.Sc. (Statistics), or any other finance-related degree courses are eligible.
- Applicants must have secured at least 80% marks in Classes 10 and 12.
- The annual family income of the applicants should be less than INR 4 lakh.
- Open for Indian nationals only.

Prizes & Rewards: Scholarship from INR 40,000 to INR 5,50,000 per year for three years
Last Date to Apply: 20-08-2024
Application mode: Online applications only
Short Url: ww.b4s.in/aj/RMKSP4

buddy4study.com



నిజాయితీ

రామ కృష్ణా పురంలో శేషయ్య, భూషయ్య అనే ఇద్దరు వ్యాపారులు ఉండేవారు వారిద్దరి మధ్య వ్యాపారపరంగా పోటీ ఎక్కువ ఉండటం వల్ల ఇద్దరూ ప్రత్యర్థుల లాగా ఎదుటి వారిని అధిగమించాలనే ఆలోచనల్లో ఉండేవారు. ఒక రోజు శేషయ్య తన దుకాణంలో కూర్చుని లెక్కలు రాసుకుంటూ ఉండగా అతని దగ్గరికి తిరుపతి అనే యువకుడు వచ్చి గుమాస్తా ఉద్యోగం కావాలని అడిగాడు. ఆ యువకుడిని అంతకు ముందే ఎక్కడో చూసినట్లుగా అనిపించి, ఏమోయ్ నువ్వు ఇంతకు ముందు భూషయ్య కొట్టులో పనిచేసినట్టు ఉన్నావు కదూ అని అడిగాడు శేషయ్య. దానికి తిరుపతి అవునండీ అక్కడ జీతం చాలడం లేదనిపించి పని మానేశాను అని చెప్పాడు తిరుపతి. దానికి శేషయ్య రేపు ఇక్కడ కూడా జీతం చాలడంలేదు అనిపిస్తే ఏం చేస్తావు? అని అడిగాడు. నేను చేసే పనికి జీతం తక్కువనిపిస్తే మిమ్మల్ని పెంచమని అడగడంలో తప్పు లేదు కదండీ అన్నాడు తిరుపతి. 'మరి నీకు ఉద్యోగమిస్తే, నాకు ఏదైనా ప్రత్యేక ప్రయోజనం ఉంటుందా? అంటే భూషయ్య వ్యాపార రహస్యాలు నాకు చెబుతావా?' అని అడిగాడు శేషయ్య. దానికి తిరుపతి 'అయ్యో రామా అది మాత్రం చేయనండీ. అలా చేస్తే రేపు నా వ్యాపార రహస్యాలు కూడా మరో చోట చెప్పవని నమ్మకం ఏమిటి అని మీరునన్ను అనుమానిస్తారు కాబట్టి ఒక యజమాని విషయాలు మరొకరితో అసలే చెప్పను' అన్నాడు తిరుపతి. ఆ మాటలకు సంతోషించిన శేషయ్య 'నీకు మంచి తెలివి తేటలే కాక నిజాయితీ కూడా ఉన్నట్లు తోస్తున్నది. రేపు ఉదయం నుంచే నువ్వు పనిలో చేరవచ్చు' అన్నాడు.

సరైన నీడ ఏది?



5 తేడాలను కనుక్కోండి





ఎన్ని కుక్కలు, పిల్లులు ఉన్నాయి?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 377

		3	
		4	
	1		
	3		

సుడోకు - 376 సమాధానం

2	4	5	6	3	1
1	6	3	5	2	4
6	3	2	1	4	5
4	5	1	2	6	3
3	1	6	4	5	2
5	2	4	3	1	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.